ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
18-5-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 107 పేజీలు: 10+4 వెల: 6.50

రష్యా చమురుపై ఆంక్షల పునరుద్ధరణ

భారత్ రక్షణ వ్యవస్థలోకి మరో 'కిల్లర్ మిస్సైల్'

5లో


ఆదివారం గోథెన్‌బర్గ్‌లో 'స్వీడన్ రాయల్ ఆర్డర్ ఆఫ్ పోలార్‌స్టార్'ను అందుకుంటున్న ప్రధాని

## ప్రధాని మోడీకి స్వీడన్ అత్యున్నత పురస్కారం

### 'స్వీడన్ రాయల్ ఆర్డర్ ఆఫ్ పోలార్ స్టార్' బహూకరణ

### మోడీకి 31వ అంతర్జాతీయ గౌరవం

**గోథెన్‌బర్గ్,మే 17:** భారత ప్రధాని నరేంద్ర మోడీకి స్వీడన్‌దేశపు అత్యున్నత పురస్కారం లభించింది. అత్యంత ప్రాచీనమైన ఈ అవార్డు అందుకున్న అరుదైన విదేశీ ప్రముఖుల్లో ప్రధానిమోడీ నిలిచారు. "స్వీడన్ రాయల్ ఆర్డర్ ఆఫ్ పోలార్‌స్టార్"ను ఆదివారం రాజధాని గోథెన్‌బర్గ్‌లోజరిగిన ప్రత్యేక ఈవెంట్‌లో ఆయనకు అందచేసారు. >>2



## నైరుతి తాకిడి

### అండమాన్‌లోకి ప్రవేశించిన రుతుపవనాలు

### వారం రోజుల ముందే కురుస్తున్న వానలు

### ఈ యేడాది సూపర్ ఎల్‌నినోకు అవకాశం!

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** మండే ఎండలతో అల్లాడి పోతున్న ప్రజలకు వాతావరణశాఖ చల్లటి కబురు చెప్పింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు భారతదేశంలోకి ప్రవేశించాయి. ఆదివారం అండమాన్ తీరాన్ని తాకాయి. వీటి ప్రభావంతో ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సాధార ణంగా రుతుపవనాలు జూన్ 1వ తేదీ నాటికి కేరళ తీరాన్ని తాకుతాయి. కానీ ఈ ఏడాది వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల సాధారణం కంటే ముందే, అంటే ఈ నెల 26వ తేదీ నాటికే రుతుపవనాలు కేరళకు వచ్చే అవకాశం ఉందని భారత వాతా వరణ కేంద్రం (ఐఎండి)అంచనా వేస్తోంది. దీనివల్ల దేశవ్యాప్తంగా ఎండల తీవ్రత తగ్గి, కాస్త ఉపశమనం లభించనుంది. అయితే రుతుపవనాలు ముందే వస్తున్నాయన్న సంతోషం ఉన్నప్పటికీ, వర్షపాతంపై మాత్రం వాతావరణశాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. ఈయేడాది పసిఫిక్ మహాసముద్రంలో సూపర్ ఎల్‌నినో పరిస్థి >>2



### కంభంలో 43.3$^{0}$ గరిష్ట ఉష్ణోగ్రత

### ఈ వారంలో 44 డిగ్రీలు దాటే ప్రమాదం

### వడదెబ్బకు నలుగురు బలి

## నిప్పుల కుంపటి


**విజయవాడ,మే 17,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఎండలు దడపుట్టిస్తున్నాయి.. వేసవి దెబ్బకు అన్ని వయస్సుల ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇళ్లలో సైతం వెచ్చటి వాతావరణం ఉంటుంది. ఏసిలు సైతం వేసవి తాపానికి ఉపశమనం ఇవ్వని పరిస్థితి నెలకుని ఉంది.వడగాల్పులకు ఎన్టీఆర్. శ్రీకాకుళం,కృష్ణా, గుంటూరు జిల్లాలో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందినట్లు సమాచారం.రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాలులు, ఉక్కపోత తీవ్రత పెరుగుతోందని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. వారం రోజుల పాటు ఈ పరిస్థితి కొనసాగుతుందని తెలిపారు. ఆదివారం మార్కాపురం జిల్లా కంభంలో 43.3డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని తెలిపారు. నంద్యాల(జి) ఆళ్లగడ్డలో 42.8, నెల్లూరు జిల్లా గూడూరులో 42.5 వైఎస్సార్ కడప జిల్లా చెన్నూరులో 42.3, తిరుపతి జిల్లా >>2

# ఆక్వా రైతులను రక్షించండి

### వారికి ప్రయోజనం చేకూరేలా నిర్ణయం తీసుకోవాలని కేంద్రానికి సిఎం చంద్రబాబు లేఖ

### రొయ్యల ఫీడ్ ధరలపై ప్రత్యేక సమావేశంలో చర్చ

### ధరలను పెంచాలన్న ఫిషరీస్ కమిషనర్



**విజయవాడ మే 17, ప్రభాతవార్తప్రతినిధి:** రొయ్యల ఫీడ్ ధరల పెంపు అంశంపై ఆక్వా రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, శాస్త్రవేత్తలు, ప్రాసెసర్లు, సంబంధిత శాఖల అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం కీలక సమావేశం నిర్వహించింది. సచివాలయంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఫీడ్ ధరల పెంపు ప్రభావం, ఆక్వా రంగ భవిష్యత్తు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై విస్తృత చర్చ జరిగింది. సమావేశంలో ఫిషరీస్ కమిషనర్ రాష్ట్రంలో ప్రస్తుత ఆక్వా పరిస్థితులు, రొయ్యల ఉత్పత్తి, ఫీడ్ వినియోగం, ప్రస్తుతం ఉన్న ఫీడ్ ధరలు మరియు ఫీడ్ తయారీ సంస్థలు కోరుతున్న ధరల పెంపుపై వివరించారు. మరోవైపు రైతులు ప్రస్తుత ధరలను కొనసాగించాలని కోరిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. సిఐబిఎ శాస్త్రవేత్తలు జనవరి 2026 నుంచి మే 2026 వరకు సోయా, ఫిష్ మీల్, ఫిష్ ఆయిల్ వంటి ప్రధాన ముడి పదార్థాల ధరలు భారీగా పెరిగినట్లు వివరించారు. ఈ పెరుగుదల కారణంగా ఫీడ్ తయారీ వ్యయం సగటున కిలోకు రూ.31.03 వరకు పెరిగిందని వెల్లడించారు. ప్రత్యామ్నాయ ముడి పదార్థాల వినియోగంపై కూడా సూచనలు చేశారు. ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ జనవరి నుంచి ఏప్రిల్ 2026 మధ్య ప్రధాన ముడి పదార్థాల ధరలు 20 శాతం కంటే ఎక్కువగా పెరిగాయని తెలిపారు. ఫిష్ మీల్ ధర మెట్రిక్ టన్నుకు రూ.1.55 లక్షల నుంచి రూ.2.40 లక్షలకు, ఫిష్ ఆయిల్ రూ.2.80 లక్షల నుంచి రూ.4.40 లక్షలకు, సోయా లెసితిన్ రూ.68 వేల నుంచి రూ.1.10 లక్షలకు, డీఎల్‌ఎం రూ.2.71 లక్షల నుంచి రూ.6.50 లక్షలకు పెరిగినట్లు వివరించారు. ఈ ముడి పదార్థాల ధరల పెరుగుదల వల్ల ఒక్కో మెట్రిక్ టన్ను ఫీడ్ తయారీలో సుమారు రూ.25,115 అదనపు భారం పడుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రొయ్యల ఫీడ్ ధరలను కిలోకు రూ.25 నుంచి రూ.31 వరకు పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. లేకపోతే ఫీడ్ తయారీ యూనిట్లు కొనసాగించడం కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

అయితే రైతు ప్రతినిధులు దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముడి పదార్థాల ధరలు పెరిగినప్పుడు మాత్రమే ఫీడ్ ధరలు పెంచుతున్న కంపెనీలు, ధరలు తగ్గినప్పుడు మాత్రం రైతులకు లాభం చేకూర్చడం లేదని >>2



## క్వాంటం టెక్నాలజీకి అమరావతి కేంద్రం

### రాజధానివైపే శాస్త్రవేత్తల చూపు: మంత్రి లోకేష్

**విజయవాడ, మే 17, ప్రభాతవార్త ప్రతినిధి:** క్వాంటమ్ టెక్నాలజీకి అమరావతి కేంద్రమని ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. యువ భారతీయులు అమరావతిలో క్వాంటమ్ టెక్నాలజీ నిర్మాణంలో భాగస్వామ్యం అవుతామని అంటున్నారని పేర్కొన్నారు. గుంటూరుకు చెందిన రిక్షాడ్రైవర్ కుమార్తె పల్లవి కాయాల క్వాంటమ్ రంగంలో ప్రతిభ కనబరుస్తోందని తెలిపారు. టెన్త్‌లో 600/600 మార్కులు సాధించిన పల్లవి ఇప్పుడు త్రిపుల్ ఐటి శిక్షణ పొందిన ఇంజినీర్ అని చెప్పుకొ >>2



## మళ్లీ పెరిగిన సిఎన్‌జి

### రూపాయి హెచ్చింపు

### 48 గంటల్లో రెండోసారి

**న్యూఢిల్లీ, మే 17:** ప్రముఖ గ్యాస్ పంపిణీ సంస్థ ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ (ఐజిఎల్), ఆదివారం కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సిఎన్‌జి) ధరలను కిలోకు రూ.1 చొప్పున పెంచింది. ఈ నిర్ణయంతో వారం రోజుల్లో ఇంధన ధరలు పెరగడం ఇది రెండోసారి.రెండు రోజుల క్రితమే (మే 15న) కిలో సిఎన్‌జిపై రూ.2 పెంచింది. దీంతో 48 గంటల్లోనే కిలోకు మొత్తం రూ.3 పెంచడంతో సిఎన్‌జి ఉపయోగించే వాహనదారులపై >>2

## తెలంగాణ ఎప్‌సెట్‌లో రాణించిన ఏపి విద్యార్థులు

### ఇంజినీరింగ్‌లో 3వ ర్యాంక్: ఎం. వంశీధర్ రెడ్డి (పులివెందుల)

### నాలుగో ర్యాంక్ : జె. రోషన్ మణిదీప్ రెడ్డి (గుంటూరు)

### అగ్రి-ఫార్మసీలో 6వ ర్యాంక్: జెరూష (సత్యసాయి జిల్లా)

### 9వ ర్యాంక్ : మారుతి సత్యశ్రీకర్ (తూ.గో జిల్లా)


ఎం. వంశీధర్ రెడ్డి


జె. మణిదీప్ రెడ్డి


జెరూష


మారుతి సత్యశ్రీకర్

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 17:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలతోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఎప్ సెట్-2026 ఫలితాలను ఆదివారం ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు విడుదల చేశారు. ఇంజనీరింగ్‌లో 73.36 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించగా.. అగ్రికల్చర్, ఫార్మసీలో 86.27 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఎప్‌సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను వారం రోజుల్లో ప్రకటించనున్నట్టు తెలిపారు. కూకట్‌పల్లిలోని జేఎన్‌టియు క్యాంపస్‌లో ఎప్‌సెట్ ఫలితాలను విడుదలచేశారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ కార్యదర్శి ఎం యోగితా రాణా, కళాశాల విద్య కమిషనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, జేఎన్‌టియు విసి ప్రొఫెసర్ కిషన్ కుమార్ రెడ్డి, రెక్టార్, ఎప్‌సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, ఎప్ సెట్ కో కన్వీనర్ ప్రొఫెసర్ బాలు నాయక్ పాల్గొన్నారు. ఎప్ సెట్-2026 పరీక్షల్లో భాగంగా ఈ నెల 4, 5 తేదిల్లో అగ్రికల్చర్, పార్మసీ పరీక్షలను >>2

## ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

### జనసేన నేతల భేటీలో డి.సిఎం పవన్

### కమిటీల ఏర్పాటుపై ఆదేశాలు



**విజయవాడ,మే 17,ప్రభాతవార్తప్రతినిధి:** క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై నిరంతరం దృష్టి పెట్టాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశించారు.పార్టీ సంస్థాగత కమిటీలు తమకు నిర్దేశించిన బాధ్యతల నిర్వహణలో క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. జనసేన కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత >>2



## నేడు కేరళం సిఎం పదవీ ప్రమాణం

### కాంగ్రెస్‌కు 12 మంత్రి పదవులు

**తిరువనంతపురం:** కేరళలో యూడిఎఫ్ కొత్త ప్రభుత్వం కొలువు తీరనుంది. ముఖ్యమంత్రిగా విడి సతీశన్, మరో 20 మంది క్యాబినెట్ మంత్రులు మే 18న ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకు సంబంధించిన జాబితాను సతీశన్ ఆదివారంనాడు లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌కు సమర్పించారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో సోమవారం ఉదయం 10 గంట లకు ప్రమాణస్వీకారం ఉంటుంది. ఇటీవల జరిగిన కేరళం అసెంబ్లీ ఎన్నికల్లో మూడింట రెండు వంతులకు పైగా మెజారిటీని యూడిఎఫ్‌సాధించింది. మొత్తం 140 >>2

## మహిళలపై అఘాయిత్యాలు 48 గంటల్లోనే నిందితుల అరెస్టు

### -హోం మంత్రి అనిత


ఆదివారం మంత్రి అనితకు కాణిపాకం ఆలయంలో స్వామి వారి జ్ఞాపికను అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్

**కాణిపాకం, మే 17 ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల సంఘటనల్లో నిందితులను 24 గంటల నుండి 48 గంటల్లోపు అరెస్టు చేస్తున్నట్లు రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం మంత్రి వంగలపూడి అనిత కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై ఎలాంటి అఘాయిత్యాలు జరిగినా 24 గంటల నుండి 48 గంటల్లోపే నిందితులను పట్టుకోవడం జరుగుతోందని, అలాగే నిందితులకు త్వరితగతిన తగిన శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం రాష్ట్రంలో ఫోరెన్సిక్ విభాగంను బలోపేతం చేసినట్లు మంత్రి వంగలపూడి అనిత >>2

## సిబిఐ కస్టడీకి 'నీట్' నిందితురాలు

### 14 రోజులు విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే17:** నీట్ పేపర్ లీక్ కేసులో సిబిఐ విచారణ వేగవంతం చేసింది. ఈ కేసులో అరెస్టైన నిందితురాలు మనీషా మంధారే విచారణ కోసం కోర్టు ఆమెను 14 రోజుల పాటు సిబిఐ కస్టడీకి అనుమతిస్తూ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. జీవశాస్త్ర నిపుణురాలైన ఆమెను సిబిఐ అధికారులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఇక లీకేజీ సూత్రధారి, నీట్ కమిటీలో రసాయనశాస్త్ర నిపుణుడిగా ఉన్న పివి కులకర్ణిని >>2





ఆదివారం నెదర్లాండ్స్‌లోని అఫ్స్లూఇట్‌డిజ్క్ డ్యామ్‌ను సందర్శించిన ప్రధాని మోడీ

# స్వీడన్ అత్యున్నత పురస్కారం

>> ప్రధానిమోడీకి ఇప్పటివరకూ 30 అంతర్జాతీయ పురస్కారాలు లభించగా 31వ అవార్డుగా స్వీడన్ అవార్డు లభించింది. 1748లో ఏర్పాటుచేసిన ఈపురస్కారం స్వీడన్‌కు కానీ, స్వీడన్ దేశ శ్రేయస్సుకోసం కృషిచేసినవారు, అలాగే స్వీడన్‌తో అన్నిరంగాల్లో సత్సంబంధాలు సుదీర్ఘకాలంగా కొనసాగించిన విదేశీ ప్రముఖులకు ఈ పురస్కారాన్ని అందిస్తారు. ప్రజాసంక్షేమం, విధినిర్వహణ, పాలనా సంస్కరణల్లో మేటిగా నిలిచిన నాయకులకు ఈ పురస్కారం అందిస్తారు. భారత్ స్వీడన్ దేశాలమధ్య సంబంధాలు బలోపేతంచేయడం, ప్రపంచ సహకారాన్ని పెంపొందించడం, అన్నిరంగాల్లో భాగస్వామ్యంతో ముందుకు నడిపించడంలో చేసిన కృషికిగాను ప్రధానిమోడీకి ఈ పురస్కారం అందిస్తున్నట్లు స్వీడన్ ప్రకటించింది. రెండురోజులపర్యటనకోసం ఆదివారం స్వీడన్‌కు చేరుకున్న ప్రధానిమోడీకి ఆదేశప్రధాని ఉల్ఫ్‌క్రిస్టర్‌సన్ ప్రోటోకాల్‌పక్కనపెట్టి మరీ సాదర స్వాగతం పలికారు. స్వీడన్ గగనతలంలోకి రాగానే ప్రధానిమోడీకోసం స్వీడన్ గ్రిపెన్ ఫైటర్ జెట్లు రక్షణగా వచ్చాయి. 2018వ సంవత్సరం తర్వాత ఇదే మొదటి స్వీడన్‌దేశ పర్యటన. డీప్‌టెక్, రక్షణరంగం బలోపేతం, గ్రీన్ ట్రాన్సిషన్ వంటి విభాగాల్లో ప్రధానితో చర్చలుజరుపుతారు. యూరోప్‌తో స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందంవల్ల ఇపుడు స్వీడన్‌దేశంలో కూడా వాణిజ్య,రక్షణ,పారిశ్రామికరంగాలపరంగా మరింత వృద్ధి నమోదవుతుందని చెపుతున్నారు. అలాగే స్వీడన్‌లో నివసిస్తున్న ప్రవాస భారతీయ సంతతిని కూడా మోడీ కలుస్తారు. ప్రధానిమోడీ స్టాక్‌హోమ్ ఎయిర్‌ఫోర్టులో దిగినవెంటనే భారీ సంఖ్యలోని ప్రవాసభారతీయులు మోడీకి స్వాగతం పలికారు. మోడీ, మోడీ అంటూ పెద్దపెట్టుననినాదాలుచేస్తుండటంతో ప్రధానివారందరికీ అభివాదంచేస్తూ ముందుకు కదిలారు. అనంతరం స్వీడన్ రక్షణ దళాల గౌరవ వందనం స్వీకరించిన మోడీ ప్రధానితో ప్రత్యేక భేటీ జరిపారు.

# ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

>> నిర్మాణం, కమిటీల ఏర్పాటు, నియోజకవర్గాల వారిగా పార్టీ బలోపేతం లాంటి అంశాలపై చర్చించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని పవన్ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి కమిటీలో మొత్తం ఏడుగురు సభ్యులు ఉండేలా రూపకల్పన చేశారు. ఈకమిటీల్లో సంబంధిత పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ నాయకులు, మహిళా నేతలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అంతేకాకుండా 2014 నుండి జనసేన కోసం పనిచేస్తున్న నాయకులతో పాటు ఇద్దరు సాధక్‌లకు కూడా కమిటీల్లో స్థానం కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రతి కమిటీలో 10 నుండి 25 మంది సాధక్‌లకు సమన్వయ బృందంగా సహకరించేలా వ్యవస్థ రూపొందించనున్నారు. అంతేకాకుండా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గ కమిటీల్లో చోటు దక్కాలని అనుకునే నాయకుల నుండి దరఖాస్తుల సైతం స్వీకరించనున్నారు. ఆ దరఖాస్తులను పరిశీలించి సమగ్ర నివేదిక రూపంలో పవన్ కల్యాణ్‌కు అందజేస్తారు. ఈ నివేదికను పవన్ కల్యాణ్ నేతృత్వంలోనే ప్రత్యేక కమిటీ పరిశీలించిన తరువాత నియామకాలపై తుది నిర్ణయం తీసుకుంటారు. ఈ ప్రక్రియను నాలుగువారాల్లో పూర్తి చేయాలని పవన్ కల్యాణ్ నేతలకు ఆదేశించినట్టు తెలుస్తోంది.

## తాలీం-ఎ-హూనర్ టెస్ట్‌కు 6605 మంది హాజరు

**విజయవాడ, మే 17, ప్రభాతవార్త :** ముస్లిం విద్యార్ధినీవిద్యార్దులకు ఉచితంగా ఇంటర్‌మీడియట్ విద్యను అందించేందుకు ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తాలీం-ఏ-హూనర్ టాలెంట్‌టెస్ట్‌కు మొత్తం 6605 మంది విద్యార్దులు హాజరయినట్లు వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్‌అజీజ్ తెలిపారు. ఈటెస్ట్‌కు ధరఖాస్తు చేసుకున్న వారిలో 787మంది పరీక్షకు హాజరుకాలేదని అజీజ్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 27 కేం ద్రాలలో ఈపరీక్ష నిర్వహించగా, 450మంది సిబ్బంది పాల్గొని సమన్వయం చేసినట్లు ఆయన చెప్పారు. రాష్ట్రవ్యాప_ంగా ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల నుండి జవాబు పత్రాలు కట్టుదిట్టమైన భద్రత నడుమ విజయవాడలోని కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటాయని, కలెక్టర్ కార్యాలయంలో నిపుణులైన ప్రత్యేక సిబ్బందితో మూల్యాంకనం చేయించి ఫలితాలను ప్రకటిస్తామని చెప్పారు. ఈపరీక్ష నిర్వహణకు సహకరించిన అన్ని జిల్లాల కలెక్టర్‌లకు సిబ్బందికి అజీజ్ కృతజ్ఞతలు తెలిపారు.

# 48 గంటల్లోనే నిందితుల అరెస్టు

>> తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే ఫోరెన్సిక్ విభాగం సిబ్బంది సంఘటనా స్థలం చేరుకుని ఆధునాతన పద్ధతుల్లో ఆధారాలు సేకరించడం, సేకరించిన ఆధారాలను కోర్టుల్లో సమర్పించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా పోక్సో కేసుల్లో నిందితులకు 3, 4 నెలల్లోపే శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఇందుకు ప్రజలు కూడా పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా వుండగా భక్తి ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకోవడం తన పూర్వ జన్మ సుకృతం అన్నారు. కాణిపాకం దేవస్థానంలో గత 50 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి గత రెండు మూడు సంవత్సరాల కాలంలో పెద్ద ఎత్తున జరుగుతున్నదన్నారు. ఇందులో భాగంగా సిఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కాణిపాకంలో ఫ్లై ఓవర్ ఏర్పాటు చేయడంతో పాటు టిటిడి అందిస్తున్న రూ.25 కోట్లతో కళ్యాణ మండపాల నిర్మాణం, రూ.15 కోట్ల దేవస్థానం నిధులతో వంద గదుల సత్రం నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి భక్తులకు అన్ని వసతి సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే దినదినాభివృద్ధి చెందుతున్న కాణిపాకం దేవస్థానంలో భక్తులు ఆలయ భద్రత దృష్ట్యా 190 సిసి కెమెరాలతో పర్యవేక్షణ ఏర్పాటు చేయడంతో పాటు దేవస్థానంలో దొంగతనాలు, అసాంఘీక కార్యక్రమాలు వంటి వాటిని గుర్తించడానికి సిసి కెమెరాలను ఎఐతో అనుసంధానం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో శాంతిభద్రతలు ఎంతో మెరుగయ్యాయని మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్పీ తుషార్ డూడి, ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఎఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌బాబు, చిత్తూరు డిఎస్పీ వెంకట నారాయణ, ఆలయ ఛైర్మన్ మణి నాయుడు, ఇఒ కె.పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# నిప్పుల కుంపటి

>> మోపూరులో 42.2 ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు(నందిగామ)లో 42, అనంతపురం జిల్లా తెరన్నపల్లిలో 41.9 కర్నూలు జిల్లా తోవిలో 41.5, కృష్ణా జిల్లా నందివాడ, పల్నాడు(జి) గురజాలలో 41.4 ది, ఏలూరు జిల్లా ధర్మాజీగూడెంలో 41.3 అనకాపల్లి జిల్లా దేవరాపల్లి, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 41.2 చిత్తూరుజిల్లా నగరిలో 41.1డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. 28 జిల్లాలకు గాను 14 జిల్లాల పరిధిలోని 65 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు ఆయన వెల్లడించారు. సోమవారం విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, మార్కాపురం, నంద్యాల, వైఎస్సార్ కడప జిల్లాల్లో ఎండ ప్రభావం ఎక్కువగా ఉండి 42 నుంచి 44.5 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యేందుకు అవకాశం ఉందని తెలిపారు. రేపు మన్యం జిల్లా సీతంపేట మండలంలో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని మరో 34 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని వెల్లడించారు. మరోవైపు నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని తెలిపారు. వీటి ప్రభావంతో రేపు పార్వతీపురం మన్యం, అల్లూరి, పోలవరం, తూర్పుగోదావరి, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఉరుములతో వర్షం పడేటప్పుడు పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు చెట్ల కింద నిలబడకూడదని హెచ్చరించారు.

పగటిపూట ప్రయాణించేవారు టోపీలు, మాస్కులు, మహిళలైతే ముఖానికి ముసుగులు ధరిస్తున్నారు. మాస్కులు పెట్టుకుంటున్నారు.,ఇక విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు ఎండలోనే ప్రయాణిస్తున్నారు. కొందరు వేసవి నుంచి ఉపశమనం కోసం చలివేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కొందరు కొబ్బరి బోండాలు, శీతల పానీయాల బండ్ల వద్దకు చేరుతున్నారు.ఎండాకాలంలో ఎక్కడెక్కడో పని చేసుకొని ఇంటికి వచ్చేసరికి అలసట వచ్చేస్తుంది. చిన్న చిన్న పనులకే నీరసపడిపోతుంటాం. అలవాటు ఉన్న వాళ్లు అలసట బారి నుంచి ఉపశమనం పొందడానికి టీ, కాఫీ తీసుకుంటారు. కానీ వేసవిలో వేడి పదార్థాలు పెద్దగా రుచించవు. కాస్త చల్లచల్లగా ఏవైనా పండ్ల రసాలు తీసుకుంటే బాగుంటుంది అనిపిస్తుంది. సహజ పానీయాలైన పళ్ల రసాలను తీసుకోవడమే మంచిదని, తద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయని, అలసట దూరమవుతుందని పలువురు నిపుణులు సూచిస్తున్నారు.

# మళ్లీ పెరిగిన సిఎన్‌జి

>> ప్రభావం పడనుంది. కొత్త ధరల ప్రకారం ఢిల్లీలో సిఎన్‌జి ధర కిలోకు రూ.80.09కి చేరింది. ఇది రూ. 80 మార్కును దాటడం ఇదే మొదటిసారి. నోయిడా, ఘజియాబాద్‌లలో, సిఎన్‌జి ధర ఇప్పుడు కిలోకు రూ. 88.70గా ఉంటుంది. మే 15న ఐజిఎల్ సిఎన్‌జి ధరలను కిలోకు రూ.2పెంచి, ఢిల్లీలో సిఎన్‌జి ధరను అప్పట్లో రూ.79.09కి చేర్చిన కేవలం రెండు రోజులకే ఈ తాజా పెంపు చోటుచేసుకోవడం గమనార్హం. ఆదివారం నాటి ఈ పెంపు, ప్రైవేట్ వాహన యజమానులు, క్యాబ్ ఆపరేటర్లు, సిఎన్‌జిపై ఆధారపడే ప్రజా రవాణా వినియోగదారుల రవాణా ఖర్చులను మరింత పెంచినట్లైంది. సిఎన్‌జి ధరల సవరణలు, మే 15న కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విస్తృత స్థాయి ఇంధన రిటైల్ ధరల పెంపుతో దాదాపు ఒకే సమయంలో జరిగాయి. దేశ రాజధానిలో పెట్రోల్ ధరలు లీటరుకు సుమారు రూ.3 చొప్పున, డీజిల్ ధరలు లీటరుకు దాదాపు రూ.3 చొప్పున పెంచబడ్డాయి. ఈ సవరణ తర్వాత, ఢిల్లీలో పెట్రోల్ లీటరుకు రూ.97.77 చొప్పున, డీజిల్ లీటరుకు రూ.90.67 చొప్పున విక్రయించబడుతున్నాయి.

## వారం - వర్జ్యం

**18-05-2026, అధికజ్యేష్ఠ సోమవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం**
**గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె**
విదియ సా.5.55
రోహిణి ఉ.11.33
వర్జ్యం : సా.4.29-సా.5.54
దు.మ.12.29-మ.1.21,2)మ.3.04-మ.3.56
శుభసమయం : ఉ.8.30-ఉ.9.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** మీ పరోక్షంలో జరుగుతున్న ఒడి దుడుకులను గమనించి చర్యలను సమర్ధవంతంగా చేపట్ట గలుగుతారు.

**వృషభం:** మీ మాటలను వక్రభాష్యలు చెప్పేవారు అధికమవుతారు. లౌక్యంగా వ్యవహరించి ఆర్థిక అంశాలలో లాభపడతారు.

**మిథునం:** మీ ఉన్నతి ఎదుటివారు ఓర్వ లేని విధంగా ఉంటుంది. సహోదర, సహోదరీ వర్గానికి సహాయం అందిస్తారు.

**కర్కాటకం:** దూరప్రాంత ప్రయాణ సూచనలు ఉన్నత ఉద్యోగ యత్నాలకు గాను మీరు చేసే యత్నాలు ఫలిస్తాయి.

**సింహం:** ముక్కు సూటితనంగా వ్యవహరిస్తారు. సరికొత్త ప్రణాళికలను అమలు చేయటానికి నిర్ణయించుకుంటారు.

**కన్య :** అంతరంగిక చర్చలు భవిష్య కార్యాచరణల రూపకల్పన ప్రస్తుత పరిస్థితులు ఒత్తిడికి గురి చేస్తారు.

**తుల :** అధికారులను ప్రసన్నం చేసుకోవడానికి గాను మీరు చేసే యత్నాలు నామ మాత్రంగా ఫలిస్తాయి.వస్త్ర లాభం.

**వృశ్చికం:** చిన్న చిన్న విషయాలకు కూడా ఎక్కువగా కష్టించవలసి రావడం మిమ్మల్ని ఆలోచింప చేస్తుంది. బంధువుల కలయిక.

**ధనుస్సు:** కీలకమైన, ముఖ్యమైన వ్యవహారాలు సానుకూలంగా సాగుతాయి. దీర్ఘకాలిక సమస్యలకు గాను పరిష్కారం దొరుకుతుంది.

**మకరం:** శుభకార్య చర్యలు పురోగమనంలో ఉంటాయి. అవగాహనా లోపం వలన ఓ సందర్భంలో ఇబ్బంది పడతారు.

**కుంభం:** నూతనమైన ఎగ్రిమెంట్లు పంచాయితీలు, రాయబారాలు మధ్య వర్తిత్వాలు వంటి వ్యవహారాలలో కాలాన్ని హడావుడిగా గడుపుతారు.

**మీనం :** సంతాన పురోభివృద్ధి, కుటుంబ పరమైన వ్యవహారాలు మీ కనుసన్నలలో సాగుతాయి. కాంట్రాక్టులు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాణించిన ఎపి విద్యార్థులు

>> నిర్వహించగా, ఈ నెల 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ పరీక్షలను నిర్వహించారు. పరీక్షలను నిర్వహించిన కేవలం ఐదు రోజుల్లోనే ఫలితాలను విడుదల చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో 2,10,766 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1,97,241 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వారిలో 1,44,704 మంది అర్హత సాధించారు. 125 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో 90,977 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 84,954 మంది విద్యార్థులు పరీక్ష రాస్తే అందులో 73,294 మంది అర్హత సాధించారు. 106 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. ఇంజనీరింగ్‌లో 73.36 శాతం, అగ్రికల్చర్, ఫార్మసీలో 86.27 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారు. అర్హత సాధించిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. వారం రోజుల్లో కౌన్సెలింగ్ తేదిలను ప్రకటించనున్నట్టు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో టాప్-10 మంది ర్యాంకర్ల వివరాలను విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా విడుదల చేయగా, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో టాప్-10 ర్యాంకర్ల వివరాలను కళాశాల విద్య కమిషనర్ శ్రీదేవసేన విడుదల చేశారు. ఇంజనీరింగ్‌లో బాలిక ఎం రుషి 156.63 మార్కులతో మొదటి ర్యాంక్ సాధించగా.. అగ్రికల్చర్, ఫార్మసీలో ఎం అహ్మద్ 150.17 మార్కులతో మొదటి ర్యాంక్ సాధించాడు. ఇంజనీరింగ్ విభాగంలో 90,670 మంది బాలికలు దరఖాస్తు చేసుకోగా, వారిలో 84,495 మంది పరీక్షలకు హాజరయ్యారు. అందులో 62,291 మంది(73.72శాతం) అర్హత సాధించారు. 1,20,096 మంది బాలురు దరఖాస్తు చేసుకుంటే వారిలో 1,12,747 మంది పరీక్షలు రాయగా.. అందులో 82,413 మంది(73.10శాతం) అర్హత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు 69,349 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 64,913 మంది పరీక్షలకు హాజరయ్యారు. అందులో 56,320 మంది(86.76శాతం) అర్హత సాధించారు. బాలురు 21,627 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 20,040 మంది పరీక్షలకు అటెండ్‌కాగా అందులో 16,973 మంది(84.70శాతం) అర్హత సాధించారు. ఒకరు ట్రాన్స్‌జెండర్ పరీక్షకు హాజరుకాగా అర్హత సాధించింది.

**ఇంజనీరింగ్ విభాగంలో టాప్-5 ర్యాంకర్లు**

ఎం.రుషి 156.63 మార్కులు, (ఉప్పల్) ఫస్ట్ ర్యాంక్, బి అన్షుల్ 148.70 మార్కులతో (మూసాపేట్) రెండో ర్యాంక్, ఎం.వంశీధర్‌రెడ్డి 148.70 మార్కులతో (పులివెందుల) మూడో ర్యాంక్, జె.రోషన్ మణిదీప్‌రెడ్డి 144.44 మార్కులతో (గుంటూరు) నాలుగో ర్యాంక్, ఎ. సాయినిఖిత్ 143.30 మార్కులతో (మహబూబ్‌నగర్) ఐదో ర్యాంక్ సాధించారు.

**అగ్రికల్చర్ విభాగంలో టాప్-5 ర్యాంకర్లు**

ఎం.అహ్మాద్ 150.17 మార్కులతో (హైదరాబాద్) మొదటి ర్యాంక్, టి.నివృత్ సాయి వెంకట్ 143.43 మార్కులతో (హైదరాబాద్) రెండో ర్యాంక్, జి.సాహితి గీతిక 142.35 మార్కులతో (రంగారెడ్డి) మూడో ర్యాంక్, ఎం.జయసింహా 139.78 మార్కులతో (హైదరాబాద్) నాలుగో ర్యాంక్, అమైర్ అనాస్ 137.40 మార్కులతో (హైదరాబాద్) ఐదో ర్యాంక్ సాధించారు.


# సిబిఐ కస్టడీకి 'నీట్' నిందితురాలు

>> సిబిఐ శుక్రవారమే అరెస్టు చేసింది. నీట్ ప్రశ్నపత్రం రూపకల్ప నలో సభ్యులుగా ఉన్న వారికి మొత్తం ప్రశ్నలు తెలిసే అవకాశం తక్కువగా ఉండటంతో ఇతర సబ్జెక్టుల నిపుణులతో కలిసి కులకర్ణి లీకేజీకి పాల్పడినట్టు సిబిఐ అధికారులు గుర్తించారు. పేపర్ లీకేజీలో మనీషా మంధారే కీలకంగా వ్యవహరించారని కోర్టుకు సిబిఐ తెలి పింది. బోటనీ, జువాలజీ ప్రశ్న పత్రాల అనువాదంలో ఆమె నిపుణురాలని పేర్కొంది. కులకర్ణితో పాటు మనీషా మంధేరే, మనీషా వాఘ్మరే ఈ కుట్రలో కీలక పాత్రధారులని తెలిపింది.ఈ కేసుకు సంబంధించి దేశవ్యాప్తంగా రెయిడ్స్, విచారణ జరుగుతున్నాయని న్యాయస్థానానికి సిబిఐ వెల్లడించింది. ఈ క్రమంలో మంధారేను విచారించేందుకు 14 రోజుల కస్టడీ కావాలని కోరింది. ఈ కేసుకు సంబంధించి వివిధ ప్రాంతాలకు ఆమెను తీసుకెళ్లి విచారించి, ఆధారాలు సేకరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఇప్పటి వరకు సిబిఐ అదుపులో 9 మంది నిందితులు ఉన్నారు.

**విద్యార్థుల వరకు ప్రశ్నాపత్రం ఎలా చేరిందంటే....**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్‌యూజీ 2026 పేపర్ లీక్ కేసులో షాకింగ్ వివరాలు బయటకు వస్తున్నాయి. పరీక్షా వ్యవస్థలోనే ఉన్న ఇన్‌సైడర్లు ప్రశ్నపత్రాన్ని బయటకు లీక్ చేసి, మధ్యవర్తుల ద్వారా దేశంలోని పలుచోట్ల విద్యార్థులకు విక్రయించినట్లు సిబిఐ అధికారులు గుర్తించారు. ఎన్‌టిఎ నియమించిన నిపుణులు కొందరు ఈ లీకేజ్ వెనుక కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది పుణెకు చెందిన బోటనీ టీచర్ మనీషా మందారే, కెమిస్ట్రీ లెక్చరర్ పివి కులకర్ణి పేర్లు ఈ కేసులో ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరు పరీక్షకు సంబంధించిన ప్రశ్నలను ముందుగానే సేకరించి బయటకు పంపినట్లు సిబిఐ అనుమానిస్తోంది.

పరీక్ష ప్రశ్నపత్రాన్ని మొదట చేతితో రాసి, తర్వాత స్కాన్ చేసి పిడిఎఫ్ రూపంలో పంపినట్లు విచారణలో వెల్లడైంది. గెస్ పేపర్ పేరుతో సుమారు 400 ప్రశ్నల సెట్‌ను విద్యార్థులకు అందించారు. అందులో అసలు పరీక్షలో వచ్చిన బయాలజీ, కెమిస్ట్రీ ప్రశ్నలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ప్రశ్నపత్రాలను అందించేందుకు భారీ మొత్తాలు వసూలు చేసినట్లు సమాచారం. రాజస్థాన్, మహారాష్ట్ర, హరియాణా, కేరళం వంటి రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్ విస్తరించినట్లు అధికారులు భావిస్తున్నారు. పుణె నుంచి ఇతర రాష్ట్రాలకు ప్రశ్నపత్రం లీక్ కావడంలో శుభమ్ ఖైర్నార్ కీలక పాత్ర పోషించారని సిబిఐ అనుమానిస్తోంది.





దేవాంశ్ డైనో డీట్స్ పేరుతో ప్రారంభించిన యూట్యూబ్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారా లోకేష్

## దేవాంశ్ యూట్యూబ్ ఛానల్

# డైనో డీట్స్ ప్రారంభం

**విజయవాడ మే 17 ప్రభాతవార్త ప్రతినిధి:** మంత్రి నారా లోకేష్ తనయుడు దేవాంశ్ డైనో డీట్స్ పేరుతో యూట్యూబ్ ఛానల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నారా, నందమూరి కుటుంబ సభ్యులు దేవాంశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న లోకేష్ యూట్యూబ్, పాడ్ కాస్ట్ ప్రత్యేకతలు తెలుసుకున్నారు. డైనోసార్లు, శిలాజాలు, పురాతన అవశేషాల గురించి తాను తెలుసుకున్న ఆశ్చర్యపరిచే విశేషాలు, ఆకట్టుకునే శైలిలో, నవ్విస్తూ ఆలోచింపజేసేలా దేశాంశ్ అందించే పాడ్‌కాస్టులు ఈ యూట్యూప్ ఛానెల్‌లో ప్రసారం కానున్నాయి. దేవాంశ్ సృష్టించిన ప్రాచీన ప్రపంచంలోకి తాను ఓ ప్రేక్షకుడిలా ప్రవేశించేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నానంటూ మంత్రి లోకేష్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. యూట్యూబ్ చానల్ ద్వారా ప్రేక్షకుల ముందుకొచ్చిన దేవాంశ్ చదరంగంలో క్లిష్టమైన 175 ఫజిల్స్‌ను వేగంగా పరిష్కరించడం ద్వారా ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్‌గా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించాడు. 5334 ప్రాబ్లమ్స్ అండ్ గేమ్స్ పుస్తకంలోని 175 సంక్లిష్టమైన చెక్‌మేట్ ఫజిల్స్‌ను గతేడాది దేవాంశ్ వేగంగా పరిష్కరించి ఈ రికార్డు సొంతం చేసుకున్నారు.

# క్వాంటం టెక్నాలజీకి అమరావతి కేంద్రం

>>చ్చారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా లోకేష్ పోస్టు పెట్టారు. ముంబై నుంచి అమరావతికి వచ్చిన గోపాల్ జోషి క్వాంటమ్ ఆపరేషన్స్‌లో సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రముఖ భారతీయ విద్యాసంస్థల్లో పరిశోధనలు చేసిన నాగలక్ష్మయ్య... అధునాతన ఆర్ఎఫ్ సిస్టమ్స్ అభివృద్ధి చేస్తున్నారని మంత్రి లోకేష్ వివరించారు. నగరం పూర్తికాకముందే అమరావతికి శాస్త్రవేత్తలు, పరిశోధకులు ఆకర్షితులు అవుతున్నారని వెల్లడించారు. అమరావతిపై యువతలో పెరుగుతున్న నమ్మకం, ఆశయాలకు ఇది నిదర్శనమని ఉద్ఘాటించారు. భారత్‌లో ఎదుగుతున్న డీప్ టెక్ హబ్‌గా అమరావతిని ఎకనామిక్ టైమ్స్ గుర్తించిందని తెలిపారు. విద్యార్థులు, శాస్త్రవేత్తలు, స్టార్టప్‌లకు అమరావతి కొత్త అవకాశాల వేదిక అని వ్యాఖ్యానించారు. భారత భవిష్యత్తు టెక్నాలజీల రూపకల్పనలో ఏపీ యువత కీలక పాత్ర పోషించనుందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# నైరుతి తాకిడి

>> తులు ఏర్పడే అవకాశం కనిపిస్తోందని ఐఎండి పేర్కొంది. ఎల్ నినో ప్రభావంతో దేశంలో ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అయితే ఇది ప్రాథమిక అంచనా మాత్రమేనని జూన్, జూలై నెలల్లో రుతుపవనాలు దేశవ్యాప్తంగా విస్తరించిన తర్వాతే ఏ ఏ ప్రాంతాల్లో ఎంత వర్షం పడుతుందనే దానిపై పూర్తి స్పష్టత వస్తుందని అధికారులు చెప్తున్నారు. ఇక జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది. ప్రస్తుతం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. ఉత్తర ఈశాన్య దిశగా కదులుతూ రుతుపవనాలకు సహకరిస్తుందని ఐఎండీ అంచనా వేస్తోంది. ఈ క్రమంలో తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ముఖ్యంగా భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, నారాయణపేటతోపాటు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. వర్షం పడినప్పుడు ఉరుములు, మెరుపులు కూడా వస్తాయని, ఈదురు గాలులు వేగం గంటకు 30 నుంచి 40 కిలో మీటర్లుగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారు.

# ఆక్వా రైతులను రక్షించండి

>> విమర్శించారు. ఫీడ్ తయారీ సంస్థలు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులు ఒకే వ్యాపార వర్గంగా వ్యవహరిస్తూ రైతులపై అదనపు భారం మోపుతున్నారని ఆరోపించారు. రైతులు వేసవి పంట పూర్తయ్యే వరకు కనీసం రెండు నెలలపాటు ప్రస్తుత ఫీడ్ ధరలను కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏపీఎస్ఏడిఏలైసెన్స్ కలిగిన అన్ని ఆక్వా ఫార్ములకు యూనిట్‌కు రూ.1.50 చొప్పున రాయితీ విద్యుత్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా సుమారు 12,500 ఆక్వా కనెక్షన్లకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఫిష్ మీల్ ఎగుమతులపై కేంద్రం ఇస్తున్న ప్రోత్సాహకాలు, సోయా దిగుమతులపై నిషేధం వంటి అంశాలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ మేరకు కొద్దిరోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రానికి లేఖ రాసారు. రైతుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని మరోసారి కేంద్రాన్ని విజ్ఞప్తి చేయనున్నారు. అలాగే కోళ్ల ఫీడ్ ధరల విధానాన్ని అనుసరించి ప్రతి నెలా ముడి పదార్థాల ధరల ఆధారంగా రొయ్యల ఫీడ్ ధరలను నిర్ణయించే విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించారు. రొయ్యల కొనుగోలు ధరలను కూడా 15 రోజుల గడువుతో నిర్ణయించే విధానాన్ని అమలు చేయాలని సమావేశంలో అభిప్రాయపడారు. రైతులు అపోహాలు, తప్పుడు ప్రచారాలకు గురికాకుండా సరైన సమయంలో పంట కోత చేపట్టేందుకు ఈ నిర్ణయాలు దోహదపడతాయని అధికారులకు తెలిపారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రికి నివేదించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఈ సమావేశంలో ఫిషరీస్ కమిషనర్ రామశంకర్ నాయక్, ఎపిఎస్ఏడిఏ కో-వీసీ అనం వెంకటరమణారెడ్డి, ఓఎస్డీ పోలినాయుడు, సిఐబి చెన్నై, సిఐఎఫ్ఎ విజయవాడ శాస్త్రవేత్తలు, ఎస్ఐఎఫ్‌టీ కాకినాడ ప్రిన్సిపాల్, ఫిషరీస్ యూనివర్సిటీ డీన్, మేపెడా ప్రతినిధులు, ఆక్వా రైతు సంఘాలు, ఆక్వా అడ్వైజరీ కమిటీ సభ్యులు, ఎపిఎస్ఏడిఏ డైరెక్టర్లు, రొయ్యల ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్‌జిల్లాలో నేడు పిజిఆర్ఎస్ అర్జీల స్వీకరణ

**విజయవాడ, మే 17, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమం ద్వారా సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంతోపాటు, డివిజన్, మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లోనూ ఈకార్యక్రమం జరుగుతుందన్నారు. విజయవాడ కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో రెవెన్యూ క్లినిక్ సేవలు అందుబాటులో ఉంటాయని ఈకార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# నేడు కేరళం సిఎం పదవీ ప్రమాణం

>> స్థానాల్లో 102 స్థానాల్లో గెలిచింది. అధికార ఎల్‌డిఎఫ్ 35 సీట్లకే పరిమితమైంది. బిజెపి 3 సీట్లు దక్కించుకుంది. కేరళలో కొత్త ప్రభుత్వం కొలువుతీరనుంది. కాంగ్రెస్ సారథ్యంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఈనెల 18వ తేదీ సోమవారంనాడు ప్రమాణస్వీకారానికి సిద్ధమవుతోంది. క్యాబినెట్ కూర్పు కోసం చర్చలు తుదిదశకు చేరుకున్నాయి. మంత్రి పదవులకు సంబంధించి భాగస్వామ్య పక్షాలు విస్తృత చర్చల అనంతరం ఒక అవగాహనకు వచ్చినట్టు యూడిఎఫ్ వర్గాలు ఆదివారంనాడు తెలిపాయి. తన ప్రమాణస్వీకారంతోనే కేబినెట్ ప్రమాణస్వీకారంచేయించాలన్న లక్ష్యంతో కేబినెట్ కూర్పును కూడా సతీశన్ పూర్తిచేసారు.

కేరళం కొత్త ప్రభుత్వంలో ముఖ్యమంత్రి పదవితో సహా కాంగ్రెస్‌కు 12 క్యాబినెట్ బెర్తులు లభించాయి. యూడిఎఫ్ కీలక భాగస్వామి అయిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్)కు 5 మంత్రి పదవులు ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్‌పి), కేరళ కాంగ్రెస్ (జోసెఫ్), కేరళ కాంగ్రెస్ (జాకోబ్), సిపిఎంలకు ఒక్కొక్క మంత్రి పదవి దక్కనున్నాయి. అధికారికంగా మంత్రుల జాబితాను ప్రకటించాల్సి ఉంది.

ఇటీవల జరిగిన కేరళం అసెంబ్లీ ఎన్నికల్లో 140 స్థానాలకు గాను యుడిఎఫ్ 102 సీట్లు గెలుచుకుని ఎల్‌డిఎఫ్ పదేళ్ల పాలనకు ఉద్వాసన పలికింది. ఎల్‌డిఎఫ్ కేవలం 35 సీట్లకు పరిమితమైంది. బిజెపి 3 సీట్లలో విజయం సాధించింది.

## తిరుమల సమాచారం



# భక్తులతో తిరుమల కొండ కిటకిట

● వెంకన్న సర్వదర్శనానికి 20గంటలు

**తిరుమల, మే 17 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థం లక్షలాది భక్తులు తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిట లాడుతోంది. వేసవి సెలవులు.. ఆపై వారాంతం శని, ఆదివారాలు కలసి రావడంతో ఆదివారం ఉదయం 6గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపలకు శిలాతోరణం వరకు చేరాయి. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 18గంటలు సమయం పడుతోంది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో ఏనిమిది గంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. అసలే వేసవి సెలవులు... ఆపై తమతమ మొక్కుబడులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటుండటంతో తిరుమల కిటకిటలాడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, టీ, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం వరకు 41వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.




# ఆగస్టులో శ్రీవారి పవిత్రోత్సవాలు

● ఈ ఏడాది ఒకే టిక్కెట్‌పై మూడురోజులు భక్తులకు దర్శనాలు

**తిరుమల, మే 17 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏడాది పొడవునా జరిగే పలు రకాల ఉత్సవాలు, కైంకర్యాలు, సేవల వల్ల తెలిసీతెలియక జరిగిన పొరబాట్లను సరిదిద్దుకునేందుకు ఉత్సవమూర్తులకు నిర్వహించే పవిత్రోత్సవాలు ఈ ఏడాది వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ఏటా మూడురోజుల పాటు ఆలయంలోపల కల్యాణోత్సవమండపంలో (సంపంగి ప్రాకారం) జరిగే ఈ పవిత్రోత్సవాలకు ఏ రోజుకారోజు టిక్కెట్లు పొందిన గృహస్థభక్తులను ఈ సేవకు అనుమతినిస్తారు. అయితే ఈ ఏడాది టిటిడి పెద్దలు వినూత్నంగా ఆలోచన చేసి ఏకంగా పవిత్రోత్సవాల టిక్కెట్‌ను రూ.5 వేలు చేశారు. ఈ టిక్కెట్ ఆన్‌లైన్‌లో పొందిన భక్తులు పవిత్రోత్సవాలు జరిగే మూడురోజులు ఆలయంలోనికి చేరుకుని ఏడుకొండలస్వామిని దర్శించుకునే భాగ్యం కల్పించారు. పవిత్రోత్సవాలకు సంబంధించి సేవా టిక్కెట్లపై ఒకే టికెట్ పొందిన గృహస్థ భక్తులు మూడు రోజులు సేవలో పాల్గొనే అవకాశం కల్పించింది. తిరుమలేశుని ఆలయంలో ఈ ఏడాది ఆగస్టు 23 నుండి 25వ తేదీ వరకు పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించేలా నిర్ణయించారు. ఆగస్టు 22న అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనల, ఉత్సవాల్లో భక్తులువల్లగానీ, సిబ్బంది వల్ల తెలియక కొన్ని దోషాలు జరుగు తాయి. వాటివల్ల ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా ఆగమ శాస్త్ర ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఈ సేవలో పాల్గొనాలని భావించే భక్తులకు ఈ నె 21వ తేదీన గురవారం ప్రత్యేకంగా టికెట్లను ఆన్‌లైన్‌లో జారీ చేయనుంది. 21వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసే టికెట్‌ను ఇద్దరు గృహస్థ భక్తులకు కలిపి రూ.5 వేలు చెల్లించి కొనుగోలు చేయవచ్చు. టికెట్లు పొందిన భక్తులు పవిత్రోత్సవాలు జరిగే మూడు రోజులు శ్రీదేవిభూదేవి సమేత మలయప్ప స్వామికి జరిగే స్నపన తిరుమంజనంలో, చివరి రోజున పూర్ణాహుతిలో పాల్గొనే అవకాశం కల్పించారు. పవిత్రోత్సవాల టిక్కెట్లు పొంది సేవలో పాల్గొనే భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో ఆయా రోజుల్లో ఉదయం 7 గంటలకు వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్‌కు చేరుకోవాలి. భక్తులు ఏదైనా ఫొటో గుర్తింపు కార్డును చూపితే ఆలయం లోపలకు అనుమతిస్తారు. టిటిడి అధికారిక వెబ్‌సైట్ "టిటిదేవస్థానమ్స్. ఎపి.జివొవి.ఇన్" ద్వారా, యాప్ ద్వారా ఈ టికెట్లను అందుబాటులో ఉంచుతున్నారు. ఈ ఏడాది వినూత్నంగా భక్తులకు వరుసగా మూడు రోజులు ఇష్టదైవమ్ తిరుమలేశుని దర్శించుకునే అవకాశం కలగడంతో పెద్దసంఖ్యలో భక్తులు సద్వినియోగం చేసుకుంటారని టిటిడి అంచనా వేస్తోంది.

# దేశ, రాష్ట్ర ప్రగతిలో సమాచార, సాంకేతిక వ్యవస్థలు కీలకం

● ప్రపంచ టెలికమ్యూనికేషన్ దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన సిఎం చంద్రబాబు



**విజయవాడ, మే 17 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ,రాష్ట్ర ప్రగతిలో సమాచార, సాంకేతిక వ్యవస్థలు అత్యంత ప్రాధాన్యత కలిగి ఉన్నాయని ఏపి సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రపంచ టెలికమ్యూనికేషన్, సమాచార సొసైటీ దినోత్సవాన్ని పురస్కరించు కొని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. సురక్షితమైన సమాచార మార్పిడి, నమ్మకమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, సైబర్ స్థితిస్థాపకత దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకమని ఈ దినోత్సవం మనకు గుర్తుచేస్తోందని ట్వీట్ చేశారు. ఏప్రిల్ 14న క్వాంటం కంప్యూటింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్ ప్రారంభోత్సవం తర్వాత, అమరావతి క్వాంటం వ్యాలీ ఆవిష్కరణలు, పరిశోధనలు, దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచ స్థాయి క్వాంటం పర్యావరణ వ్యవస్థను నిర్మించే దిశగా మరో ముఖ్యమైన అడుగు వేస్తోందని వెల్లడించారు. భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్స్ విభాగానికి చెందిన సీ-డాట్, అమరావతి క్వాంటం వ్యాలీ భాగస్వామ్యంతో అమరావతిలోని ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ, కమ్యూనికేషన్స్, సైబర్ స్పేస్ కోసం దేశంలోనే మొట్టమొదటిదని సిఎం చంద్ర బాబు తెలిపారు. క్వాంటంసెక్యూర్ కమ్యూని కేషన్స్ టెస్ట్ బెడ్‌ను ఏర్పాటు చేయనుందని పేర్కొన్నారు. ఈ సదుపాయం క్వాంటం కమ్యూ నికేషన్ హార్డ్‌వేర్, ఫోటోనిక్ ఆప్టికల్ సిస్టమ్స్, ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీస్, సురక్షిత నెట్‌వర్క్ మౌలిక సదుపాయాలు, నెక్స్ట్‌జనరేషన్ సైబర్ డిఫెన్స్ సొల్యూషన్స్‌పై పరిశోధనలు, పరీక్షలకు ఎంతగానో తోడ్పడుతుందని వ్యాఖ్యానించారు. ఈ చొరవ మేక్ ఇన్ ఇండియా సాంకేతికతలకు, సురక్షితమైన డిజిటల్ మౌలిక సదుపాయాలకు మనమిచ్చే నిబద్ధతను మరింత బలోపేతం చేస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. పూర్వం దూర ప్రాంతాల్లో నివసించే వారికి సమాచారాన్ని చేరవేయడం ఎంతో ప్రయాసతో కూడుకుని ఉండేది. అయితే కొన్ని దశాబ్దాలుగా సమాచార మార్పిడిలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. మొబైల్, ఇంటర్నెట్ వాడకం బాగా పెరిగింది. ఎక్కడి నుంచి ఎక్కడికైనా సమాచారాన్ని పంపడం, స్వీకరించ డం, పంచుకోవడం సర్వసాధారణమైంది. దీని వల్ల సమయం, డబ్బు ఆదా అయ్యాయి. దేశాలు ప్రగతి పథంలో పయనించడంలోనూ సమాచార వ్యవస్థలు తోడ్పాటు అందిస్తున్నాయి. ఇంట ర్నెట్, ఇతర సమాచార సాధనాల ఉపయోగాన్ని ప్రపంచానికి తెలియజేయాలనే లక్ష్యంతో ఏటా మే 17న ప్రపంచ టెలికమ్యూనికేషన్ దినోత్స వాన్ని నిర్వహిస్తారు. దీన్నే వరల్డ్ టెలికమ్యూ నికేషన్ అండ్ ఇన్ఫర్మేషన్ సొసైటీ డే అని కూడా అంటారు. టెలికమ్యూనికేషన్, సమాచార వ్యవస్థలు ఆర్థిక, సామాజిక వ్యవస్థలకు అందిం చే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయడం ఈరోజు ముఖ్య ఉద్దేశం. అమరావతిని ఫ్రాంటి యర్ టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చ రింగ్, డీప్‌టెక్ ఆవిష్కరణలకు ఒక ప్రముఖ హబ్‌గా నిలుపుతుందని తెలిపారు. అన్నింటి కంటే ముఖ్యంగా, భవిష్యత్తును శాసించే సరి కొత్త సాంకేతిక పరిజ్ఞానాల నిర్మాణంలో ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లు, యువ ఆవిష్కర్తలు భాగస్వాములు కావడానికి ఇది అద్భుతమైన అవకాశాలను సృష్టి స్తుందని అన్నారు. ఈ కీలకమైన చొరవతో ముడిపడి ఉన్న అన్ని సంస్థలకు, శాస్త్రవేత్తలకు, పరిశోధకులకు, అధ్యాపకులకు, ఆవిష్కర్తలకు, విద్యార్థులకు సిఎం చంద్రబాబు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థులకు ఏఐ పాఠాలు

● పాఠశాల స్థాయిలోనే కృత్రిమ మేధపై అవగాహన



**విజయవాడ, మే 17 ప్రభాతవార్త ప్రతినిధి:** పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు కృత్రిమ మేధ(ఏఐ) అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు అనుగుణంగా ఏపి పాఠశాల విద్యాశాఖ ఈ ఏడాది కొత్త పాఠ్యాంశాన్ని తీసుకొచ్చింది. ఏఐ సమ్మిళితమైన అధ్యాయాన్ని రాష్ట్ర విద్య, పరిశోధన శిక్షణ మండలి ప్రవేశపెట్టింది. 6, 7, 8 తరగతుల్లో గణితం, సైన్సు, సాంఘికశాస్త్రం సబ్జెక్టుల్లో పాఠాల్ని ఏఐతో మిళితం చేసి, బోధించే విధానాన్ని తీసుకొచ్చింది. ఏఐని వినియోగించి పాఠం ఎలా చెప్పాలో వివరించింది. ఏఐని సురక్షితంగా ఎలా వాడాలో విద్యార్థులకు నేర్పిస్తారు. వ్యక్తిగత వివరాలను ఏఐతో పంచుకో కూడదని, ఏఐ ఇచ్చిన సమాధానాలను నేరుగా హోంవర్క్‌లో కాపీ చేయకూడదని విద్యార్థులకు సూచించారు. ఏఐని ఒక సహాయ సాధనంగానే చూడాలని ఆరోతరగతి సాంఘికశాస్త్రం పాఠంలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు, పాఠ్యపుస్తకా లకు అది ప్రత్యామ్నాయం కాదని, తల్లి దండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలోనే ఏఐని వినియోగించాలని విద్యార్థులకు సూచించారు. ఏఐని సరైన ప్రశ్నలు అడగడం నేర్పిస్తారు. ఏఐకి సొంతంగా ఆలోచించే శక్తి ఉండదని, అది దానికి అందించిన సమాచారంపైనే ఆధారపడు తుందని చెప్పారు. సమాచారంలో తప్పులుంటే ఏఐ తప్పుడు సమాధానాలు ఇస్తుందని తెలిపారు. ఏఐ తనకు తెలియని విషయాలకు తప్పుడు లేదా ఊహాజనిత సమాచారాన్ని నిజ మైనట్లు నమ్మకంగా చెబుతుందన్నారు. కొత్త పాఠ్యపుస్తకాల్లో కొన్ని మార్పులు చేశారు. ఈ ఏడాది కొత్తగా ఐదోతరగతిలో హిందీని ప్రవేశ పెట్టారు. ఇప్పటివరకు ఆరోతరగతి నుంచి హిందీ ఉండగా విద్యార్థులను సన్నద్ధం చేసేం దుకు ఐదో తరగతిలో అక్షరాలు, చిన్న చిన్న పదాలను చెప్పేందుకు దీన్ని తీసుకొచ్చారు. ఒకటోతరగతి నుంచే ఆంగ్లం ఫోనెటిక్స్‌ను ప్రవేశ పెట్టారు. అక్షరాలకు, వాటి శబ్దాలకు మధ్య సంబంధాన్ని నేర్పనున్నారు. తొమ్మిదో తరగతి పాఠ్యపుస్తకాల్లో సామర్థ్య ఆధారిత మూల్యాంక నానికి అనుగుణంగా ప్రశ్నలను చేర్చారు. తొమ్మిది ఆంగ్ల పాఠ్యపుస్తకం యూనిట్8లో "ఒక గాఢనిద్ర నా ఆత్మను కప్పేసింది", యూనిట్ 9లో "నేను నీ స్థానంలో ఉంటే", సప్లిమెంటరీ రీడర్‌లో "ఇల్లు అంటే కేవలం ఒక గూడు కాదు" పాఠాలను తొలగించారు. తొమ్మి దోతరగతి తెలుగు వాచకం నుంచి హరివిల్లు, రంగస్థలం పాఠం, ఉపవాచకం నుంచి న్యాపతి సుబ్బారావు, కొండా వెంకటప్పయ్య, దిగుమర్తి జానకిబాయమ్మ, కల్లూరి తులసమ్మ పాఠ్యాం శాలు తొలగించారు. పదోతరగతి ఆంగ్ల పాఠ్య పుస్తకం యూనిట్6లో "మిజ్‌బిల్ ది ఆటర్", ఫాగ్ యూనిట్ 7లో ఫర్ ఆన్ గ్రెగరీ, యూనిట్ 9లో ది ప్రపోజల్, సప్లిమెంటరీ రీడర్‌లో భూమి ని రక్షించిన పుస్తక పాఠం తొలగించారు. విద్యా ర్థులకు కృతిమ మేధ పూర్తిగా ఆధారపడకుండా. మానవ ప్రమేయ అవశ్యకతను వివరిస్తూ ఏఐ పాఠ్యంశాలు ఉంటాయి.




# అమరావతి క్వాంటం వ్యాలీలో రూ.958.40 కోట్లతో జంట టవర్లు

● పాలవాగుపై రూ.532.92 కోట్లతో వంతెనలు

● టెండర్లు పిలిచిన అమరావతి గ్రోత్ కార్పొరేషన్

**రాజంపేట, మే 17 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఒక ప్రధాన టెక్ పరిశోధనా కేంద్రంగా రూపొందించబడిన అమరావతిలోని క్వాంటం వ్యాలీలో జంట కార్యాలయ టవర్లను రూ.958.40 కోట్ల అంచనా వేంతో నిర్మించేం దుకు ఆదివారం టెండర్ ఉత్తర్వులను అమరావతి గ్రోత్ కార్పొరేషన్ జారీ చేసింది. సోమవారం నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. రెండు రోజుల క్రితం రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన రూ.1,208.41 కోట్ల ప్రాజెక్టు లో 3.7మిలియన్ చదరపు అడుగుల స్థలాన్ని అందించే రెండు జిప్లస్43 టవర్ల నిర్మాణాలు ఉంటాయి. క్వాంటమ్ వ్యాలీ అమరావతి సమీపంలోని ఉద్దండరాయునిపాలెంలో 50 ఎకరాల సాంకేతిక పర్యావరణ వ్యవస్థను సిద్ధం చేస్తున్నారు. ఈ రెండు జంట టవర్ల నిర్మాణంలో భాగంగా షెల్, కోర్ నిర్మాణానికి రూ.1,208.41 కోట్లకు ఆమోదం లభించినా, సమగ్ర అంచనాల తర్వాత రూ.958.40 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. ఈ టవర్లను క్వాంటం కంప్యూటింగ్ సంస్థలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌లు, ఆర్ అండ్ డి కేంద్రాలు, స్టార్టప్ ఇంక్యుబేటర్‌లకు ఆశ్రయం కల్పించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. టెండర్లు దక్కించుకునే సంస్థలు "డిజైన్‌బిల్డ్ లంప్సమ్" పద్ధతిలో సిద్ధం చేయాల్సి ఉంది. అలాగే అసెంబ్లీకి వెళ్లే దారిలో పాలవాగుపై రూ.532.92 కోట్ల అంచనా వ్యయంతో వంతెనలు, ఇతర ముఖ్య అభివృద్ధి పనులు చేపట్టేందుకు అమరావతి గ్రోత్ కార్పొరేషన్ టెండర్లు పిలిచింది.

## క్రీడా కోటా.. అటవీశాఖలో 40 పోస్టుల భర్తీకి ప్రకటన

**విజయవాడ, మే 17 ప్రభాతవార్త ప్రతినిధి:** అటవీశాఖలోని వివిధ విభాగాల్లో 40 ఖాళీలను క్రీడా కోటా కింద భర్తీ చేయనున్నట్లు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ తెలిపింది. అర్హులైన క్రీడాకారులకు ఎలాంటి పరీక్ష లేకుండా క్రీడారంగంలో చూపిన ప్రతిభ ఆధారంగా పోస్టుల భర్తీ చేయనున్నట్లు వెల్లడించింది. ఈ నెల 18 నుంచి జూన్ 18వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఓ ప్రకటనలో కోరింది. మరిన్ని వివరాలకు హెటిటిపి:// స్పోర్ట్స్.ఎపి.జివోవి.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో 9 ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు 17 బీట్ ఆఫీసర్లు, 13 అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు, ఒక టెక్నికల్ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేయనున్నట్లు తెలిపింది.

# పచ్చదనంతో తిరు గిరులు కళకళ





**తిరుమల, మే 17 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలంకొండల్లో వెలసిన సప్తగిరుల్లోని తిరుమల పచ్చదనంతో అలరారుతోంది. ఈ ఏడాది ఇప్పటికే 89.40శాతం పచ్చదనం పెంపొందించారు. 1980వ సంవత్సరం నుండి టిటిడి అటవీశాఖ శేషాచల అరణ్యం సంపదను పరిరక్షిస్తూ, పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ భక్తుల ఆధ్యాత్మిక అవసరాలకు అనుగుణంగా సేవలు అందిస్తోంది. జీవ వైవిధ్య పరిరక్షణలో కీలక పాత్రను పోషిస్తోంది. టిటిడి అటవీ విభాగ పరిధిలో మొత్తం 2719 హెక్టార్ల విస్తీర్ణంలో అరణ్య ప్రాంతం ఉండగా 89.40 శాతం మేర అటవీ ప్రాంతం పచ్చదనం నమోదు కావడం విశేషం. సుమారు 2,431 హెక్టార్లలో అటవీ ప్రాంతాలు ఉన్నాయి. ఇవి కార్బన్ నిల్వలు, వాతావరణ నియంత్రణ, జీవ వైవిధ్య సంరక్షణకు ముఖ్యంగా దోహదపడుతున్నాయి. టిటిడి అటవీ విభాగాన్ని డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. తిరుమలలో రెండు, తిరుపతిలో రెండు నాలుగు ఫారెస్ట్ రేంజ్‌లు ఉన్నాయి. ప్రతి రేంజ్‌ను ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పర్యవేక్షిస్తున్నారు. ఫీల్డ్ స్థాయిలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, సిబ్బంది సమన్వయంతో అటవీ పరిరక్షణ చేపడుతున్నారు.

అటవీ సంపద సంరక్షణలో భాగంగా 24 గంటల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం పహారా నిర్వహిస్తూ అక్రమ చెట్ల నరికివేత, వేట చర్యలను అరికడుతున్నాయి. అటవీ అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక ఫైర్ లైన్లు నిర్వహించడంతో పాటు శిక్షణ పొందిన బృందాలు వేగంగా స్పందించి వంద శాతం వరకు అగ్నిమాపక చర్యలు చేపడుతున్నాయి. ప్రతి సంవత్సరం 26.5 లక్షల చదరపు మీటర్ల మేర ఫైర్ లైన్లు నిర్వహిస్తున్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో జీవ వైవిధ్య పరిరక్షణలో భాగంగా విదేశీ జాతికి చెందిన అకేషియా చెట్ల స్థానంలో స్థానిక వృక్ష సంపదను పునరుద్ధరించే కార్యక్రమాన్ని టిటిడి చేపట్టింది. 576 హెక్టార్లలో స్థానిక జాతులైన రావి, మర్రి, జువ్వి, మేడి, సంపంగి, మామిడి, గంధం, ఎర్రచందనం, ఉసిరి, నేరేడు వంటి మొక్కలను దశలవారీగా నాటుతున్నారు. ఇప్పటివరకు 22 హెక్టార్లలో పనులు పూర్తయ్యాయి. టిటిడి పరిధిలోని నాలుగు ఫారెస్ట్ రేంజ్‌లలో ప్రత్యేక నర్సరీలను నిర్వహిస్తూ స్థానిక జాతుల మొక్కలు, అలంకార మొక్కలు, ఔషధ మొక్కలను పెంచుతున్నారు.


ఏనుగులు, చిరుతలు సహా వన్యప్రాణుల రక్షణకు చర్యలు: శేషాచల అరణ్యాల్లో ఏనుగులు, చిరుతలు, ఎలుగుబంట్లు, పాములు వంటి అనేక వన్యప్రాణులు నివసిస్తున్నాయి. నీటి కోసం అడవి జంతువులు మానవ ప్రాంతంల్లోకి వచ్చే అవకాశాలు పూర్తిగా తగ్గడం జరిగింది. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకరమైన చెట్లను గుర్తించి తొలగించడం, గాలివానల కారణంగా పడిపోయిన చెట్లను తొలగించడం, రహదారుల పక్కన చెట్ల కొమ్మలను క్రమం తప్పకుండా తొలగించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

## గన్నవరంలో ఎన్‌హెచ్‌పై గ్రీనరీ పెంచాలి

### కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

**గన్నవరం(కృష్ణా), మే 17 ప్రభాతవార్త:** గన్నవరం విమానాశ్రయం నుండి విజయావాడ పశ్చిమ బైపాస్ వరకు జాతీయ రహదారిపై గ్రీనరిని పెంచాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డికె.బాలాజీ అధికారులను ఆదేశించారు. ఆదివారం విమానాశ్రయం నుండి బైపాస్ వరకు రహదారిని ఆయన పరిశీలించారు. రహధారికి ఇరువైపులా మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలన్నారు. విఐపిలు రాకపోకలు సాగించే ఈమార్గంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి చెత్తాచెదారం లేకుండా శుబ్రంగా ఉంచాలని ఆదేశించారు. జాతీయరదారి ప్రాజెక్టు డైరెక్టర్ ఆధ్వర్యంలో రహదారికి ఇరువైపులా పచ్చదనం పెంపొందించటంతో పాటు గోడలకు ఆకర్షణీయమైన రంగులు వేయాలన్నారు. రహదారి సైడ్‌డ్రైన్‌లలో పూడిక తీసి మురుగు నిల్వఉండకుండా చూడాలని, దెబ్బతిన్న ఫుట్‌పాత్‌లకు వెంటనే మరమత్తులు చేయించాలని ఆదేశించారు. గ్రామపంచాయతీల కార్యదర్శులు ఈరహదారి పరిశుబ్రంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో గుడివాడ డిఎల్‌పిఓ సంపత్‌కుమారి అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఎప్ సెట్- 2026 ఫలితాలను శాసించిన నారాయణ



బెజుగమ అన్షుల్ 2వ ర్యాంక్ | అదుల సాయి నికిత్ 5వ ర్యాంక్ | ఎం. ఆస్నా 6వ ర్యాంక్ | వివాన్ మహేశ్వరి 7వ ర్యాంక్ | టి. శ్రేయాస్ రెడ్డి 8వ ర్యాంక్

**టాప్-10లో 5, 100 లోపు 51 ర్యాంకులు నారాయణ విద్యార్థులవే**

**హైదరాబాద్, మే 17 ప్రభాతవార్త:** ఆదివారం ప్రకటించిన తెలంగాణ ఎప్ సెట్-2026 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు సంచలనాలు ఆవిష్కరించారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ రెండు విభాగాల్లోనూ అత్యుత్తమ ర్యాంకులతో నారాయణ విద్యార్థులు ఆధిపత్యం కొనసాగించారు. స్టేట్ 2, 5, 6, 7, 8 వంటి అత్యుత్తమ ర్యాంకులు నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో స్టేట్ సెకండ్ ర్యాంక్ బి.అన్షుల్ కైవశం చేసుకోగా, ఆదుల సాయినిఖిత్ 5వ ర్యాంకు, మల్లవరపు ఆస్నా స్టేట్ 6వ ర్యాంకు, వివాన్ శరథ్ మహేశ్వరి 7వ ర్యాంకు, తాళ్ళూరి శ్రేయాస్ రెడ్డి 8వ ర్యాంక్ సాధించారు. అలాగే 11, 14, 15, 19, 21, 26, 27, 30, 31, 33, 38, 40, 41, 43, 44, 45, 47, 48, 54, 55, 56, 57, 57, 63, 65, 65, 67, 69, 70, 73, 75, 75, 76, 80, 82, 82, 83, 85, 87, 88, 89, 90, 97, 97, 98, 100 వంటి 100లో 51 టాప్ వంటి టాప్-100లో 50 ర్యాంకులు నారాయణ విద్యార్థులే చేజిక్కించుకున్నారు. మొత్తంగా 10లోపు 5, 100 లోపు 51, 500 లోపు 242, 1000 లోపు 439 ర్యాంకులు సాధించి విద్యార్థుల, తల్లిదండ్రుల ఆశయాల సాధన... ఒక్క నారాయణకు మాత్రమే సాధ్యమని మరోసారి నిరూపించామని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్స్ డాక్టర్ పి. సింధూర నారాయణ, పి. శరణి నారాయణ పేర్కొన్నారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో 100 లోపు 41 ర్యాంకులు కేవలం నారాయణ విద్యాప్రణాళిక ద్వారానే సాధించడం జరిగిందని వివరించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 100 లోపు 09 ర్యాంకులు నారాయణ విద్యార్థులు సాధించటం మెడికల్ ప్రోగ్రామ్ నారాయణ విద్యాసంస్థలకు ఉన్న పట్టుని రుజువు చేసిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా నారాయణ తప్ప మరి ఏ ఇతర విద్యాసంస్థ ఈ స్థాయి ర్యాంకులు సాధించలేదని పేర్కొన్నారు. గత సంవత్సరంతో పోల్చితే సీటు సాధించే ర్యాంకుల సంఖ్య అత్యధికంగా ఉండటం గమనించాల్సిన విషయమన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డాక్టర్ సింధూర నారాయణ మాట్లాడుతూ గత 47 సంవత్సరాలుగా కేవలం టాప్ ర్యాంకులను పరమావధిగా చేసుకుని రూపొందించిన నారాయణ విశిష్ట విద్యాప్రణాళిక ద్వారానే ఈ ఘనవిజయాలను సాధించగలిగామని తెలియజేశారు. అదే విధంగా ఈఏపీ సెట్‌గా మారిన ఎంసెట్లోనూ నారాయణ విజయప్రస్థానం నిరంతరాయంగా కొనసాగుతోందన్నారు. డైరెక్టర్ పి.శరణి నారాయణ మాట్లాడుతూ టాప్ ర్యాంకులు సాధించిన వారికి అత్యధిక సంఖ్యలో నారాయణ స్కూల్స్‌లో చదివిన విద్యార్థులే ఉన్నారన్నారు. ఇంటిగ్రేటెడ్ సిలబస్, ప్రణాళికను అనుసరించి రూపుదిద్దిన మైక్రోషెడ్యూల్ రూపొందించిన స్టడీమెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన, రోజువారి టెస్టులు వాటిపై సమగ్ర విశ్లేషణతో బలహీనతలను అధిగమిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకుపోయేలా ప్రతి విద్యార్థిని తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ కొత్తప అభినందనలు తెలియజేశారు.



ఎం. వంశీధర్ రెడ్డి 3వ ర్యాంక్ | సాహితి గీతిక గునిధి 3వ ర్యాంక్ | జె రోషన్ మణిదీప్‌రెడ్డి 4వ ర్యాంక్ | అమిర్ అనాస్ 5వ ర్యాంక్ | నాథన్ షెబా జెరూష్ 6వ ర్యాంక్ | పరికెటి అనురాగ్ 7వ ర్యాంక్ | బూర సాయి శరణ్ 8వ ర్యాంక్

## టిజి ఎప్ సెట్- 2026 ఫలితాల్లో శ్రీచైతన్యకు టాప్

# 10లోపు 10 ర్యాంకులు

## టాప్ 100 లోపు 93 ర్యాంకులు



మారుతి సత్యశ్రీకర్ 9వ ర్యాంక్ | బి. సమీరాజ్ రెడ్డి 9వ ర్యాంక్ | రుతుంబిక మొహంతి 10వ ర్యాంక్

**హైదరాబాద్, మే 17 ప్రభాతవార్త:** ఆదివారం విడుదలైన తెలంగాణ ఎప్ సెట్-2026 ఫలితాల్లో ఇంజనీరింగ్‌లోనూ, అగ్రి, ఫార్మాలోనూ టాప్ ర్యాంక్స్‌తో నంబర్ వన్ స్థానంలో నిలిచి ఎప్పటిలానే రికార్డ్ క్రియేట్ చేసింది శ్రీచైతన్య. ఇంజనీరింగ్‌లో స్టేట్ 3వ ర్యాంక్ ఎం వంశీధర్ రెడ్డి, 4వ ర్యాంక్ జె మనిదీప్ రెడ్డి, అగ్రి, ఫార్మాలో 3వ ర్యాంక్ జి సాహితి గీతిక, 5వ ర్యాంక్ అమైర్ అనాస్, 6వ ర్యాంక్ నాథన్ షెబా జెరూషా, 7వ ర్యాంక్ పి అనురాగ్, 8వ ర్యాంక్ బి సాయి శరన్, 9వ ర్యాంక్ ఎ మారుతీ సత్య శ్రీకర్, 10వ ర్యాంక్ ఆర్ మెహంతీ అత్యుత్తమ ర్యాంకులు సాధించింది శ్రీచైతన్య విద్యార్థులే.

ఈ ర్యాంకులు సాధించిన విద్యార్థుల్లో అత్యధిక ర్యాంకులు సాధించిన విద్యార్థులు శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులే కావడం విశేషం. నిన్నటి జాతీయ స్థాయిరి జేఈఈ మెయిన్ 2026 ఫలితాల్లో 300 కి 300 మార్కులతో ఓపెన్ కేటగిరిలో రెండు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించి, నేటి రాష్ట్ర స్థాయి టిజి ఎప్ సెట్‌లో కూడా తన ఆధిపత్యంతో శ్రీచైతన్య తన నంబర్ వన్ స్థానాన్ని కొనసాగిస్తూ ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఒక్కసారి, రెండు సార్లు కాదు, ఏకంగా ఇంజనీరింగ్‌లో ఏడు సార్లు స్టేట్ ఫస్ట్ ర్యాంకులు, అగ్రి, ఫార్మాలోనూ ఏడు సార్లు స్టేట్ ఫస్ట్ ర్యాంకులు సాధించి విజయ పరంపర కొనసాగిస్తూ ర్యాంకుల సునామీ సృష్టించిన విద్యాసంస్థ శ్రీచైతన్యయేనని.. శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ గుర్తుచేశారు.

ఈ అత్యుత్తమ ఫలితాల వెనుక శ్రీచైతన్య సృష్టించిన అంతరిక్ష సాధ్యమైన ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాములు, ఇంటర్నల్ టెస్ట్ పేపర్లు, స్టూడెంట్ టీచర్ వన్ టు వన్ అడాప్షన్ సిస్టమ్‌తో నిపుణులైన అధ్యాపక బృందం శిక్షణ కీలకంగా నిలిచా యన్నారు. గత 40 ఏళ్లుగా ఇంజనీరింగ్‌లోనైనా, మెడికల్‌లోనైనా అత్యధిక టాప్ ర్యాంకులు, మార్కులు సాధించిన ఘనత ఒక్క శ్రీచైతన్యదేనని ఆమె ఈ సందర్భంగా తెలియజేశారు. పోటీ పరీక్ష ఏదైనా, పరీక్ష విధానాలు ఎలా మారినా నెం.1గా నిలిచేది తమ విద్యార్థులేనని, రాబోయే జెఇఇ అడ్వాన్స్‌డ్, నీట్‌లో కూడా తమ విద్యార్థుల విజయపరంపర ఇదే విధంగా కొనసాగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని, విద్యార్థుల తల్లిదండ్రులను సుష్మ అభినందించారు.

వార్త


సమకాలికులు ఎప్పుడూ వ్యక్తి ప్రతిభ కన్నా వ్యక్తినే ఎక్కువగా పొగుడుతారు. ఆ తర్వాత తరంవారే ప్రతిభను గౌరవిస్తారు.

- కోల్టన్

# ఉభయతారకం!

ప్రపంచ యవనికపై ప్రధాని నరేంద్రమోడీ ఐదు రోజుల పర్యటన భారత్ వైశిష్ట్యాన్ని, ఇతర దేశాలతో సౌహార్ద్ర సంబంధాలను పెంపొందింప చేసింది. మధ్యప్రాచ్యదేశాలతో భారతదేశ విదేశాంగ విధానానికి, ఆర్థిక వ్యూహానికి, సంబంధ బాంధవ్యాలకు ప్రతీకగా ఈ పర్యటన కొత్త పుంతలు తొక్కుతోంది. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంపై భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి మధ్య చర్చలనంతరం ఇరు దేశాల మధ్య సౌభ్రాతృత్వం వెల్లి విరిసింది. భారత్ అభివృద్ధికి ఎమిరేట్స్ చేయూత నిచ్చేందుకు చేయి కలిపింది. తాజాగా చేసుకున్న ఒప్పందాలతో భారత్ దీర్ఘకాలిక ప్రయోజనాలకు అంకురార్పణ జరిగినట్లయింది. గతంలో కన్నా మిననగా ఈ రెండు దేశాల మధ్య సంబంధాలకు కొత్త దిశానిర్దేశం ఏర్పడింది. ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యానికి రాచబాటుకు ఆస్కారం కలిగింది. భారత్, యుఎఇల మధ్య రక్షణ రంగ పారిశ్రామికత పెంపొందే దిశగా డిఫెన్స్ టెక్నాలజీ, శిక్షణ, రంగ అంశాలలో సంయుక్త కసరత్తు పరస్పర సహకారంతో పాటు సైబర్ డిఫెన్స్,మారిటైన్‌కు సెక్యూరిటీ విభాగాలను వృద్ధి బాటలో నడుపుతారు. యుఎఇ భారత్‌ల మధ్య దౌత్యపర అంశాల్లో మరింత మేలైన కదలికకు ముందడుగు పడింది. యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్ భారత్‌కు అత్యంత కీలక వ్యాపార భాగస్వామ్య దేశాలలో ఒకటి. చమురు దిగుమతులు, పెట్టుబడులు, వాణిజ్యం, మౌలిక వసతులు, ఫిన్‌టెక్, రక్షణ రంగాల్లో ఈ రెండు దేశాల మధ్య జరిగిన ఒడంబడికలు చెప్పుకోదగినవే. ప్రధాని ఐదు రోజుల పర్యటనల్లో భాగంగా తొలి అడుగు యుఎఇలోనే పడింది. డాలర్‌పై ఆధారపడే వాణిజ్యాన్ని తగ్గించుకోవాలనే ఆసక్తితో ముందుకు సాగుతూనే భారతీయ ఆర్థిక వ్యవస్థకు మరింత బలపరిచే విధంగా ఇప్పుడు వడివడిగా అడుగులు పడుతున్నట్లు చెప్పుకోవాలి. డాలర్‌ను పక్కనబెట్టి స్థానిక కరెన్సీతో మాత్రమే వాణిజ్యలావాదేవీలు జరగాలని, డిజిటల్ చెల్లింపుల విస్తరణ, పోర్టులో, లాజిస్టిక్స్ రంగాలో పెట్టుబడులపై మరిన్ని ఒప్పందాలు జరిగాయి. ఇరుదేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం జరిగినట్లే. మలి అడుగు నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీదేశాల్లో పర్యటిస్తారు. ప్రస్తుత పశ్చిమాసియా యుద్ధ తరుణంలో ప్రధాని పర్యటన భారత్‌కు మేలు చేయగల దీక్షిత్తిగా రూపొందుతుంది. భారత్, యుఎఇ మధ్య సంబంధాలు కొత్తవి కావు. అరేబ్ గల్ఫ్ ప్రాంతాలలో భారత్ వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలు శతాబ్దాల కాలం నుంచే ఉన్నాయి. అయితే ఇప్పుడు మరింత బలపడనున్నాయి. ప్రధానంగా గుజరాత్, కేరళ ప్రాంతాల వాణిజ్యంలో సుగంధ ద్రవ్యాలు, వస్త్ర, వైడూర్యాల వ్యాపారాలు బాగా జరిగాయి. 1971నుంచే భారత్‌తో వాణిజ్య సంబంధాలు ప్రారంభమయ్యాయి. తొలుత చమురు దిగుమతులు, భారతీయ కార్మికుల ఉపాధి కల్పనతో సంబంధం బలపడింది.రానురాను గల్ఫ్ దేశాల్లో నిర్మాణ రంగం బలపడి ఎంతో మంది భారతీయ కార్మికులు, ఆ ప్రాంతానికి వలస వెళ్లారు. అందుకే యుఎఇలో ఉపాధి కోసం వెళ్లే లక్షలాది భారతీయుల కారణంగానే భారత్‌కు భారీ మొత్తంలో విదేశీ మారక ద్రవ్యం లభిస్తోంది.తాజా పెట్టుబడులతో భారత్‌కు మరింత విదేశీ మారకద్రవ్యాలు లభించే ఆస్కారం ఉంది. ప్రధానిగా నరేంద్రమోడీ హయాంలో ఈ ఉభయ దేశాల మధ్య మంచి మంచి ఒప్పందాలు జరిగి మరింత వేగంగా అభివృద్ధి బాటలో నడిచాయి. 2015లో భారత ప్రధాని యుఎఇ సందర్శించిన అనంతరం ఇరుదేశాల స్నేహ సౌహార్ద్ర సంబంధాల్లో పెను మార్పు వచ్చింది. అంతకు 30 సంవత్సరాలకు మునుపు భారత్ అధికారులు యుఎఇని సందర్శించిన దాఖలాలు మాత్రమే ఉన్నాయి. అటు పిమ్మట రెండు దేశాల మధ్య ఉగ్రవాదం నిరోధం, సమాచార మార్పిడి, నౌకాయాన భద్రత, వంటి అంశాల్లో పరస్పర సంబంధాలు మెరుగయ్యాయి. 2020లో కుదిరిన 'సెపా' (కాంప్రెహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్ షిప్ అగ్రిమెంట్)తో ఇరు దేశాలవాణిజ్య సంబంధాలను మరింత మెరుగుపరచింది. ఈ ఒప్పందం మేరకు అనేక వస్తువులపై దిగుమతి సుంకాలుతగ్గి ద్వైపాక్షిక వాణిజ్యం తీరుతెన్నులో మార్పు వచ్చింది. వాణిజ్యాంశాలు ఉభయతారకంగా మారాయి. భారతీయ ప్రవాసుల గౌరవ ప్రపత్తులు పెంచే రీతిలో అరబ్, గల్ఫ్‌లో ఉన్న భారతీయుల సంక్షేమం ఉద్యోగ భద్రత, నైపుణ్యాభివృద్ధి అంశాల్లో మార్పులు సంభవించాయి. అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సంస్కృతికి గుర్తింపు లభించే విధంగా యుఎఇలో హిందూ దేవాలయ నిర్మాణానికి ప్రోది కల్పించింది. గల్ఫ్ ప్రాంత రాజకీయ అస్థిరత, చమురు ధరల్లో మార్పులు, విదేశీ కార్మికుల అంశాల వంటి సవాళ్ల ప్రభావం భారత్ మీద ఉండనే ఉంటుంది.తాజా పర్యటనలో భారత్‌లోనివిభిన్న రంగాల్లో ఐదు బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టేం దుకు యుఎఇ ముందుకొచ్చింది. ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ కూడా భారత్‌ను త్వరలోనే సందర్శిస్తారు. అప్పుడు కూడా మరిన్ని పెట్టుబడులను ఆయన వెంట వచ్చే అవకాశాన్ని కాదనలేం. భారత్‌లోని వ్యూహాత్మక చమురు నిల్వ కేంద్రాలలో 30 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును నిల్వ చేసేందుకు యుఎఇ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ అంగీకరించడం తో ఉభయ దేశాల మధ్య ఇంధన రంగ భాగస్వామ్యం మరింతగా బలపడింది. ముడి చమురు, ఎల్ఎన్‌జి, ఎల్‌పిజి సరఫరాలను కలుపుకొని సమగ్ర భాగస్వామ్యం కోసం కృషి చేయాలని ఇరుదేశాల నిర్ణయాన్ని స్వాగతిద్దాం.

కష్టతరమైన పనిని చేసే వ్యక్తి, అప్పగించబడిన పనిని చాలా బాగా చేసే వ్యక్తి ఎన్నటికీ తన ఆత్మగౌరవాన్ని కోల్పోడు.



జార్జి బెర్నార్డ్ షా

తమ వద్ద ఉన్న సంపదను మెదడులో జమ చేస్తే దానిని ఏ ఒక్కరూ దొంగిలించలేరు. విద్యాపరమైన పెట్టుబడికి ఉత్తమమైన వడ్డీ లభిస్తుంది.



బెంజమిన్ ఫ్రాంక్లిన్

## ప్రజావాక్కు

### గ్రామీణ స్థాయికి సాంకేతికత

ఆధునిక యుగంలో కృత్రిమ మేధస్సు అత్యంత వేగంగా విస్తరిస్తూ,భవిష్యత్తు ఉపాధి ప్రపంచంపై పెను ప్రభావం చూపుతోంది. విద్య, వైద్యం, బ్యాంకింగ్ వంటి రంగాల్లో డేటా విశ్లేషణ, పత్రాల నిర్వహణ వంటి పనులను యంత్రాలు వేగంగా చేస్తున్నాయి.దీనివల్ల పునరావృత స్వభావం కలిగిన డేటా ఎంట్రీ, కాల్ సెంటర్ వంటి విభాగాల్లో ఉద్యోగభద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. యంత్రాలు మానవ శ్రమను భర్తీ చేస్తాయనే భయం ఉన్నప్పటికీ, ప్రతి సాంకేతిక విప్లవం లాగే ఇది కూడా కొత్త అవకాశాలకు ద్వారాలు తెరుస్తోంది. డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ భద్రత వంటి విభాగాల్లో నైపుణ్యం కలిగిన వారికి డిమాండ్ పెరుగుతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు, యువత కొత్త నైపుణ్యాలను నిరంతరంనేర్చుకోవాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఐరిష్ హాజరు విధానాన్ని రద్దు చేయాలి

ఉపాధి హామీ పథకంలో శ్రామికులకు అమలు చేస్తున్న ఐరిష్ హాజరు విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి చట్టాన్ని పునరుద్ధరణ చేయాలని,విబి జి రాంజీ పథకాన్ని రద్దు చేయాలని, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు, శ్రామికులు కోరుతున్నారు. ఉపాధి శ్రామికులలో ఆర్థిక వెనుకబాటుతనం, సామాజికంగా పనులు లేని కూలీలను గుర్తించి ఆగ్రూపులకు పనులనుకేటాయించాలన్నారు.అలాగే పనులలో వివక్షత చూపకుండా అన్ని వర్గాలకు ఒకే పనిని చూపాలి. రాజకీయ మద్దతు ఉన్న గ్రూపులకు ఎక్కువ పని దినాలు కేటాయించకుండా సామాజిక న్యాయం పాటించాలని వారు కోరుతున్నారు.

- జి.సూర్యనారాయణ, కృష్ణాజిల్లా

### డ్రైవర్ల భద్రత

ప్రతిరోజూ ఎంతోమంది ప్రయాణికులను సురక్షి తంగా గమ్యస్థానాలకు చేర్చే డ్రైవర్లు తమ విధులను నిబద్ధతతో నిర్వహిస్తున్నారు. అలాంటి వారిపై దాడులు చేయడం సహించరాని విషయం. బైక్‌లపై ప్రయాణించే కొందరు, సైడ్ ఇవ్వలేదని చిన్న విషయాన్ని పెద్ద గొడవగా మార్చి డ్రైవర్లతో వాగ్వాదానికి దిగి దాడులు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, పరస్పరం గౌరవంతో ప్రవర్తించాలి.

- కె.రామారావు, రంగారెడ్డి జిల్లా

### అధికారికంగా గుళ్లు, గోపురాలు దర్శించరాదు..

మనది సెక్యులర్ దేశం.దేవుడు,మతం, వ్యక్తిగతంగానే ఉంచుకోవాలి.ప్రభుత్వ ధనంమతపరమైన వాటికి రూపాయి కూడా ఖర్చుపెట్టరాదు. ప్రోత్సహించరాదు. రాజ్యపాలన, మతం వేరువేరుగా ఉండాలి. రాజ్యపాలనలో మతాన్ని , మత ఆచారాలను పాటించకూడదు. ఒకవేళ ప్రధానులు, రాష్ట్రపతులు, గవర్నర్లు,ముఖ్యమంత్రులు, ఐఎఎస్‌లు, ఐపీఎస్‌లు గుళ్ళకు, గాని స్వాములవద్దకు వెళ్లాలనుకుంటే సెలవు పెట్టుకొని, సొంత డబ్బుతో వెళ్లాలి. అది నిజమైన సెక్యులరిజం. ఆర్టికల్ 51'ఎ'లో ప్రశ్నించేతత్వం, శాస్త్రీయ ఆలోచన, మానవ వాదాలను పెంచటం ప్రతి పౌరుని బాధ్యత అని రాజ్యాంగంలో వ్రాసుకున్నారు. దానిమీద ప్రతి ఒక్కరు ప్రమాణం చేస్తారు. కానీ దీన్ని అమలుపరచాలి అన్న ఇంగిత జ్ఞానం కూడా ఎవరికి లేదు. ప్రధాని మోదీ మాట్లాడితే గుళ్ళు అంటాడు. సనాతనం అంటాడు. మాయల పకీర్లు లాంటి బాబాల ఆశ్రమాలకు వెళ్తాడు. వాళ్ళు ప్రభుత్వ భూములు ఆక్రమించి ఆశ్రమాలు నిర్మిస్తారు. మరి ప్రధాని లాంటివారు అక్కడికి వెళ్తే వారి మోసాలను ఆమోదించినట్లే కదా !

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### నీటి కుంటలు అవసరం

తెలంగాణ లాంటి రాష్ట్రంలో గత రెండుఏళ్ల నుండి వర్షపాతం ఎక్కువగా ఉండడం వల్ల పంటలు బాగా పండాయి. ఇప్పుడు ప్రతికూల పరిస్థితులు వస్తే మన దగ్గర గ్రామీణ ఆర్థిక వ్యవస్థను స్థిరకరించే అవకాశం ఒక్క ఉపాధి హామీ కి తప్ప వేరే పథకానికి లేదు. ముఖ్యంగా తెలంగాణ లాంటి రాష్ట్రంలో ఇవ్వాళా 1.34లక్షల ఎకరాల భూమి సాగులోకి వచ్చింది.దానిని మరింత పెంచాలి.అంటే ఉపాధిహామీ బహుళ రకాలుగా ఉపయోగపడనున్నది. తెలంగాణలో నీటి నిల్వనే వ్యవసాయ రంగం స్థిరకరణకు శ్రీరామ రక్షా. అయితే ప్రతి రైతు తన పొలం లేదా చెలకలో ఒక సెంటు భూమి లో కుంటను తవ్వుకోవాలి.

- భారత అవినాష్, జనగామ

### దరఖాస్తులు స్వీకరించాలి

వికలాంగులు పొదుపు చేసుకున్న డబ్బులు అవసరాల నిమిత్తం అప్పుగా తీసుకున్నవారు తిరిగి ఇవ్వడంలో భౌతిక దాడులు, దౌర్జన్యాలు, గొడవలు చేస్తున్నారు. ఇట్టి సమస్యలను పరిష్కరించడానికి గాను పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వికలాంగులువారి అప్పుకాగితాలు,వికలాంగుల ధ్రువీకరణ పత్రంతో ఫిర్యాదు చేస్తే వారి డబ్బులు వారికి ఇప్పించే విధంగా ప్రభుత్వం పోలీసు శాఖ ద్వారా ఆదేశాలు జారీ చేయాలి.

-కదురు శ్రీనివాస్, వరంగల్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# 'విద్య'లో నూతన సంస్కరణలు అవసరమా?

**నాణ్యమైన ఉత్తమమైన విద్య కోసం పాఠశాలలో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యక్ష పరిశీలన ద్వారా క్షేత్రస్థాయిలో అవసరమైన ఉపయుక్తమైన ఉన్నతమైన విద్యా విలువలు కలిగినటువంటి ప్రణాళికలను రూపొందించేందుకు జాతీయవిద్యా విధానంతో పాటు కేంద్ర రాష్ట్రస్థాయిలో కూడా విద్యాకమిషన్లు నిరంతర విద్యా అభ్యున్నతికి సమగ్రంగా మరింతగా అధ్యయనం చేస్తుండడం అభినందనీయం. అయితే ప్రస్తుతం ఉన్న విద్యావిధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యాకమిషన్లు ఇస్తున్న నివేదికల ఆధారంగా విద్యార్థి కేంద్రీకృత విద్యాపరంగా సహపాఠ్యాంశాల కార్యక్రమల నిర్వహణతోపాటు, అభ్యసన సామర్థ్యాలను విద్యాలక్ష్యాలను సాధించేందుకు, సాంకేతిక ఉపకరణాల వినియోగంతో విషయ బోధకులు విశ్వసనీయత కలిగిన బోధనా విధానాలను ఉప యోగించి విద్యార్థులలో సంపూర్ణ విద్యావికాసం, అభివృద్ధికి తోడ్పాటు అందించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.**

దాడిశెట్టి శ్యామ్ కుమార్

భారతదేశంలో విద్యావ్యవస్థ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంటుంది.కాలానుగుణంగా విద్య ప్రాముఖ్యత పెరుగుతూ వస్తుంది. ఆధునిక సమాజంలో వస్తున్న మార్పులు కనుగుణంగా విద్యా విషయాల్లో వినూత్నమైన బోధనా అభ్యసనాలు అవసరం అవుతున్నాయి. అదేవిధంగా నాణ్యమైన విద్యాబోధనకు అనువైన బోధన ఉపకరణాలు, విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలు లాంటి అంశాలపై సంబంధిత ప్రభుత్వాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ విద్యపై ప్రత్యేక దృష్టి సారిస్తూ అభ్యసన ఫలితాలు ఆధారంగా బోధనా అభ్యసనాలు మెరుగుపరుచుకునేందుకు కావలసిన విధానాలను క్షేత్రస్థాయిలో మరింతగా అమలు చేయవలసిన అవసరం ఉంటుందనే భావన లేక పోలేదు. విద్యా అనేది ఉమ్మడి జాబితాలో ఉన్నందున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే క్రమంలో ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వాలు అనేక విద్యాకమిషన్లు ఏర్పాటు చేస్తూనే ఉంటాయి. విద్యా కమిషన్లు విద్యా పురోగాభివృద్ధికి కావలసిన సూచనలు చేస్తూనే ఉంటాయి. స్వాతంత్ర్యానంతరం కూడా భారతదేశంలో విద్యప్రాముఖ్యత ఎరిగిన అనేకమంది విద్యావేత్తలు మేధావులు వసతులతో కూడిన ఉత్తమమైన విద్యాబోధన అభ్యసన విధానం భారతదేశానికి ఉపయుక్తంగా ఉంటుందని భావించారు. విద్యా సమాజ నాగరిక అభివృద్ధికి కీలకమే అయినప్పటికీ, ప్రభుత్వ పాఠశాలలో పేద బడుగు బలహీన అన్ని వర్గాల వారికి ఉచిత విద్యతోపాటు మౌలిక సదుపాయాలతో కూడినటువంటి పరిసరాల్లో అనువైన తరగతి గదులు, బోధనకు అవసరమైన ఉపకరణాలు ప్రామాణికత కలిగిన విద్యా విధానం దేశ అభివృద్ధికి తోడ్పాటు అందించగలదని విశ్లేషించవచ్చు. ఈ క్రమంలోనేవిద్యకు ప్రాముఖ్యత ఇవ్వడంతో పాటు పాఠశాలలో మౌలిక వసతులు నాణ్యత కలిగిన విద్యను పాఠశాల విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో విద్యప్రామాణికత కూడా పెంచే విధంగా విద్యాకమిషన్లు పనిచేస్తున్నాయి. ప్రధానంగా భారత దేశంలో కోఠారి కమీషన్, ముదలియార్,యశ్‌పాల్ లాంటి విద్యాకమిషన్లు భారత విద్యావ్యవస్థలో కీలకపాత్ర పోషించాయి అని చెప్పవచ్చు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో కూడా ప్రభుత్వాలు విద్యపై ప్రత్యేక శ్రద్ధ సారిస్తూ విద్యా కమిషన్లను ఏర్పాటు చేస్తున్నాయి. జాతీయ విద్యా విధానం ఆధునీకరించబడి అమలు చేయాలని నిర్దిష్టమైన ప్రణాళికలతో సిద్ధమవుతున్నది. ఇలాంటి అంశాలన్నీ కూడా ఉన్నత సెకండరీ స్థాయి, ప్రాథమికస్థాయి విద్యార్థులకు కావలసిన కనీస మౌలిక సదుపాయాలు రూపకల్పన అభ్యసన సామర్థ్యాలు విద్యార్థుల్లో కల్పించే విధంగా కావలసిన బోధనా అభ్యసన పద్ధతులు, విద్యాలక్ష్యాలు, అభ్యసన ఫలితాలు ఆధునిక బోధనా పద్ధతి లాంటివి ఎన్నో అంశాలపై విద్యా కమిషన్లు మారుతున్న కాలానికి అనుగుణంగా సూచనలు, సలహాలు నివేదికలు తయారుచేస్తూ అమలువిధానాలను విద్యావ్యవస్థలో ప్రతిబింబించే విధంగా విద్యార్థులను విద్యవైపు ఆకర్షింప చేస్తున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వ యాజమాన్యాల కింద నడుస్తున్న పాఠశాలలో కనీస మౌలిక వసతులు సదుపాయాలు మెరుగుపడుతున్న క్రమంలో విద్యహక్కు చట్టం



చాలావరకు అమలవుతున్న తీరు ప్రభుత్వ పాఠశాల వైపు విద్యార్థుల తల్లిదండ్రుల చూపుఉంటున్నప్పటికీ, ఎందుకో గాని ప్రభుత్వ పాఠశాలలో అనుకున్న స్థాయిలో విద్యార్థుల సంఖ్య గోచరించడం లేదనిపిస్తుంది. ప్రభుత్వాలు కూడా విద్యావ్యవస్థకు తగినంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. విద్యాభివృద్ధికి అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నప్పటికీ, ప్రస్తుతం కొన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్నది. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను ఆకర్షించే రీతిలో ప్రభుత్వాలు అనేక సదుపాయాలు కల్పిస్తున్నప్పటికీ, విద్యార్థులకు కావలసిన ఉత్తమమైన విద్యతోపాటు ఉచిత మధ్యాహ్న భోజన పథకం, అల్పాహారం లాంటి సదుపాయాలను పరిగణలోకి తీసుకోవడంతోపాటు నాణ్యమైన విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు విద్యా కమిషన్ల అమలుకు ప్రత్యేక దృష్టిసారిస్తున్నా, ప్రస్తుతం కొన్నిపాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యఉన్నా, ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉండడం, ఉపాధ్యాయులు ఉన్నచోట విద్యార్థులు సంఖ్య లేకపోవడం, మరికొన్ని పాఠశాలలో విద్యార్థుల నమోదు తగినంతగా లేకపోవడం శోచనీయం.

ఈ క్రమంలో ప్రపంచ స్థాయిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వివిధ విద్యా కమిషన్ నివేదికలు సిఫార్సు చేస్తున్న ప్రకారం ప్రభుత్వ పాఠశాలవైపు విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నంగా సాంప్రదాయ విద్యతోపాటు టెక్నికల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌నైపుణ్యంతో కూడినటువంటి బోధన అభ్యసన పాఠశాల స్థాయి నుండి సులభతరంగా విషయాన్ని అవగాహన చేసుకోవడానికి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పాఠశాలలో కంప్యూటర్ ఇంటర్నెట్ డిజిటల్ బోర్డులను ఏర్పాటులాంటి ఎన్నో సాంకేతిక ఉపకరణాలు ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు సుపరిచితం అవుతూ ప్రత్యక్షంగా విషయాన్ని సులభంగా అర్థంచేసుకోవడానికి, ఆలోచన విధానాలకు అనుగుణంగా సరికొత్త ఆవిష్కరణలకు ఉపయోగపడే డిజిటల్ బోధన పద్ధతులు విద్యలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. దేశంలో విద్యా వ్యవస్థల్లో భాగంగా వస్తున్న అనేక విద్యా కమిషన్లు భారతదేశంలో అత్యున్నతమైన విద్యను విద్యార్థులు అభ్యసించడానికి, అక్షరాస్యత శాతాన్ని పెంచడానికి దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే భవిష్యత్తు విద్యా ప్రణాళికలతో విద్యాకమిషన్లు నూతన విద్యా విధానాలతో పాటు విద్యార్థుల విద్యా ప్రయోజనాల పై నిరంతరం దృష్టి సారిస్తూ ఉండడం గమనార్హం. ఏదిఏమైనప్పటికీ మారుతున్న కాలానికి అనుగుణంగా సమాజంలో వస్తున్న మార్పులు వైవిధ్య భరితమైన పరిస్థితులు ఆధునిక పోకడలు నూతన ఆవిష్కరణలు అధునాతన సాంకేతిక ఉపకరణాలతో వినూత్నమైన బోధనా పద్ధతులు విద్యా వ్యవస్థలో సమ్మిళితమై ఉంటున్నాయి. నాణ్యమైన ఉత్తమమైన విద్య కోసం పాఠశాలలో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యక్ష పరిశీలన ద్వారా క్షేత్రస్థాయిలో అవసరమైన ఉపయుక్తమైన ఉన్నతమైన విద్యా విలువలు కలిగినటువంటి ప్రణాళికలను రూపొందించేందుకు జాతీయవిద్యా విధానంతో పాటు కేంద్ర రాష్ట్రస్థాయిలో కూడా విద్యా కమిషన్లు నిరంతర విద్యా అభ్యున్నతికి సమగ్రంగా మరింతగా అధ్యయనం చేస్తుండడం అభినందనీయం.అయితే ప్రస్తుతం ఉన్న విద్యావిధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యాకమిషన్లు ఇస్తున్న నివేదికల ఆధారంగా విద్యార్థి కేంద్రీకృత విద్యాపరంగా సహపాఠ్యాంశాల కార్యక్రమల నిర్వహణతోపాటు, అభ్యసన సామర్థ్యాలను విద్యా లక్ష్యాలను సాధించేందుకు, సాంకేతిక ఉపకరణాల వినియో గంతో విషయ బోధకులు విశ్వసనీయత కలిగిన బోధనా విధానాలను ఉపయోగించి విద్యార్థులలో సంపూర్ణ విద్యావికాసం, అభివృద్ధికి తోడ్పాటు అందించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ●

# సర్వే సామాజిక న్యాయానికి బలమైన పునాది

ఎలబోయిన వెంకటేశ్వర్లు

తెలంగాణలో తాజాగా విడుదలైన కుల గణన సర్వే రాష్ట్ర రాజకీయాలు, సామాజిక చర్చలకు కొత్త దిశను చూపిస్తోంది. దశాబ్దాలుగా 'డేటా లేకపోవడం" అనే కారణంతో నిలిచిపోయిన అనేక వాదనలు ఇప్పుడు స్పష్టమైన గణాంకాలతో ముందుకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సహజంగానే ఒక ప్రశ్న బలంగా వినిపిస్తోంది. కులగణన తర్వాత రిజర్వేషన్లు మారుతాయా? ఈ ప్రశ్నకు సరళమైన సమాధానం లేదు. ఎందుకంటే, రిజర్వేషన్లు అనేవి కేవలం జనాభా నిష్పత్తి ఆధారంగా ఇవ్వబడే విధానం కాదు. భారత రాజ్యాంగం ప్రకారం, రిజర్వేషన్ల లక్ష్యం సామాజిక విద్యా వెనుకబాటుతనాన్ని సరిచేయడం. అంటే, ఒక కులం జనాభా ఎక్కువగా ఉందని మాత్రమే దానికి అధిక రిజర్వేషన్ ఇవ్వడం సాధ్యం కాదు. అయితే, కుల గణన ద్వారా బయటపడిన వాస్తవాలు మాత్రం గంభీరమైనవే. రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల సంఖ్య గణనీయంగా ఉందని, ఇంకా అనేక కులాలు అభివృద్ధి ఫలితాల నుంచి దూరంగా ఉన్నాయని ఈ సర్వే సూచిస్తోంది. ముఖ్యంగా, ఒకే వర్గంగా పరిగణించబడుతున్న బీసీలలో కూడా తీవ్రమైన అసమానతలు ఉన్నాయని స్పష్టమవుతోంది. కొంతమంది మాత్రమే అవకాశాలను పొందుతుండగా, మరికొందరు ఇంకా వెనుకబడే పరిస్థితి కొనసాగుతోంది.ఈ నేపథ్యంలో రిజర్వేషన్లపై చర్చ 'పెంచాలా? తగ్గించాలా? అన్న దానికంటే, ఎలా సమర్థవంతంగా అమలు చేయాలి? అన్న దిశగా మళ్లాల్సిన అవసరం ఉంది. ఇక్కడే 'సబ్‌కేటగరైజేషన్' అనే ఆలోచన ప్రాముఖ్యత సంతరించుకుంటుంది. అంటే, ఒక పెద్ద వర్గాన్ని చిన్న భాగాలుగా విభజించి, అందులో




నిజంగా వెనుకబడిన వారికి ప్రత్యేక అవకాశాలు కల్పించడం. ఇది అమలు చేస్తే, ఇప్పటివరకు లాభం పొందని వర్గాలకు న్యాయం జరిగే అవకాశం ఉంది. మరోవైపు, రిజర్వేషన్ల పెంపు విషయంలో న్యాయపరమైన పరిమితులు కూడా ఉన్నాయి. సుప్రీంకోర్టు నిర్ణయించిన 50 శాతం పరిమితి పెద్ద అడ్డంకిగా నిలుస్తోంది. ఈ పరిమితిని దాటాలంటే ప్రత్యేక చట్టపరమైన చర్యలు, బలమైన డేటా ఆధారాలు అవసరం. కాబట్టి, కేవలం కులగణన ఆధారంగా వెంటనే రిజర్వేషన్లు పెంచడం సాధ్యమయ్యే పని కాదు. ఇక రాజకీయ కోణంలో చూస్తే, ఈ సర్వే ప్రభావం ఎంతో ఉంటుంది. పెద్ద సంఖ్యలో ఉన్న వర్గాలు తమ హక్కుల కోసం మరింత గట్టిగా డిమాండ్ చేసే అవకాశం ఉంది. రాజకీయ పార్టీలు కూడా ఈ వర్గాలను ఆకర్షించడానికి కొత్త హామీలు ఇవ్వవచ్చు. దీంతో,రాబోయే ఎన్నికల్లో కుల ఆధారిత రాజకీయాలు మరింత ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది. అయితే, ఈ పరిస్థితిలో ఒక ముఖ్యమైన అంశాన్ని మరవకూడదు రిజర్వేషన్లు మాత్రమే సామాజిక న్యాయానికి పూర్తి పరిష్కారం కావు. విద్య, ఉపాధి, ఆరోగ్యం, ఆర్థిక అవకాశాలు వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి లేకపోతే, కేవలం కోటాల పెంపుతో సమస్యలు పరిష్కరించలేము. కాబట్టి, ప్రభుత్వం కుల గణనను ఒక ప్రారంభంగా తీసుకుని, దీర్ఘకాలిక సంక్షేమ విధానాలను రూపొందించాలి. మొత్తం మీద, తెలంగాణ కుల గణన ఒక కీలక మలుపు. ఇది సమాజంలోని అసమానతలను బయటపెట్టింది. కానీ, రిజర్వేషన్లు వెంటనే మారుతాయా అంటే అది అనేక చట్టపరమైన, రాజకీయ, సామాజిక అంశాలపై ఆధారపడి ఉంటుంది. సరైన దిశలో నిర్ణయాలు తీసుకుంటే, ఈ సర్వే సామాజిక న్యాయానికి బలమైన పునాది అవుతుంది. లేకపోతే, ఇది మరో రాజకీయ చర్చగా మిగిలిపోవడం తప్పదేమో. ●

# సతీశన్‌తో మారనున్న కేరళం రాజకీయ ముఖచిత్రం

రామ కిష్టయ్య సంగన భట్ల

కేరళం రాజకీయ యవనికపై ఒక నూతన శకం ఆరంభమైంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయ రాజకీయ శైలికి భిన్నంగా, కాలమాన పరిస్థితులకు అనుగుణంగా తనను తాను పునర్నిర్మించుకునే ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ అధిష్టానం తీసుకున్న నిర్ణయం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కేరళం కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా,తద్వారా ముఖ్యమంత్రి అభ్యర్థిగా వీడీ సతీశన్ పేరును అధికారికంగా ఖరారు చేయడం ద్వారా పార్టీహైకమాండ్ ఒక సాహసోపేతమైన, స్పష్టమైన సంకేతాన్ని పంపింది. ఇది కేవలం ఒక వ్యక్తి ఎంపిక మాత్రమే కాదు, కేరళంలో కాంగ్రెస్ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, కోల్పోయిన వైభవాన్ని తిరిగి సంపాదించుకోవడానికి చేపట్టిన ఒక బృహత్తర రాజకీయ శస్త్రచికిత్సగా విశ్లేషకులు భావిస్తున్నారు.కేరళం రాజకీయ చరిత్రను నిశితంగా పరిశీలిస్తే, అక్కడ ప్రజలు ఐదేళ్లకోసారి అధికారాన్ని మార్చే సంప్రదాయాన్ని, అంటే 'పెండ్యులం పాలిటిక్'ను దశాబ్దాలుగా పాటిస్తూ వచ్చారు. యునైటెడ్ డెమొక్రాటిక్ ఫ్రంట్, లెఫ్ట్ డెమొక్రాటిక్ ఫ్రంట్ కూటముల మధ్య అధికారం మారుతూ ఉండటం ఒక ఆనవాయితీగా ఉండేది. అయితే, 2021అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఈ దశాబ్దాల సంప్రదాయాన్ని పూర్తిగా తుడిచి పెట్టేశాయి. పినరయి విజయన్ నాయకత్వంలోని ఎల్డీఎఫ్ వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చి సరికొత్త చరిత్ర సృష్టించింది. 140 స్థానాలున్న అసెంబ్లీలో ఎల్డీఎఫ్ 99 స్థానాలను కైవసం చేసుకోగా, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కేవలం 41స్థానాలకే పరిమితమైంది. ఈ ఘోర పరాజయం కాంగ్రెస్ శిబిరంలో ఆత్మరక్షణ ధోరణిని పెంచడమేకాకుండా, నాయకత్వ మార్పు అనివార్యమనే సత్యాన్ని గట్టిగా నొక్కి చెప్పింది. అప్పటి వరకు ప్రతిపక్ష నేతగా ఉన్న కొందరు సీనియర్ల వ్యూహాలు వామపక్షాల క్యాడర్ బలాన్ని,పినరయి విజయన్ ప్రజాకర్షణను అడ్డుకోలేకపోయాయి. ఈ నేపథ్యంలోనే యువతకు, దూకుడు ఉన్న నాయకత్వానికి పగ్గాలు అప్పగించాలనే డిమాండ్ పార్టీ అంతర్గత వేదికలపై బలంగా వినిపించింది. వీడీ సతీశన్ ఎంపిక వెనుక అనేక బలమైన సమీకరణాలు ఉన్నాయి. ఎర్నాకుళం జిల్లాలోని పరవూర్ నియోజకవర్గం నుంచి 2001 నుంచి వరుసగా ఐదుసార్లు గెలుస్తూ వస్తున్న సతీశన్, అంచెలంచెలుగా ఎదుగుతూ తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. ఆయన కేవలం ఒక రాజకీయ నాయకుడే కాదు, లోతైన అధ్యయనశీలి అద్భుతమైన వక్త. అసెంబ్లీలో ఆయన చేసే ప్రసంగాలు గణాంకాలతో, తార్కికతతో కూడి ఉంటాయి. ముఖ్యంగా పినరయి విజయన్ ప్రభుత్వంపై ఆయన సంధించే అస్త్రాలు అధికార పక్షాన్ని ఎప్పుడూ ఆత్మరక్షణలో పడేస్తుంటాయి.గత కొన్నేళ్లుగా కేరళను కుదిపేసిన గోల్డ్‌స్మగ్లింగ్ కేసు,లైఫ్‌మిషన్ స్కామ్, వివాదాస్పద ఏఐ కెమెరాల కొనుగోలు వ్యవహారం, మద్యం విధానంలో మార్పులు వంటి అంశాలను సతీశన్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, ప్రత్యామ్నాయ విధానాలను సూచించగల మేధోసంపత్తి ఉండటం ఆయనకు ప్రధాన బలంగా మారిం



ది. రాష్ట్రంలోని మధ్యతరగతి ప్రజలు, విద్యావంతులు యువత సతీశన్ శైలిని ఎక్కువగా ఇష్టపడుతున్నారని ఏఐసీసీ అంతర్గత సర్వేల్లో తేలడంతో అధిష్టానం ఆయన వైపు మొగ్గు చూపింది. అయితే, ఈఎంపిక ప్రక్రియ అంత సులభంగా ఏమీ సాగలేదు. కాంగ్రెస్ పార్టీలో దశాబ్దాలుగా పాతుకుపోయిన వర్గపోరు ముఖ్యంగా ఉమెన్ చాందీ వర్గం రమేశ్ చెన్నితాల వర్గాల మధ్య పోరు సతీశన్ అభ్యర్థిత్వానికి ఆదిలో అడ్డంకిగా నిలిచింది. సీనియర్ నాయకుడు రమేశ్ చెన్నితాల తనకున్న దశాబ్దాల అనుభవాన్ని, పార్టీపై ఉన్నపట్టును నమ్ముకున్నారు. మరోవైపు, జాతీయ స్థాయిలో చక్రంతిప్పుతున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రాహుల్ గాంధీకి అత్యంత నమ్మకస్తుడిగా, పార్టీ యంత్రాంగాన్ని సమన్వయం చేయగల సమర్థుడిగా వేణుగోపాల్‌కు గుర్తింపు ఉన్నప్పటికీ, ఆయన సేవలు జాతీయ రాజకీయాల్లోనే అత్యవసరమని అధిష్టానం భావించింది. చెన్నితాల నాయకత్వంలో వరుస వైఫల్యాలు ఎదురైన నేపథ్యంలో, మార్పు కోరుకునే మెజారిటీ ఎమ్మెల్యేలు సతీశన్ వైపు నిలబడటంతో అధిష్టానం సాహసోపేత నిర్ణయం తీసుకుంది. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలు సతీశన్‌కే జై కొట్టడం ద్వారా కేరళలో పాత తరం రాజకీయాలకు తెరదించినట్లైంది. ఈ నిర్ణయం కేవలం కేరళంకు మాత్రమే పరిమితమైనది కాదు, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అనుసరిస్తున్న సరికొత్త వ్యూహానికి ఇది ఒక బలమైన నిదర్శనం. గతంలో కర్ణాటకలో డీకే శివకుమార్‌ను, తెలంగాణలో రేవంత్ రెడ్డిని ముందంజలో ఉంచి, తదనంతరం అధికారం దిశగా నడిపించిన కాంగ్రెస్, ఇప్పుడు అదే 'అగ్రెసివ్' ఫార్ములాను కేరళంలో అమలు చేస్తోంది. ముసలి నాయకత్వంతో కాకుండా, చురుకైన, కాలంతో పోటీ పడే నాయకులను ప్రోత్సహించడం ద్వారా బిజెపి, ప్రాంతీయ పార్టీల దూకుడును అడ్డుకోవాలని కాంగ్రెస్ కృతనిశ్చయంతో ఉంది. సతీశన్ ఎంపిక ద్వారా గ్రూపు రాజకీయాలకు అతీతంగా 'మెరిట్'కు ప్రాధాన్యం ఇస్తామనే సంకేతాన్ని పార్టీ కేడర్‌కు పంపింది. ఇది సామాన్య కార్యకర్తల్లో మునుపెన్నడూ లేని కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రస్తుతం కేరళంలో రాజకీయచిత్రం అత్యంత సంక్లిష్టంగా ఉంది. ఒక వైపు వామపక్షాలు తమ సోషల్ ఇంజనీరింగ్‌తో అన్ని వర్గాలను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పినరయి విజయన్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో బలంగాఉండగా, మరోవైపు, బిజెపి కేరళంలో గట్టి పునాది వేసేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తోంది. త్రిస్సూర్ లోక్‌సభ స్థానాన్ని గెలుచుకోవడం ద్వారా తమకు భవిష్యత్తు ఉందనే నమ్మకాన్ని బిజెపి కల్పించుకుంది. మైనారిటీ ఓట్లు చేజారకుండా చూసుకుంటూనే, హిందూ ఓటు బ్యాంకును కాపాడుకోవడంఆయనకు కత్తి మీద సాము వంటిదే. సామాజిక మాధ్యమాల్లో వామపక్షాల సైబర్ వింగ్‌ను ఢీకొట్టడం, ప్రతి గ్రామంలో పార్టీక్యాడర్‌ను ఉత్తేజితం చేయడం వంటి బాధ్యతలు ఆయనపై ఉన్నాయి. సతీశన్ రాజకీయ ప్రస్థానంలో మరొక విశేషం ఆయన లౌకికవాద దృక్పథం. కేరళంలో మతపరమైన సమీకరణాలు చాలా బలంగాఉంటాయి.కానీ ఆయన ఎప్పుడూ మతాతీత రాజకీయాలకే మొగ్గు చూపుతారు. గతంలో వరదలు వచ్చినప్పుడు లేదా కోవిడ్ సంక్షోభ సమయంలో ఆయన చేసిన సేవాకార్యక్రమాలు ఆయనకు రాజకీయాలకు అతీతంగా మద్దతును సంపాదించిపెట్టాయి. పినరైవిజయన్ వంటి ఉద్ధండుడైన నేతను ఎదుర్కోవాలంటే కేవలం రాజకీయ విమర్శలు మాత్రమేకాక,ప్రజలకు ఒక బలమైనభరోసా కల్పించడంలో కాంగ్రెస్ పార్టీని ముందు వరుసలో ఉంచగలిగారు.ఆభరోసాను కల్పించడంలో సతీశన్ సఫలమ వుతున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ●

# రష్యా చమురుపై ఆంక్షలు పునరుద్ధరణ!

**భారత్‌కు మినహాయింపు గడువు పొడిగింపునకు ట్రంప్ ససేమిరా**

**దేశీయంగా, అంతర్జాతీయంగా పెరగనున్న ముడిచమురు ధరలు**



**వాషింగ్టన్, మే 17:** రష్యా చమురుపై అమెరికా మళ్లీ ఆంక్షలను పునరుద్ధరించింది. అలాగే, ఇరాన్ తో యుద్ధం నేపథ్యంలో భారత్ వంటి కొన్ని దేశాలకు రష్యా నుంచి చమురు దిగుమతులకు మినహాయింపు ఇచ్చింది. అయితే, తాజాగా ఆ మినహాయింపు గడువును పొడిగించడానికి ట్రంప్ ప్రభుత్వం నిరాకరించింది. మాస్కోకు యుద్ధకాల ఆదాయాలను అరికట్టడానికి పాశ్చాత్య దేశాలు ప్రయత్నిస్తున్నప్పటికీ, భారతదేశం వంటి దేశాలు రష్యా ముడి చమురును కొనుగోలు చేయడాన్ని తాత్కాలికంగా మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందే. జనరల్ లైసెన్స్ 134బిని పునరుద్ధరించడానికి ట్రెజరీ డిపార్ట్‌మెంట్ నిరాకరించిన తర్వాత, మే 16న అమల్లోకి వచ్చిన ఈ చర్య, క్రెమ్లిన్‌పై ఒత్తిడిని పెంచడం, ఇరాన్ సంఘర్షణ, హార్ముజ్ జలసంధి మూసుకుపోతున్న అస్థిరత కారణంగా ఇప్పటికే కుదేలైన ప్రపంచ ఇంధన మార్కెట్లకు మరింత అంతరాయం కలగకుండా నిరోధించడం మధ్య వాషింగ్టన్ ఎదుర్కొంటున్న క్లిష్టమైన సమతుల్యతను స్పష్టం చేస్తుంది. మొదట మార్చి లో ప్రవేశపెట్టి, ఏప్రిల్‌లో పొడిగించిన ఈ మినహాయింపు, ఆంక్షల గడువు అమల్లోకి రాక ముందే ట్యాంకర్లలోకి ఎక్కించిన కొన్ని రష్యా చమురుకు సంబంధించిన లావాదేవీలను అనుమతించింది. మధ్యప్రాచ్యంలో యుద్ధభయాలు చమురు ధరలను పెంచి, కీలక షిప్పింగ్ మార్గాలకు ముప్పు వాటిల్లుతున్న తరుణంలో, మరింత తీవ్రమైన ప్రపంచ ఇంధన సంక్షోభాన్ని నివారించే లక్ష్యంతో తీసుకున్న తాత్కాలిక రక్షణ చర్యగా ప్రభుత్వ అధికారులు దీనిని సమర్థించారు. అయితే, ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధం విషయంలో అమెరికా, దాని ఐరోపా మిత్రదేశాలు ఆ దేశంపై ఆర్థిక ఒత్తిడిని పెంచాలని చూస్తున్న తరుణంలో, అమెరికా అనుసరిస్తున్న విధానం మాస్కోకు సమర్థవంతంగా ఆర్థిక ఉపశమనాన్ని కల్పించిందని వాషింగ్టన్, కీవ్‌లలోని విమర్శకులు వాదించారు. ఈ నేపథ్యంలోనే ట్రంప్, రష్యా చమురుపై ఆంక్షలను పునరుద్ధరించింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని మార్కెట్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పశ్చిమాసియాలో యుద్ధభయాలు, హార్ముజ్ జలసంధిలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో ముడి చమురు ధర బ్యారెల్ 90 నుంచి 100 డాలర్ల వరకు పలుకుతోంది. రష్యా చమురు ఆంక్షలు పునరుద్ధరించిన నేపథ్యంలో అంతర్జాతీయ విపణిలో చమురు ధరలు ఆకాశాన్నంటుతాయని ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు భారత్‌లో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశమున్నది ప్రజల్లో ఒకింత భయాందోళన నెలకొంది. ఇటీవల పెట్రోల్, డీజిల్ లీటర్‌పై రూ.3 చొప్పున పెంచింది. సిఎన్‌జిపై పెంచుసార్లు మొత్తంగా కిలో గ్రాముకు రూ.3 పెంచింది. ఈ నేపథ్యంలో రష్యా చమురుపై అమెరికా ఆంక్షల నేపథ్యంలో దేశీయంగా ఇంధన ధరలు మళ్లీ పెరిగే అవకాశముంది.

# ప్రధాని మోడీకి రాహుల్ గాంధీ సూటి ప్రశ్నలు



**నీట్ పేపర్ లీక్ కేసు..**

**న్యూఢిల్లీ, మే 17:** నీట్ యుజి-2026 ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. పేపర్ లీక్ ఘటనపై ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోడీపై నిప్పులు చెరిగారు. తాజాగా ప్రధాని మోడీకి మరోసారి పలు ప్రశ్నలు సంధిస్తూ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా సంబంధిత కేంద్రమంత్రి రాజీనామా చేయకపోవడం, ప్రధాని మౌనంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

**ఎంపి రాహుల్‌గాంధీ ఎక్స్ పోస్టు..**

'నీట్ 2024 పేపర్ లీక్ అయింది. పరీక్ష రద్దు కాలేదు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయలేదు. సిబిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. ఘటనపై నిజానిజాలు తేల్చేందుకు కేంద్రం కమిటీని కూడా ఏర్పాటు చేశారు. నీట్ 2026లోనూ పేపర్ లీక్ అయింది. పరీక్ష రద్దు అయింది. అయినా సంబంధిత కేంద్రమంత్రి రాజీనామా చేయలేదు. సిబిఐ మళ్లీ దర్యాప్తు చేస్తోంది. మరో కమిటీని ఏర్పాటు చేస్తున్నారు. మోడీగారూ.. దేశం మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతోంది. వాటికి సమాధానం చెప్పండి. పేపర్ లీక్ ఘటనలు పదేపదే ఎందుకు జరుగుతున్నాయి? ఈ పరీక్షా పత్రాలు లీకైపై మీరు ఎప్పుడూ ఎందుకు మౌనం వహిస్తున్నారు? పదేపదే విఫలమవుతున్న విద్యాశాఖ మంత్రిని ఎందుకు తొలగించడం లేదు?' అని ఎక్స్ వేదికగా రాహుల్‌గాంధీ పోస్టు పెట్టారు.

# యుఎఇ అణు కేంద్రంపై డ్రోన్ దాడి

**విద్యుత్ కేంద్రంలో చెలరేగిన మంటలు**

**అణు ప్లాంట్ భద్రతకు ఢోకా లేదు**

**యుఎఇ అణు నియంత్రణ సంస్థ వెల్లడి**



**దుబాయ్, మే 17:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని ఏకైక అణు విద్యుత్ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని ఆదివారం డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడితో అణు విద్యుత్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో మంటలు చెలరేగాయి. అయితే ఈ దాడిలో ఎవరికీ గాయాలైనట్లు గానీ, రేడియోధార్మిక పదార్థాలు విడుదలైనట్లు గానీ లేదని అధికార వర్గాలు తెలిపాయి. అయితే, ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ఇంకా పూర్తి కానందున, ఈ ఘటన మళ్లీ యుద్ధం చెలరేగే ప్రమాదానికి ఇదొక సంకేతమని పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ డ్రోన్ దాడికి ఎవరూ బాధ్యత వహించలేదు, యుఎఇ కూడా ఎవరినీ నిందించలేదు. 20 బిలియన్ డాలర్ల బరకా అణు విద్యుత్ ప్లాంట్‌ను దక్షిణ కొరియా సహాయంతో యుఎఇ నిర్మించింది. ఇది 2020లో కార్యకలాపాలు ప్రారంభించింది. ఇది అరబ్ ప్రపంచంలో మొట్టమొదటి, ఏకైక అణు విద్యుత్ ప్లాంట్. ఏడు షేక్‌డమ్‌ల సమాఖ్య అయిన యుఎఇ మొత్తం ఇంధన అవసరాలలో నాలుగో వంతును ఇది అందించగలదు. ఈ అగ్నిప్రమాదం ప్లాంట్ భద్రతను ప్రభావితం చేయలేదని యుఎఇ అణు నియంత్రణ సంస్థ తెలిపింది. 'అన్ని యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయి' అని పేర్కొంది. ఈ దాడికి ఏ పక్షాన్నీ యుఎఇ తన ప్రకటనలో నిందించలేదు. వియన్నా కేంద్రంగా పనిచేసే, ఐక్యరాజ్యసమితికి చెందిన అణుపర్యవేక్షక సంస్థ అయిన అంతర్జాతీయఅణుశక్తి ఏజెన్సీ (ఐఎఇఎ), ఈ దాడి కారణంగా ఒక విద్యుత్ జనరేటర్‌లో అగ్నిప్రమాదం జరిగిందని, ఒక రియాక్టర్‌కు అత్యవసర డీజిల్ జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోందని తెలిపింది. ఈ ఘటనపై ఐఎఇఎ డైరెక్టర్ జనరల్ రాఫెల్ మరియానో గ్రోస్సీ 'తీవ్ర ఆందోళన' వ్యక్తం చేశారని, అణు భద్రతకు ముప్పు కలిగించే సైనిక చర్యలు ఆమో దయోగ్యం కాదని పేర్కొన్నారు. ఈ దాడితో, నాలుగు రియాక్టర్లు కలిగిన బరకా ప్లాంట్ యుద్ధంలో లక్ష్యంగా మారడం ఇదే మొదటిసారి. ఇది సౌదీ అరేబియా సరిహద్దుకు సమీపంలో, యుఎఇ రాజధాని నగరం అబుదాబికి పశ్చిమాన సుమారు 225కిలోమీటర్ల (140 మైళ్ల) దూరంలో ఉంది.



# కాంగోలో విస్తరిస్తున్న ఎబోలా

**హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన ప్రపంచ ఆరోగ్యసంస్థ**

**జెనీవా, మే 17:** ఆఫ్రికా దేశాలను ఇపుడు మరో ప్రాణాంతక వైరస్ పీడిస్తోంది. అత్యంత ప్రమాదకర స్థాయిలో విస్తరిస్తున్న ప్రాణాంతక ఎబోలా వైరస్‌తో ఆఫ్రికా ఖండంలోని రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో 88మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 300 మంది ఈ వైరస్ బారిన పడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. కరోనా తరహాలోనే కఠిన సంరక్షణ చర్యలు తప్పనిసరి అవుతున్నాయి. ఈక్రమంలోనే ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. దీనివల్ల ప్రపంచ దేశాలకు తక్షణ ముప్పు లేకపోయినా కాంగో పొరుగు దేశాల్లో వేగంగా వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. 1976లో కాంగోలో ఎబోలాను తొలిసారిగా గుర్తించినప్పటి నుంచి ఇది 17వ సారి వ్యాప్తి చెందిందని డబ్ల్యూహెచ్‌వో వెల్లడించింది. ప్రాథమిక నమూనాలలో అధిక పాజిటివిటీ రేటు, వైరస్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండటం ఆందోళనకరంగా మారిందని పేర్కొన్నది. ఈ వైరస్‌కు ప్రత్యేకంగా అమోదించిన చికిత్సలు, వ్యాక్సిన్‌లు లేకపోవడంవల్ల దీనిని వెంటనే అరికట్టడం కూడా అసాధ్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. జాతీయ విపత్తు అత్యవసర నిర్వహణ యంత్రాంగాలను క్రియాశీలం చేయాలని ఆదేశించింది. వ్యాధి నిర్ధరణ అయినవారిని వెంటనే క్వారంటైన్ చేసి వారితో సంబంధం ఉన్నవారికి వైద్యపరీక్షలు నిర్వహించాలని కాంగో ప్రభుత్వానికి సూచన చేసింది.

# భారత్ చేరిన మరో ఎల్‌పిజి నౌక

**కాండ్లా పోర్టులో సిమ్మై**



**కాండ్లా (గుజరాత్), మే 17 :** పశ్చిమ ఆసియా సంక్షోభం మధ్య, 20,000 మెట్రిక్ టన్నుల ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి)ను తీసుకువెళ్తున్న ఒక నౌక హార్ముజ్ జలసంధిని దాటి గుజరాత్‌లోని కాండ్లాలో ఉన్న దీన్‌దయాల్ పోర్ట్ అథారిటీకి చేరుకుంది. మార్షల్ దీవుల జెండా కలిగిన ఎంవి సిమ్మై నౌక, మే 13న హార్ముజ్ జలసంధిని దాటి ఖతార్ నుండి తన ప్రయాణాన్ని ప్రారంభించి, శనివారం రాత్రి సుమారు 11.30 గంటలకు కాండ్లాలోని పోర్టులో లంగరు వేసిందని అధికారులు తెలిపారు. 21మంది విదేశీ సిబ్బందితో ఈ నౌక సుమారు 20వేల టన్నుల వంటగ్యాస్‌ను మోసుకొచ్చింది. మార్చి ఆరంభం నుండి ఇప్పటి వరకు భారత జెండా కలిగిన 13 నౌకలు (వీటిలో 12ఎల్‌పిజి ట్యాంకర్లు, ఒక ముడిచమురు ట్యాంకర్ ఉన్నాయి) హార్ముజ్ జలసంధిని దాటాయి. ఒమన్ తీరానికి సమీపంలో ఉన్న ఈ ఇరుకైన జలమార్గం గుండా ప్రపంచ ఇంధన సరఫరాలలో సుమారు ఐదవ వంతు వెళుతుంది. ఫిబ్రవరి 28న పశ్చిమ ఆసియాలో ప్రారంభమైన సంఘర్షణ కారణంగా ఇది తీవ్రంగా దెబ్బతింది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై సంయుక్తంగా దాడులు చేయడంతో, ప్రతీకార దాడులు చోటుచేసుకున్నాయి. దీని ఫలితంగా, ఇటీవలి దశాబ్దాలలో ప్రపంచం చూసిన అత్యంత తీవ్రమైన ఇంధన సంక్షోభాలలో ఒకటి ఏర్పడింది.

# నౌకలపై దాడులు సరికాదు

**ఐరాస వేదికగా ఖండించిన భారత్**

**లండన్, మే 17:** హార్ముజ్ జలసంధిలో నౌకలపై దాడులను ఐరాస వేదికగా భారత్ తీవ్రంగా ఖండించింది. ఇంధనం, సరఫరా ప్రవాహాలను పరిరక్షించడంపై ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక మండలి (యుఎన్ఇసిఒఎస్ఒసి) ప్రత్యేక సమావేశంలో, ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ మాట్లాడుతూ, హార్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం, పౌర సిబ్బందిని ప్రమాదంలో పడవేయడం, నౌకాయాన స్వేచ్ఛకు ఆటంకం కలిగించడం 'ఆమోదయోగ్యం కాదు' అని అన్నారు.

మే 13న, ఒమన్ తీరంలో భారత జెండాతో ప్రయాణిస్తున్న ఒక వాణిజ్య నౌకపై దాడి జరిగింది. సోమాలియా నుంచి ప్రయాణిస్తున్న ఆ నౌకలోని 14 మంది సిబ్బందిని ఒమన్ అధికారులు రక్షించారు, కానీ ఈ దాడి ఎవరు చేశారనేది వెంటనే తెలియరాలేదు.

# సుప్రీం న్యాయమూర్తుల సంఖ్య పెంచే బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం



**న్యూఢిల్లీ, మే 17:** సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపినట్లు కేంద్రన్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఆదివారం ప్రకటించారు. ఈ తాజా నిర్ణయంతో సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి కాకుండా న్యాయమూర్తుల సంఖ్య ప్రస్తుతమున్న 33 నుంచి 37కి పెరగనుంది. అంటే చీఫ్ జస్టిస్‌తో కలిపి మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 34 నుంచి 38కి చేరుకుంటుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ ఆర్డినెన్స్, 2026 ను రాష్ట్రపతి జారీ చేశారని, ఇది 1956 నాటి మూల చట్టాన్ని సవరిస్తుందని మంత్రి మేఘ్వాల్ తన సోషల్‌మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతకుముందు ఈనెల 5న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశం ఈ సంఖ్యను మరో నాలుగుకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. దేశ అత్యున్నత న్యాయస్థానంలో గుట్టలుగా పేరుకుపోతున్న కేసులు, పెరుగుతున్న వ్యాజ్యాలను వేగంగా పరిష్కరించడానికి ఇదొక సకాలంలో తీసుకున్న చర్యగా న్యాయవ్యవస్థకు చెందిన ప్రముఖులు దీనిని విస్తృతంగా స్వాగతిస్తున్నారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సీనియర్ అడ్వకేట్ వికాస్ సింగ్ ఈ అంశంపై మాట్లాడుతూ కోర్టులో కొత్త కేసులు దాఖలవుతున్న రేటు నిరంతరం పెరుగుతున్నందున, జడ్జీల సంఖ్యను పెంచాలనే డిమాండ్ చాలా కాలంగా ఉందని గుర్తుచేశారు. ప్రస్తుత న్యాయమూర్తుల కేసుల పరిష్కార రేటు అభినందనీయంగా ఉన్నప్పటికీ, విపరీతమైన కేసుల భారం వల్ల మరింత మంది న్యాయమూర్తులు అవసరమని అభిప్రాయపడ్డారు. దీనికి తగ్గట్టుగానే మౌలిక సదుపాయాలు సైతం పెరగాలని, ఈ ఏడాది చివరి నాటికి సుప్రీంకోర్టు నూతన భవనంలో కొంత భాగం అందుబాటులోకి వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. కొత్త భవనం వస్తే 38 మంది జడ్జీలకు సౌకర్యవంతంగా వసతి కల్పించవచ్చని, రాబోయే రోజుల్లో మొత్తం భవనం పూర్తయితే దాదాపు 50 మంది న్యాయమూర్తులు అవసరమవుతారని పేర్కొన్నారు.



# మాస్కోపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు


**మాస్కో, మే 17:** పశ్చిమాసియా యుద్ధానికి తోడు ఇపుడు ఉక్రెయిన్ రష్యా యుద్ధం కూడా తీవ్రస్థాయికి చేరింది. తాజాగా ఒకేసారి భారీ సంఖ్యలో డ్రోన్లతో రష్యాపై ఉక్రెయిన్ దాడి చేసింది. భారతీయ కార్మికుడితో సహా నలుగురు మరణించారు. మరో ముగ్గురు భారతీయ కార్మికులు, మరి కొందరు గాయపడ్డారు. రష్యాలోని భారత రాయబార కార్యాలయం ఈ విషయాన్ని ధృవీకరించింది. దాడి జరిగిన ప్రదేశాన్ని అధికారులు సందర్శించారని, గాయపడిన కార్మికులను ఆసుపత్రిలో పరామర్శించినట్లు తెలిపింది. ప్రాణనష్టం పట్ల రాయబార కార్యాలయం సంతాపం వ్యక్తం చేస్తోంది. భారతీయ కార్మికులకు అవసరమైన సహాయం అందించడానికి కంపెనీ యాజమాన్యం, స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తోందని భారత రాయబార కార్యాలయం ఎక్స్ పోస్ట్‌లో పేర్కొంది. ఆదివారం తెల్లవారుజామున రష్యాపై భారీ స్థాయిలో డ్రోన్ దాడులకు ఉక్రెయిన్ పాల్పడింది. రష్యా రాజధాని మాస్కోలోని కొన్ని ప్రాంతాలు, సమీప ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించాయి. 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా 1,000కు పైగా ఉక్రేనియన్ డ్రోన్‌లను అడ్డుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. మరోవైపు రాజధాని వైపు దూసుకొచ్చిన సుమారు 81 డ్రోన్‌లను వాయు రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని మాస్కో మేయర్ సెర్గీ సోబియానిన్ తెలిపారు. ఈ దాడుల వల్ల పలు ప్రాంతాల్లోని నివాస భవనాలు, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లినట్లు చెప్పారు. నలుగురు మరణించారని, వీరిలో ముగ్గురు మాస్కో ప్రాంతానికి చెందిన వారని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్ సరిహద్దు సమీపంలోని బెల్గోరోడ్ ప్రాంతంలో మరో మరణం నమోదైనట్లు వెల్లడించారు.

# భారత్ రక్షణ వ్యవస్థలోకి మరో 'కిల్లర్ మిసైల్'



**న్యూఢిల్లీ, మే 17:** రక్షణ రంగంలో స్వయం సమృద్ధిదిశగా భారత్ మరో భారీ ముందడుగు వేసింది. మనతో తరచూ కయ్యానికి కాలుదువ్వుతున్న దేశాలను నేరుగా దాడిచేసే సామర్థ్యం ఉన్న కిల్లర్ మిసైల్‌ను డిఆర్‌డివో అభివృద్ధిచేసింది. శత్రు దేశాల భారీ యుద్ధ నౌకలను, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లను సైతం సముద్రంలోనే జలసమాధి చేయగల అత్యంత శక్తివంతమైన హైపర్‌సోనిక్ క్షిపణిని అభివృద్ధి చేసింది. దీనిని ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ కిల్లర్ గా అభివర్ణిస్తున్నారు. హిందూ మహాసముద్రంలో చైనా కదలికలకు చెక్ పెట్టేలా దీనిని రూపొందించడం విశేషం. రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) ఈ లాంగ్ రేంజ్ యాంటీషిప్ హైపర్‌సోనిక్ మిస్సైల్ (ఎల్ఆర్ఏఎస్ హెచ్ఎం)ను దేశీయంగా అభివృద్ధి చేసింది. ఇది సుమారు 1,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. గంటకు దాదాపు 12,000 కిలోమీటర్ల (మాక్ 8 నుంచి 10) అసాధారణ వేగంతో ప్రయాణించడం దీని అతిపెద్ద బలం. ఈ వేగం కారణంగా శత్రువుల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు దీనిని గుర్తించి అడ్డుకోవడం దాదాపు అసాధ్యం. ఒక వేళ రాడార్‌పై కనిపించినా, శత్రు దేశాలు స్పందించేలోపే లక్ష్యాన్ని ఛేదించగల సామర్థ్యం ఆ మిస్సైల్ సొంతం. ఇది 1500 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 7 నిమిషాల 30 సెకన్లలోనే చేరుకుంటుంది అంటే దీని సత్తా ఏంటో అర్థమవుతుంది. చైనా నిర్మించిన అత్యాధునిక ఫ్యుజియాన్ విమాన వాహక నౌకను కూడా ఇది నిమిషాల్లో ధ్వంసం చేయగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఈ క్షిపణి, భారత నౌకాదళంతో యూజర్ ట్రయల్స్‌కు సిద్ధమవుతోంది. ఇటీవల ఒడిశా తీరంలో జరిపిన పరీక్షలు విజయవం తమయ్యాయి. 2027-28 మధ్యలో తుది ట్రయల్స్ ప్రారంభించి, 2030నాటికి పూర్తిస్థాయిలో నౌకాదళం లోకి ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంలో భాగంగా రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టు ఓ కీలక మైలురాయిగా నిలవనుంది. ఈ క్షిపణి వ్యవస్థ అందుబాటులోకి వస్తే హిందూ మహాసముద్రంలో భారత భద్రతా సామర్థ్యం, నిరోధకశక్తి కొత్త శిఖరాలకు చేరుకుంటాయి. సముద్ర తీర ప్రాంత రక్షణ మరింత పటిష్ఠం కానుంది.

# మార్పు కోరినందువల్లనే విజయ్ గెలుపు: రజనీకాంత్



**చెన్నై, మే 17:** తమిళనాడు ప్రజలు మార్పు కోరుకున్నారని అందుకే విజయ్ గెలిచారని స్టార్ హీరో రజనీకాంత్ అన్నారు. తనకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదన్నారు. తానే గనక పార్టీ పెడితే కచ్చితంగా గెలిచేవాడినన్నారు. డీఎంకే అధినేత స్టాలిన్ తనకు మంచి స్నేహితుడని తెలిపారు. అందుకే ఆయన్ని కలిసినట్లు వెల్లడించారు. ఎన్నికల ఫలితాల అనంతరం స్టాలిన్‌ను కలిసిన నేపథ్యంలో రజనీపై విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఆదివారం చెన్నైలోని తన నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరణ ఇచ్చారు. మరోవైపు విజయ్ సీఎంగా గెలవకూడదని తాను ఎలాంటి ప్రయత్నం చేయలేదని రజనీకాంత్ చెప్పారు. విజయ్‌ను తనకు సమవుజ్జీగా భావించడం లేదన్నారు. తమ వయసులో 28 ఏళ్ల వ్యత్యాసం ఉందన్నారు. కమల్‌హాసన్ సీఎం అయితే అసూయ పడతాను గానీ, విజయ్ విషయంలో అలాంటిదేమీ లేదన్నారు. రెండు ప్రధాన పార్టీలను ఢీకొని గెలిచిన విజయ్‌కు తాను శుభాకాంక్షలు తెలిపానని గుర్తుచేశారు. ఇటీవల ఎయిర్‌పోర్టులో ఓ వ్యక్తి విజయ్ గురించి ప్రస్తావించగా రజనీకాంత్ నవ్వుతూ వెళ్లిపోయిన విషయం తెలిసిందే. దీనిపై విమర్శలు రావడాన్నీ రజనీ తాజాగా ప్రస్తావించారు. ఎవరో వ్యక్తి ఫోన్‌లో రికార్డు చేస్తూ అడిగిన ప్రశ్నకు తాను స్పందించలేదన్నారు. తాను అనవసరంగా ఇతర విషయాల గురించి మాట్లాడే వ్యక్తిని కాదన్నారు.

# వెలివేసినా గుడిలోకెళ్లిందని.. ఓ గృహిణి అర్ధనగ్న ఊరేగింపు

**వాఘ్రినగర్, మే 17:** గ్రామంలో వెలివేసిన ఒక కుటుంబం గుడిలోకి వెళ్లినందుకు ఆ ఇంటి మహిళను అంతా కలిసి అర్ధనగ్నంగా ఊరేగించారు. ఆమె మెడలో చెప్పుల దండ వేసి మరీ దారుణానికి పాల్పడిన దారుణ ఘటన మహారాష్ట్రలోని ఉల్హాసన్ నగర్‌లోని, వాఘ్రినగర్ ప్రాంతంలో జరిగింది. పోలీసులు వివరాల ప్రకారం స్థానికంగా ఒక రాజ్‌పుత్ కుటుంబాన్ని కొంతకాలం క్రితం వారి సామాజిక వర్గానికి చెందిన వారు బహిష్కరించారు. కుల పంచాయితీలో వారిని బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా గుడిలోకి ప్రవేశాన్ని నిషేధించారు. ఇటీవల స్థానికంగా ఒక గుడిలో ఆ సామాజిక వర్గం వారంతా ఒక వేడుక నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆ కుటుంబానికి చెందిన ఒక యువకుడు హాజరయ్యాడు. దీంతో అక్కడున్న వారంతా కోపోద్రిక్తులయ్యారు. అతడిపై దాడి చేశారు. వారంతా కలిసి అతడి ఇంటిపైకి కర్రలు, రాడ్లతో దాడికి వెళ్లారు. ఇంట్లోని మగవారిపై దాడి చేసిన అనంతరం, ఇంట్లోని మహిళలపై దాడి చేశారు.

బాధిత కుటుంబం ఫిర్యాదు ప్రకారం నిందితులు ఇంట్లోని మహిళను రోడ్డుపైకి లాక్కొచ్చి, దుస్తులు లాగేశారు. అర్ధనగ్నంగా చేసి ఈడ్చుకెళ్లారు. అలాగే, మెడలో చెప్పుల దండ వేసి దాదాపు రెండు కిలోమీటర్లు ఊరేగించారు. ఇంకొందరు తమ కాళ్లపై పడి మొక్కాల్సిందిగా బలవంతం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ దారుణ ఘటన జరుగుతుండగా, చుట్టుపక్కల వాళ్లు ఆపడానికి ప్రయత్నించకుండా నిలబడి చూస్తూ ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ సరిగ్గా స్పందించలేదని, చాలా గంటల తర్వాత గానీ కేసు నమోదు చేయలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరు మహిళల్ని అరెస్టు చేశారు. మరికొందరిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సంక్షిప్తంగా..

### రాహుల్, ప్రియాంకలపై వాయనాడులో పోస్టర్లు




**వాయనాడ్, మే 17:** కాంగ్రెస్ సీనియర్ నేతలను లక్ష్యంగా చేసుకుని కేరళంలోని వయనాడ్ కాంగ్రెస్ పార్టీకార్యాలయం సమీపంలో పోస్టర్లు వెలిసాయి. ప్రియాంక గాంధీ వాద్రా నియోజకవర్గమైన వయ నాడ్‌లో ఈనెల 13న ఈపోస్టర్లు కనిపించాయి. ఆసమయంలో కేరళం తదుపరి సీఎం ఎవరనే సస్పెన్స్ కొనసాగుతోంది. సీఎం అభ్యర్థిగా కేసీ వేణుగోపాల్‌కు వ్యతిరేకంగా ప్రియాంక, రాహుల్ గాంధీకి హెచ్చరికలు ఈ పోస్టర్లలో చోటుచేసుకున్నాయి. మిస్టర్ రాహుల్ కేసీ వేణుగోపాల్ మీకు బ్యాగ్ బ్యారర్ కావచ్చు. కానీ కేరళంప్రజలు మిమ్మల్ని ఎప్పటికీ క్షమించరు అని ఒక పోస్టర్‌లో రాసి ఉంది. అలాంటి నిర్ణయమే తీసుకుంటే అంటే కేసీనే ఎన్నుకుంటే వయనాడ్ మీకు మరో అమేథీ అవుతుంది అని 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ అమేథీలో ఓడిపోవడాన్ని పరోక్షంగా మరో పోస్టర్‌లో ప్రస్తావించారు.

### గంగాజలాల ఒప్పందంపైనే ఇండో బంగ్లా భవిష్యత్ సంబంధాలు



**ఢాకా, మే 17:** భారత్‌తో భవిష్యత్తు సంబంధాలు కొనసాగాలంటే గంగానది నీటి పంపకాల ఒప్పందంపైనే ఆధారపడి ఉంటుందని బంగ్లాదేశ్ అధికార పార్టీ కొత్త మెలిక పెట్టింది. ఈ మేరకు బంగ్లాదేశ్ నేషనలిస్ట్‌పార్టీ బిఎన్‌పి ఒక ప్రకటన విడుదల చేసింది. తమ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా కొత్త ఒప్పందం కోసం చర్చలు జరపాలని భారత్‌ను డిమాండ్ చేసింది. కాగా ప్రస్తుతం అమల్లో ఉన్న ఇండో బంగ్లాదేశ్ గంగానదినీటి ఒప్పందం 1996లో జరిగింది. అప్పటి ప్రధాని షేక్ హసీనా హయాంలో కుదిరిన ఈడీల్ ఈ ఏడాది డిసెంబర్‌తో ముగి యనుంది. కొత్త ఒప్పందం కుదిరేవరకు పాత ఏర్పాట్లే కొనసాగాలని బంగ్లాదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి మీర్జా ఫక్రుల్ ఇస్లాం ఆలంగీర్ పేర్కొన్నారు.

### ఆయుధ వినియోగంపై ఇరాన్ శిక్షణ



**టెహ్రాన్, మే 17:** అమెరికా, ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో ఇరాన్ తన సొంత ప్రజలకు ఆయుధ శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్నిప్రారంభించింది. దేశవ్యాప్తంగా మసీదుల్లో పురుషులు, స్త్రీలకు తేలికపాటి ఆయు ధాల శిక్షణ పొందుతున్న వీడియోలను ఇరాన్ ప్రభుత్వ మీడియా ప్రసారం చేసింది. జాతీయ రక్షణ కోసం ఇలా శిక్షణ ఇస్తున్నట్లు ఇరాన్ ప్రకటించుకుంది. దీని కోసం ఇప్పటి వరకు 3.1 కోట్ల మందికి పైగా పేర్లు నమోదు చేసుకున్నట్లు ప్రభుత్వ టెలివిజన్ చెప్పింది. ఆపరేషన్ జాన్ ఫిదా బరాయే ఇరాన్ కోసం రక్షణ చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలుస్తోంది. అమెరికా, ఇజ్రాయిల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్‌కు మద్దతుగా పౌరులను ఏకం చేయడానికి ఆ దేశ ప్రయత్నిస్తోంది. దేశ ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లో అయినా అలర్ట్‌గా ఉండేందుకు ప్రభుత్వం అహ్వాజ్, కెర్మాన్, బిజార్, షిరాజ్, జాహెదాన్ వంటి నగరాల్లోని మసీదులను శిక్షణా కేంద్రాలుగా మార్చింది.

### రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో మంటలు..రెండు బోగీలు వేరుచేసిన సిబ్బంది



**రత్లాం(ఎంపి), మే 17:** మధ్యప్రదేశ్‌లో రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో మంటలు కలకలంరేపాయి. త్రివేండ్రం నుంచి హజరత్ నిజాముద్దీన్ రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆదివారం తెల్లవారుజామున కోటా రైల్వే డివిజన్ పరిధిలోని రత్లాం స్టేషన్ నుంచి రైలు బయల్దేరగా ఆలోట్ విక్రమ్‌గఢ్ రైల్వే స్టేషన్ల మధ్యలో ఏసీ కోచ్ నుంచి భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. రైలు కోచ్‌లో నుంచి మంటలు రావడాన్ని గార్డ్ గమనించి వెంటనే లోకో పైలట్‌ను అలర్ట్ చేశారు. వెంటనే రైలును అక్కడే నిలిపివేయగా రైల్వే పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. బోగీల్లోని ప్రయాణికుల్ని అప్రమత్తం చేసి కిందకు దించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రైల్వే అధికారులు వెంటనే రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి మంటలు అంటుకున్న బోగీలను వేరు చేశారు. ఆ తర్వాత ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు.


### లాయర్ ఛాంబర్లపైనా యోగి బుల్‌డోజర్ యాక్షన్

**లక్నో, మే 17:** ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూలో అక్రమ కట్టడాల కూల్చివేతకు యోగి ఆదిత్యనాథ్ సర్కార్ మరోసారి బుల్డోజర్ యాక్షన్‌కు దిగింది. జిల్లా మెజిస్ట్రేట్ (డిఎం) కార్యాలయం వెలుపల 240 లాయర్ ఛాంబర్ల కూల్చివేత పనులు ఆదివారం ప్రారంభం కావడంతో ఒకింత ఉద్రిక్తత చోటుచేసుకుంది. పాత హైకోర్టు కాంప్లెక్స్, సెషన్స్ కోర్టు, రిజిస్ట్రీ కార్యాలయం, డీఎం కార్యాలయం సమీపంలోని అక్రమ కట్టడాలను బుల్డోజర్లతో తొలగిస్తున్నారు. ఛాంబర్ల అక్రమ నిర్మాణాలపై ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలు కావడంతో వాటి కూల్చివేతకు హైకోర్టు ఆదేశాలిచ్చింది. అక్రమ కట్టడాలను మున్సిపల్ కార్పొరేషన్ గుర్తించివాటిపై గత మంగళవారం నోటీసులు అంటించింది. మే 16వ తేదీలోగా ఆక్రమణదారులు ఆ కట్టడాలను తొలగించాలని ఆదేశించింది.




## తిరుపతిలో ప్లెక్సీల రగడ

**తిరుపతి, మే 17 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రశాంత వాతావరణం ఉన్న తిరుపతి నగరంలో రాజకీయ రగడ చోటుచేసుకుంటోంది. ఇటీవల తిరుపతిలో కూటమి నేతలు భూకబ్జాలకు, రౌడీయిజానికి పాల్పడుతున్నారని వైసిపి నేతలు, వైసిపి నేతల బ్యాచ్ గంజాయి విక్రయిస్తూ తిరుపతిలో రెచ్చగొడుతున్నారని టిడిపి మహిళలు పరస్పర విమర్శలతో తిరుపతి వేడెక్కింది. ఎన్నికల సమయంలోనే రాజకీయంగా రగడజరిగే తిరుపతిలో ఇప్పుడు ఆధిపత్యం పోరుకు సిద్ధమంటున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం తిరుపతిలో పలు కూడళ్ళలో వైసిపి నేతలు భూమన కరుణాకర్ రెడ్డి, అభినయ్ రెడ్డిపై గంజాయి బ్యాచ్‌ను ప్రోత్సహిస్తున్నారంటూ ప్లెక్సీలు వెలిశాయి. ఇదీ పెద్దదుమారం రేపుతోంది. ఈ ప్లెక్సీలు తిరుపతి నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయడం ఉద్రిక్తతలకు కారణంగా మారింది. ఇటీవల ఆరు కిలోల గంజాయితో పట్టుబడిన వైసిపి నేత అనుచరుడు భాను అంటూ ప్లెక్సీలు ఏర్పాటవడం సంచలనం. ఆధ్యాత్మిక నగరాన్ని గంజాయి వనంగా మార్చవద్దంటూ ప్లెక్సీలు రావడం సర్వత్రా ఉత్కంఠరేపుతోంది. పుణ్యక్షేత్రం తిరుపతిని గంజాయి నుంచి కాపాడుదాం అంటూ ప్లెక్సీలు తిరుపతిని కాపాడుకుందాం.. భూమన కుటుంబాన్ని తరిమికొడదాం అంటూ ప్లెక్సీలు వెలియడం వెనుక తెలుగుమహిళల ప్రమేయం ఉందనేది హాట్ టాఫిక్.



## పాడి రైతులకు ప్రోత్సాహకాలు

**శ్రీకాళహస్తి, మే 17 ప్రభాతవార్త:** శ్రీ కాళహస్తి కోఆపరేటివ్ పాలసరఫరా సంఘం పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నది. ఈ నేపథ్యంలో రైతు కుటుంబం నుంచి వచ్చిన శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి రైతు, పాడి రైతుల సంక్షేమానికి పాటుపడుతూ పని చేస్తున్నారు. శ్రీకాళహస్తిలో పాడి పరిశ్రమను పటిష్ఠం చేయటానికి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కృషి చేస్తే ఆయన వారసుడు సుధీర్‌రెడ్డి రైతులకు అండగా నిలిచి వెనుకబాటులను, అలాగే సంక్షేమ పథకాలను అందించటంతో పాటు పదివరక్రమను అభివృద్ధి పరమటకు ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగుతున్నారు. ప్రతి ఏడాది పాడిరైతులకు డివిడెండ్లతో పాటు ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. ఈ ఏడాది పాడిరైతులకు ప్రోత్సాహకంగా 4లీటర్ల కుక్కర్లను ఇవ్వటానికి చైర్మన్ మునగాల మధుసూదన్(చిట్టి)ని ఆదేశించారు. ఈ మేరకు కొనుగోలు చేసిన కుక్కర్లను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డికి చూపించారు. దీని నాణ్యత గురించి ఎమ్మెల్యే వాకబు చేసారు. ఈ పరిశీలన కార్యక్రమాల్లో ఎమ్మెల్యేతో పాటు శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, కామేష్ యాదవ్‌లు పాల్గొన్నారు.

# నెల్లూరును రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం

- రూ.52.5 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి నారాయణ



**నెల్లూరు, మే 17 ప్రభాతవార్త-వైద్యం:** ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు బాటలో నడుస్తూ మంత్రి నారాయణ నెల్లూరులో కాన్వాయి, ప్రోటోకాల్ హంగులు లేకుండా సాదాసీదాగా ఒకే వాహనంలో పర్యటించి సామాన్యుడిలా ప్రజలతో మమేకమయ్యారు. ఆదివారం 3వ డివిజన్ సాదా వారి పాలెంలో 24 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేసారు. సాదావారిపాలెంలో వీధి వీధి తిరుగుతూ స్థానికులను ఆప్యాయంగా పలకరించిన మంత్రి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆత్మకూరు బస్టాండు వద్ద 28.5 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. దాతల సహకారంతో కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను వీఆర్‌సీ తరహాలో ఆధునీకరిస్తూ, పేద పిల్లలకు విద్యను ఆస్తిగా ఇచ్చే గొప్ప కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. నెల్లూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి చేసి దోమలు లేని నగరంగా మారుస్తామని, కాలువల ఆధునీకరణ ద్వారా నగరానికి ముంపు ముప్పు తప్పిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం అవకతవకలకు పాల్పడి, అస్తవ్యస్త పాలనతో పరిశ్రమలను వెనక్కి పంపేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేసిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పరిశ్రమల స్థాపనతోనే అభివృద్ధి సాధ్యమనే నిజాన్ని గత పాలకులు విస్మరించారని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్ పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. దేశంలోకి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో ఏకంగా 25శాతం పెట్టుబడులను ఆంధ్రప్రదేశ్‌కే తీసుకు వచ్చారని వెల్లడించారు. ఇప్పుడిప్పుడే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ కచ్చితంగా నెరవేరుస్తామని పునరుద్ఘాటించారు. ప్రస్తుతం నెల్లూరులో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని, భవిష్యత్తులో ఈ నగరాన్ని రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలుపుతామని పేర్కొన్నారు. అనంతరం మంత్రి నారాయణ జేమ్స్ గార్డెన్ లో ఇటీవలే ప్రారంభించిన భాస్కర్ ఆర్థోపెడిక్ ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన అధునాతన వైద్య పరికరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, రంగనాథ స్వామి ఆలయ చైర్మన్ లెక్కల వెంకరెడ్డి, 3వ డివిజన్ కోక్లస్టర్ శైలజ, ప్రెసిడెంట్ విజయమ్మ, వైస్ ప్రెసిడెంట్ గోవర్ధన్, యూనిట్ ఇన్‌చార్జ్ గొట్టిపాటి కృష్ణ, 45వ డివిజన్ ప్రెసిడెంట్ సుజన్, క్లస్టర్ ఇంచార్జ్ యశ్వంత్, కోక్లస్టర్ ఇంచార్జ్ డాక్టర్ పోకల రవి, నాయకులు జడ్. శ్రీనివాసులు రెడ్డి, మహేష్ స్థానిక టిడిపి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రకోటపై జాతీయ జెండా ఎగరడం అనుమానమే

- సర్‌కు వ్యతిరేకంగా పౌరులు ఉద్యమించాలి
- రాజకీయ, ఆర్థిక విశ్లేషకుడు పరకాల ప్రభాకర్



**తిరుపతి, మే 17 ప్రభాతవార్త ప్రతినిధి:** రానున్న ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురుతుందనే నమ్మకం లేదని, సమయం తక్కువగా ఉందనే నెపంతో జాతీయ గీతాన్ని పక్కన పెట్టే ప్రమాదం పొంచి ఉందనిరాజకీయ, ఆర్థిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్ అన్నారు. సర్‌సర్వాధికారాలు చెలాయించే పాలకుల (ధోరణి) కు వ్యతిరేకంగా పౌరులు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.ఆదివారం ఉదయం తిరుపతిలోని జరిగిన 'భారత రాజ్యాంగం సవాళ్ళు అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత అందరిదీ అని అన్నారు. ఈ సదస్సుకు మాజీ శాసనమండలి సభ్యులు జల్లి విల్సన్ అధ్యక్షత వహించారు. పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుత పాలకులు దేశంలో భావప్రకటన స్వేచ్ఛను పూర్తిగా హరిస్తున్నారన్నారు. గతంలో సమావేశాలు పెట్టుకోవడం, స్వేచ్ఛగా మాట్లాడుకునే వాతావరణం ఉండేది. కానీ భవిష్యత్తులో స్వేచ్ఛగా మాట్లాడుకోవడం అసంభవంగా మారే ప్రమాదం ఉందన్నారు.. నేడు రాజ్యాంగంపై దాడి జరుగుతోందని,. నెమ్మదిగా అందులోని ముఖ్యాంశాలను తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయని, రూపాయి విలువ రికార్డు స్థాయికి పడిపోయిందని మండిపడ్డారు. నేడు దేశంలో 6.5 కోట్ల ఓటు హక్కులను తీసేశారన్నారు. భవిష్యత్తులో మరో 16.50 కోట్ల ఓట్లను తొలగించబోతున్నారని వాస్తవాలను ఆయన జోస్యం చెప్పారు. ఎస్ఐఆర్ తర్వాత ఇంత పెద్ద సంఖ్యలో ఓట్లు తీసివేస్తే సమాజంలో ఓటు ఉన్నవాడు, లేనివాడు అనే రెండు రకాల మనుషులు మిగులుతారని ఎద్దేవా చేశారు. రాజ్యాంగం మనకిచ్చిన ఈ వరాన్ని కాపాడుకోవాలి అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ భారతదేశంలో భిన్న భాషలు, కులాలు, మతాలు ఉన్నాయి. అయితే నేడు ఆ భిన్నత్వాన్ని కాపాడుకునే పరిస్థితి ఉందా అనేదే పెద్ద ప్రశ్నగా మిగిలిందన్నారు. సమాఖ్య విధానం, లౌకిక విధానం, పార్లమెంటరీ విధానం, స్వతంత్ర న్యాయవ్యవస్థ ఉండాలని కోర్టు పేర్కొంది. నరేంద్ర మోదీ మూడుసార్లు అధికారంలోకి వచ్చారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను కలిగి ఉండి, వాటిని ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన న్యాయవ్యవస్థ నేడు బిజెపి చెప్పినట్లు నడుస్తోందని ఆరోపించారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ సమీప భవిష్యత్తులో రాజ్యాంగానికి పెద్ద ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందారు.. 2029 ఎన్నికల అనంతరం రాజ్యాంగం ఇలాగే మనుగడలో ఉంటుందనే నమ్మకం లేదన్నారు. వలసలు వచ్చిన వారిని కూడా అక్కున చేర్చుకున్న గొప్ప దేశం భారతదేశం అని స్వామి వివేకానంద ఎప్పుడో చెప్పారని గుర్తుచేశారు. మతాల పేరుతో ప్రజలను విడగొడుతున్నారని ఆవేదన చెందారు. హిందువులదే పెద్ద మతం అంటూ ఘర్షణలు సృష్టించి, అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. దేశంలోని 12 పోర్టులను, 6 విమానాశ్రయాలను అంబానీ, అదానీలకు అప్పగించారన్నారు.

# విద్యుత్ సమస్యలు తెలుసుకునేందుకు నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి

తిరుపతి, మే 17 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుండి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు "డయల్ యువర్ సిఎండి" కార్యక్రమాన్ని ఎస్‌పిడిసిఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. కాగా డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమంతో బాటు సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 గంటల నుండి నుంచి 9:30 గంటల వరకు "డయల్ యువర్ ఎస్ఇ" కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను ఎస్ఇల దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు ఈ నంబర్లకు కాల్ చేయాల్సి ఉంటుంది. తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 99637 07847.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

## అడవి పంది దాడి... ముగ్గురికి గాయాలు

- తిరుపతి జిల్లా జీవిపురం దళితవాడలో ఘటన

**ఓబులవారిపల్లి, మే 17 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా ఓబులవారిపల్లి మండల పరిధిలోని అటవీ ప్రాంత సమీపం గ్రామం జీవి పురం దళితవాడలో పిల్లలు ఇంటి పరిసర ప్రాంతాలలో కూర్చుని ఉండగా ఆదివారం ఉదయం అడవి పంది మహేష్, మరో ఇద్దరు చిన్నారులపై దాడిచేసింది. అలాగే గాజుల గ్రామానికి చెందిన మరొకరు స్కూటర్లో వెళుతున్న వ్యక్తిపై దాడి చేసి గాయపరిచినట్లు బాధితులు తల్లిదండ్రులు తెలిపారు. అనంతరం ఓబులవారిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకున్నారు. అడవులు పందుల, ఎలుగుబంట్లు సంచారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారని భయభ్రాంతులకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గాదిల నూకనపల్లి కొత్తపల్లి బాలిరెడ్డిపల్లి, వైకోట అటవీ శివారు గ్రామాల ప్రాంతాల ప్రజలు ప్రాణాల అరచేతిలో పెట్టుకుని జీవనం సాగిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకొని అడవి మృగాలను గ్రామంలోకి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

## లారీ బీభత్సం.. ఇద్దరు యువకులు మృతి

**విజయవాడ, మే 17 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం పెద్ద తుమ్మడి పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు మరణించారు. చిన్నతుమ్మడికి చెందిన వేముల శివయ్య (27), కాగిత అమలేశ్వరరావు(27) ఇరువురు ద్విచక్ర వాహనంపై బంటుమిల్లి వస్తున్నారు. పెద్ద తుమ్మడు పరిధిలోని మురుగు కాలువ పైన ఉన్న వంతెన దాటగానే ఎదురుగా వస్తున్న బంటుమిల్లి నుంచి హనుమాన్ జంక్షన్ వెళుతున్న లారీ వేగంగా ఢీకొట్టి వారిని ఈడ్చుకుంటూ మురుగు కాలువలోకి దూసుకు వెళ్లింది. ఢీ కొట్టిన వేగానికి వేముల శివయ్య అక్కడికక్కడే మృతి చెందాడు, మరో వ్యక్తి కాగిత అమలేశ్వరరావును అంబులెన్స్‌లో మచిలీపట్నం తరలిస్తుండగా దారి మధ్యలో మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రగ్స్ విక్రయిస్తూ పట్టుబడ్డ ఇద్దరు యువకులు

**విజయవాడ, మే 17 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో ఎండిఎంఎ డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్ నుంచి మాదకద్రవ్యాలను తెచ్చి విజయవాడలో నిందితులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పోలీసులు జరిపిన సోదాల్లో పైతన్, మంగీలాల్ అనే ఇద్దరు యువకుల నుంచి సుమారు 6 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్ సరఫరా చేస్తుండగా విజయవాడ వన్‌టౌన్ పోలీసులు వారిని పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి?, ఇంకా ఎవరెవరికి సరఫరా చేశారు? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మాదకద్రవ్యాల నియంత్రణపై తాము ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. డ్రగ్స్ విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# సామాజిక బాధ్యతతోనే హైబ్రిడ్ విధానంలో మహానాడు

## ఎపి టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



**గాజువాక, మే 17 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు కార్యక్రమాన్ని ఈసారి వినూత్నంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. దేశవ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంరక్షణ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుకు స్పందిస్తూ, సామాజిక బాధ్యతగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. గాజువాక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు, రాష్ట్ర టీడీపీ కార్యవర్గంలో రెండోసారి నిర్వహణ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన పుచ్చా విజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ.. నెల్లూరులో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో మహానాడు కోసం ఇప్పటికే భారీ ఏర్పాట్లు చేసినప్పటికీ, ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ కోసం కార్యకర్తల రాకపోకలను నియంత్రిస్తూ వినూత్నంగా ప్లాన్ చేశామన్నారు. కార్యకర్తల భాగస్వామ్యాన్ని తగ్గించకుండా రాష్ట్రవ్యాప్తంగా 1848 క్లస్టర్లలో భారీ ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అమరావతిలోని టీడీపీ ప్రధాన కార్యాలయం నుంచి జరిగే మహానాడు ప్రధాన కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఆయా క్లస్టర్లలో కార్యకర్తలు వీక్షించేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ మహానాడులో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాష్ట్ర పునర్నిర్మాణం వంటి ముఖ్య అంశాలపై చర్చిస్తామని, అలాగే జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆలోచనల మేరకు పార్టీ నిర్మాణంలో 40 శాతం వరకు యువ నాయకత్వానికి అవకాశాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు యువతకు బాధ్యతలు అప్పగిస్తూ భవిష్యత్ రాజకీయాలకు టీడీపీ సన్నద్ధమవుతోందని పల్లా శ్రీనివాసరావు వివరించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇంచార్జి ప్రసాదుల శ్రీనివాస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# జూన్ 26నుండి తిరుపతిలో జాతీయ నృత్య పోటీలు

**తిరుపతి, మే 17 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమ రంగస్థలం తిరుపతి శ్రీకృష్ణదేవరాయ కళా దర్బార్ వేదికపై తిరుపతి మహా కళాక్షేత్రంలో జూన్ 26 నుండి 28 వరకు మూడురోజులు జాతీయస్థాయి నృత్యపోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల వివరాలను రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, కార్యదర్శి కెఎన్ రాజా వెల్లడించారు. మూడురోజులు జరిగే జాతీయస్థాయి నృత్యపోటీలు ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు శాస్త్రీయ జానపద బృంద నృత్యాలు, సోలో నృత్య పోటీలు, నృత్య పోటీలు, బృంద నృత్య పోటీలలో ప్రతి విభాగంలోనూ కళాకారులు పాల్గోనవచ్చున్నారు. పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన కళాకారులకు ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ఆకర్షణీయమైన జ్ఞాపికలు బహుకరించబడుతాయి. సలార్ నృత్య పోటీలలో ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు, జ్ఞాపిక ఇవ్వబడుతుందన్నారు. ఈ పోటీలలో పాల్గొనే కళాకారులకు ప్రతి ఒక్కరికి ప్రదర్శన బహుమతిగా మెమొంటోలు, ప్రశంసా పత్రం అందజేయబడుతుంది. దూరప్రాంతాల నుండి విచ్చేయు కళాకారులకు ఉచిత అల్పాహారం, భోజనం సమకూరుస్తారు. ప్రతిభగల కళామూర్తులకు, సేవామూర్తులకు శ్రీకృష్ణదేవరాయ పురస్కారంతో బహుకరించబడుతుందన్నారు. ఆసక్తి గల కళాకారులు తమ పేర్లను మే 31వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి తెలియజేశారు.

## రెండోఘాట్‌లో బస్సుల తనిఖీకి ప్రత్యేక 'బస్‌బే'




**తిరుమల, మే 17ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల పుణ్యక్షేత్రానికి వస్తున్న లక్షలాదిమంది యాత్రికులు తమ వాహనాలను, లగేజీలను అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రంలో తనిఖీ చేసుకోవడం జరుగుతుంది. ఇదే సమయంలో సామాన్యభక్తులు కూడా పలు రకాలుగా తిరుపతికి చేరుకుని తిరుమలకు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. ఇలా ప్రయాణించే వారిని ఇకపై సప్తగిరి తనిఖీ కేంద్రం వద్ద దిగి తనిఖీ చేసుకోవాల్సిన అవసరం లేదు. ఆర్టీసి బస్సులన్నీ టోల్‌గేట్ దాటిన తరువాత వచ్చే వరసిద్ధి వినాయకస్వామి ఆలయం సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న బస్‌బేలో చేరుకుని తనిఖీ చేసుకోవాల్సి రానుంది. ఇప్పటికే ప్రతిరోజూ 450 వరకు ఆర్టీసి బస్సులు తిరుమల- తిరుపతి, తిరుపతి- తిరుమల మధ్య నడుస్తున్నాయి. 40వేల మంది వరకు యాత్రికులు ప్రయాణిస్తున్నారు. అలిపిరి తనిఖీకేంద్రంలో వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఇక్కడ బస్సులు దిగిన ప్రయాణీకులు/ భక్తులు తిరిగి అదే బస్సులను ఎక్కడంలో అవస్థలు పడుతున్నారు. కొన్ని సమయాల్లో బస్సులు తప్పిపోతున్నారు. దీంతో ఈ తనిఖీలను మరింత సాఫీగా సులభంగా వినాయకస్వామి గుడివద్ద చేపట్టేందుకు బుధవారం టిటిడి బోర్డు కూడా అమోదించింది. అలిపిరి టోల్‌గేట్‌లో వేకువజామున 3గంటల నుండి అర్ధరాత్రి 12గంటల వరకు వాహనాలను అనుమతిస్తున్నారు. దేశం నలుమూలల నుండి వస్తున్న యాత్రికులతోబాటు 10వేలకు పైగా వాహనాలు, 450వరకు ఆర్టీసి బస్సులు, రెండువేల వరకు స్థానిక వాహనాలు, ట్యాక్సీలు, మరో వెయ్యివరకు ద్విచక్ర వాహనాలు ఇలా పెద్దసంఖ్యలో అలిపిరి టోల్‌గేట్ దాటుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. బస్సులను ఇకపై వినాయకగుడి వద్ద బస్‌బేలో తనిఖీలు చేయాలని నిర్ణయించడం విశేషం. 12లేన్లను 15లేన్లుగా విస్తరించడానికి చర్యలు చేపడుతున్నారు.



శ్రీకాళహస్తిలో తొలగించిన వీధి కొళాయిలు

# పబ్లిక్ కొళాయిలు బంద్

- ఇంటింటికి కనెక్షన్ తీసుకోవాల్సిందే!
- మున్సిపాలిటి నిర్బంధం... మండిపడుతున్న జనం

**శ్రీకాళహస్తి, మే 17 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో అధికారులు పబ్లిక్ కొళాయిలను మూసివేస్తున్నారు. ఇదేమంటే ప్రభుత్వ ఆదేశాలంటున్నారు. పన్నుల వసూళ్ళకు వివిఎంపల్లిలో నీటిని బంద్ చేసిన అధికారి నేడు పట్టణంలోని వీధి కొళాయిలను ప్రభుత్వ ఆదేశాలంటూ మూసివేస్తున్నారు. మురికివాడల్లో తప్ప ఎక్కడా పబ్లిక్ కొళాయిలు ఉండరాదనే నిబంధనలతో మూసివేస్తున్నట్లు సంబంధిత ఇంజనీర్ చెబుతున్నారు. మున్సిపాలిటిలో ఇదేం నిర్ణయం అంటూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ ఏడాది పన్నువసూళ్ళతో బెంబేలెత్తిన ప్రజలు మరో నిర్ణయంతో విస్తుపోతున్నారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటిలోని నాలుగు మాడావీధులు తప్ప మిగిలినవి అన్ని వార్డుల్లోనూ మురికివాడలే. అయితే ఇక్కడ ప్రతి వీధిలోనూ ప్రజలు మున్సిపల్ కొళాయి నీటిని ఉపయోగించుకుంటున్నారు. మునిసిపల్ అధికారుల నిర్ణయంతో ఆ వీధుల్లో మంచినీటిని వాడుకునే ప్రజలు మంచినీటి కోసం ఎక్కడకు వెళ్ళాలి? అనేది చర్చనీయాంశంగా మారింది. వీధి కొళాయిలు మూసి వేసి ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ తీసుకోవాలని నిర్ణయించటం పట్ల నిరుపేదల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమౌతుంది. శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో 34వార్డులుంటే 40వరకు మురికి వాడులున్నట్లు మున్సిపల్ రికార్డులు చెబుతున్నాయి. ప్రతి వీధిలో నిరుపేదలున్నారు. వారు వీధి కొళాయి నుంచి నీటిని తీసుకుంటున్నారు. ప్రస్తుతం అధికారులు వీధి కొళాయిలు మూసివేస్తే నిరుపేదల దాహార్తి తీరేదెట్లా? అని వాపోతున్నారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటి వివాదాలపై వివరణ కోరటానికి కమిషనర్‌కు ఫోన్ చేస్తే ఆయన ఫోన్ తీయరు. నేను తరువాత చేస్తామంటూ మెసేజ్ పెడతారు. ఇక డిఇఇ ఫోన్ ఎప్పుడు చూసినా స్విచ్ ఆఫ్ అంటూ సమాధానం వస్తుంది. ఇలా నిరుపేదల కొళాయిలకు సంబంధించి వివరణ కోరటానికి ప్రయత్నించగా ఎఇఇ సమాధానం చెబుతూ 'ఇది ప్రభుత్వ నిర్ణయం' కాబట్టి ప్రతి ఒక్కరు కొళాయి కనెక్షన్ తీసుకోవాల్సిందే అంటూ సమాధానం చెబుతున్నారు.


# శరవేగంగా వరదరాజస్వామి ఆలయ నిర్మాణ పనులు



ప్రసన్న వరదరాజస్వామి ఆలయానికి ద్వారబంధం ఏర్పాటు చేసిన దృశ్యం

**శ్రీకాళహస్తి, మే 17 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలోని ప్రసన్న వరదరాజస్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వైకాపా పాలనలో సుమారు రూ.6 కోట్లతో చేపట్టిన పనులకు ఎన్నో అవరోధాలు, అటంకాలు, ఇబ్బందులతో ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒరెండేళ్ళలో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అభివృద్ధి పనులపై దృష్టి సారించారు. యుద్ద ప్రాతిపదికపై పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే కూలీల సమస్యలతో పనులు నత్తనడకన నడుస్తున్నాయి. రాయి, నిధులున్నా కార్మికుల సమస్యతో పనుల్లో మందగొడిగా సాగాయి. ప్రస్తుతం యుద్ద ప్రాతిపదికపై నసులు సాగుతున్నాయి. మరో రెండు నెలల్లో శ్లాబ్ వేయటానికి సన్నాహాలు చేస్తున్నారు.

**ద్వారబంధం ఏర్పాటు:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయంనిర్మాణంలోభాగంగా ద్వారబంధాలను ప్రతిష్టించారు. నిర్మాణంలో ప్రధాన భాగమైన ప్రధాన ద్వారం స్వామి గర్భగుడి ద్వారాలను ఏర్పాటు చేసారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యుల సూచనలతో సుమూహూర్తంలో ద్వారబంధాలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించిన ఆలయ ఇఇ శ్రీనివాసరాజు కార్మికులు, కాంట్రాక్టర్‌తో మరో 45రోజుల్లో శ్లాబ్ వేయాలని ఈ నేపథ్యంలో పనులు ముందుకు సాగాలని సూచించారు. ఈ ఆలయ నిర్మాణానికి సంబంధించి కుప్పం నుంచి ప్రత్యేకంగా రాతిని తెప్పించారు. మొత్తం 18 లేయర్ల పనుల్లో ద్వారబంధంతో 13లేయర్ల పనులు పూర్తి అయినట్లు తెలిసింది. దాంతో ఇక ఐదు లేయర్ల పనులు చేయాల్సి ఉంది ఇదే కీలకం. ఇప్పటికే ఆలయానికి ఓ రూపు ఏర్పడింది. సుమారు ఐదేళ్ళుగా ఈ ఆలయ నిర్మాణం సాగుతుంది. మరో ఆరు నెలలు అయితే తప్ప పూర్తి కాదు. కాగా ఆలయ ఇఓగా బికె వెంకటేశులు బాధ్యతలు చేపట్టిన నాలుగు నెలల్లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయుటకు పట్టుదలగా ఆయన క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. కాంట్రాక్టర్లను పరుగులు తీయిస్తున్నారు. దాంతో పనుల్లో వేగం పెరిగింది. పట్టణ నడిబొడ్డులోని వైష్ణవ ఆలయం ఇది ఒక్కటే. ఇక్కడ పనులను చకచకా సాగించి పూర్తి చేయుటకు దేవస్థానం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఎట్టకేలకు ద్వారబంధం పనులు పూర్తి అయ్యాయి.



## టిటిడి అగరబత్తీలు ఇక లేనట్లేనా!?

● ఉత్పత్తి లేక కౌంటర్లు మూత

**తిరుమల, మే 17 ప్రభాతవార్తప్రతినిధి:** ఎంతోపవిత్రంగా భావించే టిటిడి అగరబత్తీల కోసం భక్తులు నిరీక్షిస్తున్నారు. ఏడుకొండలస్వామి వారికి అలంకరించే పుష్పాలతో, పూలమాలలతో బాటు వివిధ స్థానిక ఆలయాల్లో స్వామిఅమ్మవార్లకు వినియోగించిన వాడిన పుష్పాలతో అగరబత్తీలు తయారుచేస్తున్నారు. ఒకసారి ఏడురకాల అగరబత్తీలను టిటిడి తయారుచేసి మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ ఉత్పత్తుల తయారీని బెంగళూరుకు చెందిన ఓ ప్రైవేట్ సంస్థకు 2021లో అప్పటి టిటిడి పెద్దలు అప్పగించారు. ఆ సంస్థ అగరబత్తీల తయారీని ప్రారంభించింది. అప్పట్లోనే టిటిడి నిబంధనలు ఉల్లంఘించి ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టారనే ఆరోపణలు. గత ఏడేళ్లుగా నిర్విరామంగా కొనసాగిన ఏడురకాల ఉత్పత్తుల అగరబత్తీలకు ఇటీవల బ్రేక్ పడింది. దీనివెనుక కారణాలు ఏమైనా గత రెండునెలల క్రితం టిటిడి జెఇఒ. డాక్టర్ ఎ.శరత్ అగరబత్తీల ఉత్పత్తిచేసే ప్రాంతాన్ని తనిఖీ చేశారు. మరో మూడురకాలు అదనంగా కొత్త బ్రాండ్లను తీసుకురావాలని సూచించారు. తయారీ ప్రక్రియ, నాణ్యత ప్రమాణాలు, ముడిసరుకు వినియోగం, ప్యాకేజింగ్ విధానం తదితర అంశాలను జెఇఒ పరిశీలించారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చామంతి, గులాబీ, తామర పూల సుగంధాలతో అగరబత్తులు తయారయ్యేవి. ఇవేగాక అదనంగా సంపంగి, వెయ్యి వరహాలు, తులసి సుగంధాలతో మరో మూడు కొత్త రకాల అగరబత్తులను త్వరలో తయారు చేయాలని కూడా సూచించారు. అయితే అగరబత్తీల తయారీకి ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టర్తో ఇప్పటి టిటిడి పెద్దలు ముఖంగా లేకపోవడంతో ఏకంగా ఉత్పత్తులకే గ్రహణం పట్టింది. దీనివల్ల రోజు వందలసంఖ్యలో భక్తులు టిటిడి అగరబత్తీల కోసం తిరుమలలోని కౌంటర్ల వద్ద, తిరుపతిలోని విక్రయశాలల వద్ద పడిగాపులు కాస్తున్నారు. భక్తుల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలిగించే ఉత్పత్తులను అందించడమే టిటిడి లక్ష్యమని పెద్దలు పేర్కొన్నా భక్తుల డిమాండ్కు తగ్గట్టు ఉత్పత్తి చేయాల్సింది పోయి బ్రేక్ వేయడం పెద్ద దుమారం రేపుతోంది.

# ఇంద్రకీలాద్రిపై భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ



**ఇంద్రకీలాద్రి, మే 17 ప్రభాతవార్త:** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం సూర్యోపాసన సేవ అత్యంత వైభవంగా నిర్వహించబడింది. లోక కల్యాణార్థం, భక్తుల క్షేమం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులందరూ పాల్గొని అరుణ పారాయణం, మహాసౌర పారాయణం, సూర్య అష్టోత్తర శతనామావళిని పఠిస్తూ సూర్య భగవానుడికి ప్రత్యేక అర్చనలు చేశారు. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం సూర్యోపాసన వల్ల ఆరోగ్యం, తేజస్సు, మానసిక ప్రశాంతత లభిస్తాయని పండితులు తెలిపారు. ఆదివారం సూర్యుడికి ప్రీతికరమైన రోజు కావడంతో ఈ సేవకు విశేష ప్రాధాన్యత ఉంది. సూర్యోపాసన అనంతరం కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక హారతులు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**అంతరాలయ దర్శనాలు నిలిపివేత:** ఆదివారం, వేసవి సెలవులు వివాహాల సీజన్, ఆదివారం రద్దీతో ఇంద్రకీలాద్రి క్షేత్రం భక్తులతో నిండిపోయింది. దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో తెల్లవారు జాము నుండే అన్ని దర్శనం క్యూ లైన్లు కిక్కిరిసాయి. భక్తులరద్దీ పరిస్థితి గమనించి ఆలయ ఈవో వికె శీనా నాయక్ భద్రతా ఏర్పాట్లు, క్యూ లైన్లు పరిశీలన చేశారు. భక్తులందరికి శ్రీ దుర్గామల్లేశ్వరుల దర్శనం సులభతరంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకున్నారు. రద్దీ కారణంగా ఉదయం 10.30 నుండే రు.500 దర్శనం టికెట్ల అమ్మకాలు నిలుపుదల చేసి, అంతరాలయ దర్శనం పూర్తి స్థాయిలో నిలుపుదల చేశారు. తిరిగి దర్శనము మధ్యాహ్నం 1.30 నిమిషములకు అంతరాలయ దర్శనం తిరిగి ప్రారంభం అయినది. వేసవి ఎండ తీవ్రత వలన కొంతమంది భక్తులు ఇబ్బంది పడుతుండగా దేవస్థానం ప్రథమ చికిత్స కేంద్రంలో ఉపశమన చర్యలు తీసుకొని వైద్యం అందజేశారు.

**భక్తునికి పోగొట్టుకున్న బంగారు హారం అందజేత:** ఓం సాయి ఉయ్యూరు వారు 12 గ్రాముల బంగారు చైను దర్శనమునకు వచ్చి పోగొట్టుకున్న సమయమున ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ హరికృష్ణ'కి నేలపై బంగారు గొలుసు దొరకగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసు ఆధ్వర్యంలో 12 గ్రాముల చైను తిరిగి అప్పగించారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** శ్రీ దుర్గమల్లేశ్వర




స్వామివార్ల దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకమునకు విజయవాడకు చెందిన కురెళ్ల రాధ, జితేంద్ర కుమార్ కురెళ్లలు జ్యోతిర్మయి హరి లక్ష్మి జ్ఞాపకార్థం రూ.1,01,116లు అందించారు. విజయవాడకు చెందిన దుర్గా కామేశ్వర రావు (కె.వి.లీలా క్లినిక్) నోరి విభ పేరిట రూ.1,00,000లు విరాళమందించారు. ఒంగోలుకు చెందిన బబ్బూరి శేషగిరిరావు కుమారుడు సుబ్బారావు, వీరి భార్య శిరీషతో కలసి రూ. 1,01,116 లు విరాళమందించారు. విజయవాడకి చెందిన ఎ.వెంకట కృష్ణారావు కెన్ గ్రిడ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట రూ.1,01,116లు విరాళాన్ని ఆలయ అధికారులకు అందచేశారు. దాతలకు శ్రీ స్వామిఅమ్మవార్ల దర్శనానంతరం తీర్థప్రసాదములు అమ్మవారి చిత్రపటము, వేదపండితులచే వేదాశీర్వచనము అందచేశారు.

**రసభరితం కూచిపూడి నృత్యార్చన:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆదివారం సాయంత్రం ధర్మపథంలో భాగంగా బెంగళూరుకు చెందిన నృత్య డాన్స్ క్లాసెస్ ఆచార్యులు ముని పల్లి మహతి నేతృత్వంలో నృత్య బృందం ప్రదర్శిం చిన కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులకు భక్తిరసాన్ని పంచాయి. కూచిపూడి నాట్య సాంప్రదాయంలో ఎంతో ప్రాచుర్యం



పొందిన కృష్ణ శబ్దం, మండూక శబ్దం ప్రదర్శనలను కళాకారులు తమ అభినయంతో, ముద్రలతో ప్రదర్శిం చిన అంశాలు వీక్షకులను ఎంతగానో అలరించాయి. మరకత మణిమయ, శివాష్టకం, భ్రమాంజలి వంటి భక్తిరస నృత్య రూపకాలతో ఇంద్రకీలాద్రి క్షేత్రం నాట్య నీరాజనం ఆధ్యాత్మిక వైభవాన్ని చాటాయి. కార్యక్రమం ముగిసిన అనంతరం ఆలయ అధికారులు కళాకారులను శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.



**పాతమెట్లమార్గం పరిశీలించిన ఇఓ:** ఇంద్రకీలాద్రి పాత మెట్ల మార్గాన్ని మరమత్తు పనులు ఇఓ సీనా నాయక్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొండపై ఇన్ఛార్జ్గా ఉన్న ఇఇ1 కోటేశ్వరరావు, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ అండ్ టీమ్లకు పాత మెట్ల మార్గం పనులను వేగవంతం చేయాలని ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పనుల నాణ్యతపై అధికారులకు ఇఓ పలు సూచనలు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా మెట్ల మార్గంలో భక్తులకు అవసరమైన నీడ, తాగునీరు వంటి కనీస వసతులు ఇకపై కూడా పగడ్బందీగా కల్పించాలని సూచించారు.

**నేడు హుండీ లెక్కింపు:** దుర్గమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను సోమవారం ఉదయం 7 గంటల నుండి మహామండపం 6వ అంతస్తులో హుండీ లెక్కింపు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.



మాత్రల రూపంలో ఉన్న జిహాదీ డ్రగ్

## భారత్లో ఐఎస్ఐ, ఐసిస్ ఉగ్రవాదులకు జిహాదీ డ్రగ్ అందిస్తున్న పాకిస్థాన్

### సిరియా అంతర్యుద్ధంలో తొలిసారిగా వాడిన ఐసిస్ ఉగ్రవాదులు

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** భారత్లో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఐఎస్ఐ, ఐసిస్ ఉగ్రవాదులకు నిద్ర, అలసట లేకుండా చేసేందుకు జిహాది డ్రగ్ పేరిట సింథటిక్ డ్రగ్ను దాయాది దేశం పాకిస్థాన్ సరఫరా చేస్తోందని నిఘా వర్గాలు గుర్తించాయి. భారత్లో తొలిసా రిగా ఈ డ్రగ్ను గుజరాత్లో పట్టుకోగా దీనిపై విచారించిన నిఘా వర్గాలు దీని వెనుక పాక్ హస్తం వుందని, దీనిని భారత్లో ఉగ్రవాదం పెం చేందుకు కృషి చేస్తున్న ఉగ్రమూకలకు అందిస్తోందని నిర్ధారణకు వచ్చాయి. గుజరాత్లో పట్టుబడ్డ 182 కోట్ల రూపాయల జిహాదీ డ్రగ్ ఇలాగే పాక్ నుంచి స్మగ్లింగ్ అయ్యిందని నిఘా వర్గాలు తేల్చాయి. జిహాదీ డ్రగ్ అంటే ఏమిటనేది చాలా మందికి ఇప్పటికీ తెలియదు. క్యాప్టగన్ పేరిట తయారయ్యే సింథటిక్ డ్రగ్నే జిహాదీ డ్రగ్గా పిలుస్తారు. పేదవాడి కొకైన్గా కూడా దీనిని పిలుస్తారు. చిన్నపాటి మాత్రల రూపంలో వుండే ఈడ్రగ్ అతి తక్కువ ధరకు అంటే 30 రూపాయలకే ప్యాకెట్ (ఒక ప్యాకెట్లో పది వరకు మాత్రలు వుంటాయి) లభిస్తుండడం విశేషం. గతంలో సిరియా అంతర్యుద్ధంలో దీనిని ఐసిస్ ఉగ్రవాదులు ఎక్కువగా వాడేవారు. ఈ డ్రగ్ను తీసుకుంటే ఎక్కువ గంటలు నిద్ర లేకుండా, భయం, అ లసట లేకుండా పనిచేసేందుకు వీలుంటుందని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు చెబుతున్నారు. 1960లో దీనిని దృష్టి లోపం, నార్కో లెప్సీ వున్న రోగులకు చికిత్సలో భాగంగా కొద్ది మొత్తంలో వాడేవారు. ఒక రకంగా చెప్పాలంటే ఇది మత్తు మందులా పనిచేస్తుంది. సింథటిక్ డ్రగ్ అయిన దీనిని అనేక దేశాలు నిషేధించాయి. ఈ డ్రగ్లో యాంపెటమైన్, మెతాంఫెటమైన్తో పాటు కెటమైన్ డ్రగ్స్ లోని కొన్ని రసాయనా లను కలుపుతారు. ఈ మూడు రకాల డ్రగ్స్ తయారీలో వాడే ఔషధాలలో మిగిలిపోయిన వ్యర్థాలు క్యాప్టగన్ తయారీలో ఎక్కువగా వాడుతుం డడం వల్ల దీని ధర చవకగా వుంటుంది. ఇక క్యాప్టగన్ డ్రగ్ వాడడం వల్ల కొద్దిసేపు ఉత్సాహంగా, ఉల్లాసంగా వున్నప్పటికీ దీర్ఘకాలంలో తీవ్ర మైన మానసిక రుగ్మతలు తలెత్తి అది హింసాత్మక ప్రవర్తన వంటి దుష్పరిణామాలకు దారితీసే వీలుంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్ర స్తుతం ఈ డ్రగ్ను ఉగ్రవాదులు కొన్ని ఫార్మా కంపెనీల నుంచి వీటిని కొనుగోలు చేస్తున్నట్లు నిఘా వర్గాలు భావిస్తున్నాయి. భారత్లో ఉగ్రవా దులు దీనిని ఇప్పటి వరకు వాటినట్లు దాఖలాలు లేవు.

## 104 సంచార వైద్య వాహనాల్లో 41 రకాల ఉచిత సేవలు

**విజయవాడ, మే 17 ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామీణ ప్రాంత రోగులకు 104 సంచార వైద్యసేవలను మరింత సమర్థంగా అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. 104 సంచార వైద్య వాహనాలకు కొత్త రూపు ఇచ్చి 41 రకాల మెడికల్ టెస్ట్లు ఉచితంగా చేసేలా ఏర్పాట్లు చేస్తోందిఇందులో భాగంగానే పల్లె ముంగిటకు వైద్య పరీక్షలు చేరువ చేసి, వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఏటా 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రూ.162.72 కోట్లు వెచ్చించనుంది. ఈ ల్యాబ్ డయాగ్నస్టిక్ సేవలను పల్నాడు, కృష్ణా జిల్లాల్లో ప్రయోగాత్మకంగా నిర్వహించా రు. ఇవి సత్ఫలితాలు ఇవ్వడంతో చిత్తూరు జిల్లా కుప్పంలో అమల్లోకి తెచ్చారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈ సేవలు అందు బాటులోకి తెస్తారు. ఆంధ్రప్రదేశ్లో 104 మొబైల్ మెడికల్ యూనిట్లు (ఎంఎంయూ) 936 ఉన్నాయి. వీటిలో 904 వాహనాలు క్షేత్రస్థాయి లో వినియోగించనున్నారు. మిగిలిన 32ను అత్యవసర పరిస్థితుల్లో తిప్పేందుకు సిద్ధంగా ఉంచారు. వీటిని కొత్త హంగులతో అందుబాటు లోకి తెస్తారు. ఇప్పటికే ఆరోగ్య రథం పేరుతో కొన్ని వాహనాలు నమూనాగా సిద్ధం చేశారు. పేషెంట్ల ఆరోగ్యం నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుగా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు నిర్వహించనుంది. ఇటీవలే వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు పరిపాలన ఆమోదం, నిర్వహణ మార్గదర్శకాలు జారీకి కేబినెట్ అనుమతిచ్చింది. దీంతో ప్రాజెక్టు అమలుకు




మార్గం సుగమైంది. ఒక్కో 104 వాహనంలో 41 రకాల టెస్ట్లు చేస్తారు. 80 రకాల మందులు అందుబాటులో ఉంచుతారు. సంపూర్ణ రక్త పరీక్ష (సిబిపి)కి సంబంధించిన 22 పరీక్షలు, బయో కెమిస్ట్రీకి సంబంధించిన 19 పరీక్షలు అందుబాటులోకి తెస్తారు. కొత్త విధానంలో ఒక మొబైల్ మెడికల్ యూనిట్ (ఎంఎంయూ) రోజుకు 20 నమూనాలు సేకరించాలి. వైద్య బృందంతోపాటు, ల్యాబ్ టెక్నీషియన్లను పంపి ఇళ్ల దగ్గరే వైద్య పరీక్షలు చేస్తారు. అక్కడే నమూనాలు సేకరించి పరీక్షించి సాయంత్రానికి ఫలితాలను మొబైల్ ద్వారా రోగులకు అందిస్తారు. అంతేకాక ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతాలు తెరుస్తారు. వారి ఆరోగ్య స్థితిని ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు నిర్వహణ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తారు.

## చర్లపల్లి-తిరుచానూరు (తిరుపతి) మధ్య వీక్లీ ఎక్స్ప్రెస్ ప్రారంభం

### కేంద్రమంత్రి జి. కిషన్రెడ్డి

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణికులకు, ముఖ్యంగా కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి వెళ్లే భక్తులకు కేంద్ర ప్రభుత్వం మరో అద్భుతమైన తీపి కబురు అందించింది. కేంద్ర మంత్రి జి. కిషన్రెడ్డి చొరవతో చర్లపల్లి – తిరుచా నూరు మధ్య వీక్లీ ఎక్స్ప్రెస్ రైలుకు రైల్వే మంత్రిత్వ శాఖ అధికారికంగా ఆమోదం తెలిపింది. ప్రయాణికుల రద్దీ, డిమాండ్ను దృష్టిలో ఉంచుకుని ఈ రైలును మంజూరు చేసింది. ఈ రైలు మంజూరు చేసినందుకు రైల్వే శాఖ మంత్రికి, దక్షిణ మధ్య రైల్వే అధికారులకు కేంద్ర మంత్రి కిషన్రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నూతన వీక్లీ ఎక్స్ప్రెస్ సర్వీసులు ఆదివారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి.

**రైలు ప్రయాణ వివరాలు**

ట్రైన్ నెంబర్ 17059 (చర్లపల్లి – తిరుచానూరు): ప్రతి ఆదివారం రాత్రి 21:30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి, మరుసటి రోజు (సోమవారం) మధ్యాహ్నం 12:30 గంటలకు తిరుచానూరు చేరుకుంటుంది. ట్రైన్ నెంబర్ 17060 (తిరుచానూరు చర్లపల్లి): తిరుగు ప్రయాణంలో ప్రతి సోమవారం సాయంత్రం 16:00 గంటలకు తిరుచానూరులో బయలుదేరి, మరుసటి రోజు (మంగళవారం) ఉదయం 08:00 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. రైలు ఆగే ప్రధాన కేంద్రాలు ఈ రైలు తన ప్రయాణంలో చర్లపల్లిలో ప్రారంభమై మల్కాజ్గిరి, కాచిగూడ, షాద్నగర్, మహబూబ్నగర్, వనపర్తి రోడ్, గద్వాల, కర్నూలు సిటీ మీదుగా డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట జంక్షన్ స్టేషన్లలో ఆగుతూ ప్రయాణికులను గమ్య స్థానాలకు చేరవేస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం మరియు సుదీర్ఘ ప్రయా ణాన్ని సుఖమయం చేయడం కోసం ఈ రైలులో సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలతో కలిపి మొత్తం 20 అత్యాధునిక కోచ్లను ఏర్పాటు చేయడం జరిగింది. హైదరాబాద్ శివార్లలో కొత్తగా అభి వృద్ధి చెందిన చర్లపల్లి టెర్మినల్, సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు, ఈ రైలు ప్రయాణించే తెలంగాణ మరియు రాయలసీమ జిల్లాల ప్రయాణికులకు ఈ సర్వీసు ఎంతో అనుకూలంగా మారనుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ నూతన రెగ్యులర్ రైలు సౌకర్యాన్ని ప్రయాణికులు, భక్తులు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ సందర్భంగా కోరారు.

## సోషల్ మీడియాలో వైసిపిదంతా దుష్ప్రచారం

● టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

**విజయవాడ, మే 17 ప్రభాతవార్త ప్రతినిధి:** తాడేపల్లి ప్యాలెస్లో ప్రెస్ మీట్లు వదిలేసి వైసిపి నేతలు ట్విట్టర్ బాట పట్టారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. ప్రజలను తప్పుదోవ పట్టించి అబద్ధాలు, అసత్యాలు వండివారుస్తున్నారని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి ప్యాలెస్, ట్విట్టర్లో పిచ్చి ప్రేలాపనలు కట్టిపెట్టి మీడియా ముందుకు వచ్చి మాట్లాడాలంటూ ఎద్దేవా చేసారు. ఆదివారం అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో వినేని ఉమా మాట్లాడుతూ గత ఐదేళ్లు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఐసియులో పెట్టిందని వైసిపిపై నిప్పులు చెరిగారు. 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులతోపాటు 24 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా డబుల్ ఇంజన్ సర్కార్ కూటమి ప్రభుత్వం పరిగెడుతోందని వివరించారు. ఎపికి ప్రతిష్టాత్మక కంపెనీలు వస్తుంటే.. వాస్తవాలు ఒప్పుకునే పరిస్థితిలో వైసిపి లేదని వ్యంగ్యంగా అన్నారు. పోలవరం, ప్రజా రాజధాని అమరావతి పనులపై విషం చిమ్ముతున్నారంటూ వైసిపి నేతల తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. భోగాపురానికి ఎర్రబస్సు రాదన్నారు.. నేడు ఎయిర్ బస్సులు దిగబోతున్నాయని పేర్కొన్నారు. 8.8 కోట్ల మంది పేదల ఆకలిని అన్న క్యాంటీన్లు తీర్చాయని దేవినేని ఉమా గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వేల కిలోమీటర్ల రోడ్లు వేస్తుంటే.. ఐదేళ్ల రహదార్లపై గుంతలు పూడ్చలేని మీరు రోడ్ల గురించి మాట్లాడతారా? అంటూ వైసిపి నేతలను మాజీ మంత్రి దేవినేని ఉమా సూటిగా ప్రశ్నించారు.



## డి.సిఎం పవన్తో నటుడు తనీష్ భేటి

**విజయవాడ, మే 17 ప్రభాతవార్త ప్రతినిధి:** టాలీవుడ్ నటుడు తనీష్ అల్లాడి, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. పార్టీలో చురుకుగా పనిచేస్తున్న తనీష్, జనసేన సాధక్ సమావేశంలో పాల్గొనేందుకు మంగళగిరి వచ్చినట్లు సమాచారం. గత కొంతకాలంగా తెలంగాణ జనసేన విభాగంలో తనీష్ చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఈ క్రమంలోనే పవన్ కల్యాణ్తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భేటీ అనంతరం తనీష్ తన సోషల్ మీడియా ఖాతాలో భావోద్వేగ పోస్ట్ పెట్టారు. పవన్ను కలవడంపై ఆనందం వ్యక్తం చేస్తూ, "ఏం కావాలి ఇంతకన్నా, చాలు ఈ జన్మకి. కట్టే కాలేంత వరకు మీతోనే కల్యాణ్ సర" అని పేర్కొన్నారు. సినిమా పరిశ్రమలో 27 ఏళ్లుగా ఉన్నప్పటికీ, పవన్ కల్యాణ్ను వ్యక్తిగతంగా కలవడం ఇదే మొదటిసారని తనీష్ తన పోస్టులో పేర్కొన్నారు. "ఆయన్ను చూడగానే కొన్ని క్షణాలు మాటలు రాలేదు. ఈ భేటీ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. "మనం కలిసి పనిచేద్దాం అని పవన్ నాతో అన్న ఒక్క మాట చాలు" అని తనీష్ తన ఆనందాన్ని పంచుకున్నారు. పవన్ కల్యాణ్ నిజాయితీ, సిద్ధాంతాలకు ఆకర్షితుడనై గత ఏడాది నుంచి తెలంగాణలో జనసేన పార్టీ కోసం పనిచేస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా తనకు ప్రోత్సాహం అందిస్తున్న జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, నిర్మాత రామ్ తాళ్లూరికి కూడా తనీష్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రజల శ్రేయస్సు కోసం జనసేన తరఫున నిరంతరం పనిచేస్తూనే ఉంటానని ఆయన స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్తో దిగిన ఫొటోలను కూడా తనీష్ తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

## హైదరాబాద్ పంజాగుట్టలో ప్రభుత్వ ఉద్యోగి హనీట్రాప్

### లక్షలు దండుకున్న మహిళ... కేసు నమోదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 17, ప్రభాతవార్త:** హనీట్రాప్ చేసిన ఒక మహిళ బ్లాక్మెయిల్కు పాల్పడి పౌర సరఫరాల విభాగంలో జూనియర్ అసిస్టెంట్గా పనిచేసే ఉద్యోగి నుంచి లక్షల రూపాయలు వసూలుకు పాల్పడిన ఘటన పంజాగుట్ట ఠాణాలో చోటుచేసు కొంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. బాలానగర్ గాంధీనగర్కు చెందిన టి. సాయికిరణ్(29) ఖైరతాబాద్ సివిల్ సప్లైస్ విభాగంలో జూనియర్ అసి స్టెంట్గా పనిచేస్తున్నాడు. 2022 జూన్ 24న ఓ మహిళ రేషన్కార్డులో తన కుమారుడి పేరు చేర్పించా లంటూ కార్యాలయానికి వచ్చింది. నెట్ వర్క్ సమస్య కారణంగా మరుసటిరోజు రావాలని చెప్పగా, ఆమె తన పేరు లక్ష్మి ... అని, సైదాబాద్లో ఉంటానని చెబుతూ సాయికిరణ్ ఫోన్ నంబర్ తీసుకొని వెళ్లింది. ఆ తర్వాత వాట్సాప్ ద్వారా పరిచయం పెంచుకుని తరచూ ఫోన్లో మాట్లాడటం ప్రారంభించింది.

సాయి కిరణ్కు సంబంధించిన వ్యక్తిగత విషయాలు తెలుసుకున్న ఆమె, తన భర్త బయట ప్రాంతంలో డ్రైవింగ్ పనిచేస్తున్నాడని చెప్పి అతనికి దగ్గరైంది. పార్కులు, రెస్టారెంట్లు, అనంతరం ఓయో హోటళ్లకు తీసుకెళ్లింది. ఆ సమ యంలో అతనికి తెలియకుండా ఏకాంతంగా ఉన్న సమయంలోని ఫొటోలు తీసి హోటల్ రసీదులు సేకరించింది. దగ్గర పెట్టుకొంది. అనంతరం వాటిని చూపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని, ఉద్యోగం పోగొడతానని, కుటుంబసభ్యులకు విషయం చెబుతా నని బెదరిస్తూ డబ్బులు డిమాండ్ చేయడం ప్రారంభించింది. భయంతో పలుమార్లు నగదు, ఫోన్పే ద్వారా డబ్బులు చెల్లించినప్పటికీ వేధింపులు ఆగలేదు. మానసిక ఒత్తిడికి గురై 2023 డిసెంబరు 3న ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. విషయాన్ని తెలుసుకున్న సాయికిరణ్ తల్లి లక్ష్మిని ప్రశ్నించగా, రూ.50 వేలివ్వకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించింది. దీంతో రూ.50 వేలు ఆన్లైన్లో పంపినప్పటికీ వేధింపులు కొనసాగడంతో 2024 మార్చి 31న తన తల్లితో కలిసి సైదాబాద్లోని ఆమె ఇంటికి వెళ్లగా, అక్కడ దుర్భాషలాడి సైదా బాద్ పోలీస్స్టేషన్కు వెళ్లి, పోలీస్స్టేషన్ బయట రూ.2.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. భయంతో రూ.2.25 లక్షలు నగదు, రూ.25 వేలు ఫోన్పే ద్వారా సాయికిరణ్ చెల్లించాడు. ఈ నెల 13న పంజాగుట్ట ఎక్స్ రోడ్ వద్ద మరోసారి డబ్బులు డిమాండ్ చేస్తూ పరువు తీస్తానని బెదరించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సాయికిరణ్ కుటుంబసభ్యుల సూచన మేరకు పోలీసులను ఆశ్ర యించాడు. ఆయన ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు బీఎన్ఎస్ చట్టంలోని 308(2), 308(4), 318(4), 351(2), 79, 296 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్

### విద్యుత్ కొరత, ఇంధన ఆదాపై దృష్టి... పరిశీలిస్తున్న తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త :** ఇంధన ఆదా, విద్యుత్ కొరత, పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అవలంబించే దిశగా రాష్ట్ర ప్రభుత్వ చర్యలు తీసుకుంటు న్నట్లు సమాచారం. ఇప్పటికే వర్క్ ఫ్రమ్ హోమ్ను కొనసా గించాలని, ట్రాఫిక్ సమస్యలను నివారించాలని ఉద్యోగుల సంఘాలు కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ దేశాలతో పాటు భారత్లోనూ చమురు, గ్యాస్ సరఫరాలో కొరత ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చమురు కంపెనీలు పెట్రోల్ బంకులకు సరఫరా చేసే పెట్రోల్, డీజిల్ నిబంధనలు మార్చడంతో చాలా రాష్ట్రాల్లో ఇబ్బందులు మొదల య్యాయి. తెలంగాణ రాజధాని హైదరాబాద్లోనూ పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రంగా వేదిస్తోంది. బంకుల వద్ద వాహనదారులు పెట్రోల్, డీజిల్ కోసం గంటల తరబడి బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొంది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత తీవ్ర మవుతున్న నేపథ్యంలో వర్క్ ఫ్రమ్ హోం డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా లాక్డౌన్ విధించింది. ఈ సమయంలో ఉద్యోగులకు కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇచ్చాయి. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ కొరత నేపథ్యంలో రవాణా వ్యవస్థ స్తంభించి పోతోంది. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు వర్క్ ఫ్రమ్ హోం ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తోంది. వర్క్ ఫ్రమ్ హోం విధానం వల్ల పెట్రోల్, డీజిల్ కొరతతో ఎదురవుతున్న ఇబ్బందుల నుంచి బయటపడంతోపాటు ఎండల నుంచి రక్షణ పొందొచ్చని, మరోవైపు ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టొచ్చని, పొల్యూషన్ తగ్గుతుందని ఉద్యోగ సంఘాలు సూచిస్తున్నాయి. ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వర్క్ ఫ్రమ్ హోం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్న డిమాండ్ ఉద్యోగుల నుండి బలంగా వినిపిస్తోంది.

# అంపశయ్య నుంచి అభివృద్ధి పథంలోకి

## ఎపిలో చేనేత ఉత్పత్తుల 5శాతం జిఎస్టీ రీయింబర్స్‌మెంట్

## నేతన్నల్లో ఆత్మవిశ్వాసం నింపిన ప్రభుత్వం: మంత్రి సవిత



**విజయవాడ,మే 17,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం రాకతో నిస్తేజంలో కూరుకుపోయిన నేతన్నకు భరోసానిచ్చిందని ఏపీ చేనేత,జౌళి మంత్రి ఎస్.సవిత తెలిపారు.గత రెండేళ్ల కాలంలో చేనేత రంగ అభివృద్ధికి, నేతన్నల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి వివరిస్తూ మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేసారు.అంపశయ్యపై ఉన్న చేనేత పరిశ్రమ అభివృద్ధి పథంలోకి పయనించసాగింది. ఒకవైపు నూతన టెక్స్ టైల్స్ పాలసీ, మరోవైపు వ్యక్తిగత లబ్ధి పొందేలా పథకాల అమలు, ఇంకోవైపు చేనేత సహకార సంఘాల బలోపేతానికి చర్యలతో డీలా పడిన చేనేత రంగానికి కూటమి ప్రభుత్వం జవసత్వాలు నింపిందన్నారు. 2024లో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం చేనేతలకు అండగా నిలిచింది. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 92,724 మంది నేతన్నలకు రూ.3 వేల నుంచి రూ. 4 వేలకు పెన్షన్ పెంచారు. చేనేతలకు త్రిఫ్ట్ కింద ప్రభుత్వ వాటాను 8 నుంచి 16 శాతానికి పెంచారు. ఈ పథకం కింద 2024- 25లో రూ.5 కోట్లు, 2025-26లోనూ మరో రూ.5 కోట్లు కేటాయించారు. త్రిఫ్ట్ పథకం ద్వారా 5,726 మందికి లబ్ధి కలిగింది. రెండేళ్లలో రూ.65.35 కోట్ల మేర ముద్ర రుణాలను 6,808 మందికి అందజేశారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం (ఎన్.హెచ్.డి.పి)పథకం ద్వారా చిన్న క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాలకు రూ.10.44 కోట్లను వెచ్చించగా, 7,500 మంది చేనేతలకు లబ్ధి కలిగింది. రూ.175 కోట్లతో ముడి పదార్థాల సరఫరా పథకం ద్వారా నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ అందజేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా చేనేత ఉత్పత్తుల 5 శాతం జీఎస్టీ రియింబర్స్ మెంట్ ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న చేనేత మహిళలకు రూ.10 వేలు విలువ చేసే నూలును అందజేస్తున్నారు. 2024 ఏప్రిల్ నుంచి 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు రూ.78.73 కోట్ల నగదు పరపతి సౌకర్యం కల్పించారు. ఆధునిక పనిముట్ల కొనుగోలుకు 90 శాతం వరకు సబ్సిడీతో పాటు క్యాష్ క్రెడిట్ పథకం కింద సహకార సంఘాలకు బ్యాంకు రుణాలు అందజేస్తున్నారు.

**నేతన్నల కుటుంబాల్లో ఉచిత వెలుగులు**

గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు స్వయంగా నేతన్నల కష్టాలను తెలుసుకుని, ఉచిత విద్యుత్ అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు, మరమగ్గం నేతన్నలకు 500 యూనిట్ల విద్యుత్ ను ఉచితంగా అందిస్తున్నారు. ఇందుకోసం ఏడాదికి రూ.150 కోట్లను చంద్రబాబు ప్రభుత్వం వెచ్చిస్తోంది. సుమారు 1.04 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి కలుగనుంది. పథకం ద్వారా ఏడాదికి మగ్గం నేతన్నలకు రూ.8,640లు, మర మగ్గం నేతన్నలకు రూ.21,600లు ఆదా అవుతోంది. చేనేతలకు 365 రోజులూ పని కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నూతన టెక్స్ టైల్స్ పాలసీని అమలు చేసి, ఈ పాలసీ ద్వారా చేనేత రంగంలో రూ.10,000 కోట్ల పెట్టుబడుల సేకరించాలని, 1.51 లక్షల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనిలో భాగంగా జాతీయ హ్యాండ్‌లూమ్ అభివృద్ధి ప్రోగ్రామ్ కింద 10 క్లస్టర్లు ఏర్పాటు చేసింది. రాయదుర్గం, హిందూపురం, బ్రాండెక్స్ టెక్స్ టైల్స్ పార్కుల అభివృద్ధితో పాటు ఎమ్మిగనూరు టెక్స్ టైల్స్ పార్క్ కూడా నిర్మించనుంది. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌ను రూ.38.31 కోట్లతో ఏర్పాటు చేయనుంది. మంగళగిరిలో చేనేత పార్క్ ఏర్పాటు చేయనుంది. పిఠాపురంలో మౌలిక సదుపాయాల కల్పనకు స్పెషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ ను ప్రారంభించనున్నారు. 9,120 మంది చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూర్చేలా రూ.15.11 కోట్లతో ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు. రూ.172 కోట్లతో విశాఖపట్నంలోని మధురవాడలో యూనిటీ మాల్‌ను నిర్మిస్తున్నారు. అమరావతిలో శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. గడచిన రెండేళ్ల కాలంలో చేనేత రంగానికి ఊపిరి పోసేలా కూటమి ప్రభుత్వం చాలా చర్యలు తీసుకుందని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు.

## భోజ్‌శాల తీర్పుపై మాజీ సిఎం అభ్యంతరం



**భోపాల్, మే 17:** మధ్యప్రదేశ్ ధార్ నగరంలో ఉన్న భోజ్‌శాల ఒక ఆలయం అంటూ ఆ రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ద్వారా దశాబ్ధాలుగా కొనసాగుతున్న భోజ్‌శాలకమల్ మౌలా మసీదు వివాదానికి తెరపడింది. ఇది ఒక సరస్వతీ ఆలయం అని, దీనికి ఆధారంగా శాస్త్రీయ ఆధారాలను, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) రిపోర్టును కోర్టు ప్రస్తావించింది. ఈ తీర్పుతో హిందువులకు ఆలయంలో పూజ చేసుకునే హక్కు సంక్రమించింది. ఇదిలా ఉంటే, తీర్పుపై కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్ ప్రశ్నించారు. ఆ ప్రదేశంలో ఎలాంటి ఆలయ ఆనవాళ్లు లభించలేదని ఏఎస్ఐ పేర్కొన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏఎస్ఐ సంరక్షణలో ఉన్న ఈ చారిత్రక కట్టడం పూజా స్థలం కాదు అని చెప్పారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు అస్పష్టంగా ఉందని అన్నారు. దీనికి విరుద్ధంగా, భోజ్ ఉత్సవ్ సమితి సభ్యుడైన అశోక్ కుమార్ జైన్, భోజ్‌శాలకమల్ మౌలా సముదాయాన్ని దేవాలయంగా ప్రకటించిన మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పును స్వాగతించారు. కోర్టు నిర్ణయం తమ సుదీర్ఘ పోరాటానికి నిదర్శనమని అన్నారు. దిగ్విజయ్ సింగ్ సీఎంగా ఉన్న సమయంలోనే ఈ ప్రదేశంలో హిందువులు పూజలు చేయకుండా ఆంక్షలు విధించారని ఆరోపించారు. తమపై ఆంక్షలు విధించి, ముస్లింలు నమాజ్ చేసుకునే హక్కును ఇచ్చారని అన్నారు.

## బిశ్వబంగ్లా లోగో స్థానంలో అశోకచిహ్నం

### టిఎంసి కార్యాలయంలో వందలాది ఆధార్ కార్డులు



**కోల్‌కత్తా, మే 17:** పశ్చిమబెంగాల్‌లోని బీజేపీ ప్రభుత్వం అధికారిక వేదికల నుంచి బిశ్వ బంగ్లా లోగోను తొలగించడం ప్రారంభించింది. మాజీ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ హయాంలో ప్రవేశపెట్టిన ఈ లోగో స్థానంలో భారత జాతీయ చిహ్నమైన అశోక చిహ్నాన్ని ఏర్పాటు చేస్తోంది. కోల్‌కతా లోని ప్రముఖ సాల్ట్ లేక్ స్టేడియం వద్ద బిశ్వ బంగ్లా బోర్డును తొలగించి అశోక చిహ్నాన్ని పెట్టారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో కూడా ఈ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ విభాగాలు, సేవలను అనుసంధానించే 'ఎగియే బంగ్లా' పోర్టల్‌లో కూడా అశోక చిహ్నాన్ని ఉంచారు. గతంలో ఉన్న తెలుపు, నీలం రంగుల థీమ్‌ను మార్చి కాషాయ రంగును చేర్చారు. బెంగాలీ అక్షరం బ ఆధారంగా రూపొందించిన ఈ బ్రాండ్ 2013 సెప్టెంబర్ 16న ప్రారంభమైంది. బెంగాల్ సంస్కృతి, పర్యాటకం, హస్తకళలకు ప్రతీకగా తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని విస్తృతంగా వాడింది. ప్రస్తుతం అప్‌డేట్ చేసిన పోర్టల్‌లో అశోక చిహ్నంతోపాటు ముఖ్యమంత్రి సువేందు అధికారి ఫొటోను పెట్టారు. పర్యాటకం, పరిశ్రమలు, వ్యవసాయ శాఖల ఐకాన్‌లను కాషాయ రంగు గ్రాఫిక్స్‌తో రీడిజైన్ చేశారు. ఒక వ్యక్తి రూపొందించిన లోగో రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ముద్రగా ఉండకూడదంటూ బీజేపీ నేతలు ఈ నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నారు.

**టిఎంసి కార్యాలయంలో వందలాదిగా ఆధార్ కార్డులు:** మమతా సర్కార్‌లో జరిగిన అక్రమాలంటూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినవెంటనే కార్యాచరణ షురూచేసింది. కొత్తగా టీఎంసీ కార్యాలయంలో వందలాది ఆధార్ కార్డులులభించడం ఇప్పుడు సంచలనంగా మారింది. కోల్‌కతాలోని సాల్ట్ లేక్ టీఎంసీ కార్యాలయం నుంచి ఈ ఆధార్ కార్డులతో పాటు కీలక డాక్యుమెంట్లను స్థానికులు స్వాధీనం చేసుకున్నారు. పెద్ద సంఖ్యలో ఆధార్ కార్డులు బయటపడటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. టీఎంసీ కార్యాలయంలో లభించిన ఆధార్ కార్డులు తమవే అని స్థానికులు చెబు తున్నారు. ఆధార్ కార్డులు చేయించుకునే సమయంలో టీఎంసీ ఆఫీస్ అడ్రస్ ఇచ్చే వాళ్లమని వెల్లడించారు.

ఆధార్‌కార్డులు అడిగినప్పుడు టీఎంసీ కార్యకర్తలు ఇంకా రాలేదని చెబుతుండేవారని తెలిపారు. మే4వ తేదీన స్థానిక నివాసితులు పార్టీ కార్యాలయానికి తాళాలు వేశారు. తాజాగా ఆఫీస్‌ను ఓపెన్ చేసిన చూడగా ఆధార్ కార్డులు లభ్యమయ్యాయి. టీఎంసీ కార్యాలయంలో ఇంత పెద్దసంఖ్యలో ఆధార్ కార్డులు బయటపడటం స్థానికంగా సంచలనంగా మారింది. ఇదేకాకుండా ప్రభుత్వ భూముల కొనుగోలు, అమ్మకాలకు సంబంధించి పత్రాలను కూడా బయటపడ్డాయి.

## అడిగింది రూ.85,677 కోట్లు ఇచ్చింది రూ.28,065 కోట్లు

### రాష్ట్రానికి తీరని అన్యాయం

### కేంద్ర నిధులపై తప్పిన సర్కార్ అంచనాలు

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** కేంద్ర నిధులపై రాష్ట్ర సర్కార్ పెట్టుకున్న భారీ అంచనాలు తప్పుతున్నాయి. అడిగిన నిధుల్లో పెద్ద మొత్తంలో కోత పెట్టి ప్రభుత్వ ఆశలపై నీళ్ల చల్లుతోంది. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం స్వంత ఆదాయం పైనే ఎక్కువగా ఆధారపడక తప్పడం లేదు. ఖర్చులకు తగిన ఆదాయం రాకపోవడంతో అప్పులపైనే ఎక్కువగా ఆధారపడాల్సిన అనివార్య పరిస్థితి తెలంగాణ ప్రభుత్వానికి ఏర్పడింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరం నుంచి 2026 మార్చి 31 వరకు ఈ మూడేళ్లలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ. 85,677.82 కోట్లు కేంద్రాన్ని అడిగింది. అయితే కేంద్రం మాత్రం ఇచ్చింది రూ.28,065.97 కోట్లు మాత్రమేననేది ఆర్థిక శాఖ లెక్కలు వెల్లడిస్తున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.41,259.17 కోట్ల మేర నిధులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించగా, ఆ ఏడాది ఇందులో కేవలం 23.58శాతం మేర 9,729.91 కోట్లను విడుదల చేసింది. అలాగే 2024-25లో రూ.21,636.15 కోట్లకు అంచనాలు సమర్పించగా,ఇందులో 36.57 శాతం చొప్పున రూ.7,913.08 కోట్ల మేర నిధులను విడుదల చేసింది. ఇక ఈ ఏడాది మార్చి నెలతో ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర నిధులు రూ.22,782.50 కోట్ల అంచనాలతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపగా, ఇందులో 45.75 శాతం మేర రూ.10,422.98 కోట్లను రాష్ట్రానికి విడుదల చేసింది. కాగా రాష్ట్ర ఆదాయాలు, ఖర్చుల మధ్య లోటు భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఇస్తుంది. ముఖ్యంగా ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, ఆరోగ్యం, విద్య, రైతు సంక్షేమ పథకాల అమలుకు లోటును పూడ్చటానికి వీటిని ఉద్దేశిస్తుంది. అలాగే ప్రాంతీయ అసమానతలు తగ్గించడానికి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక గ్రాంట్లు కూడా ఇస్తుంది. మరో వైపు కేంద్ర ప్రభుత్వ పథకాలైన జల్ జీవన్ మిషన్, పీఎం ఏవై, ఎన్‌హెచ్ఎం, విద్యా పథకాలకు సహాయం చేస్తుంది. వరదలు, కరువు, తుఫాన్లు, భూకంపాల వటి సందర్భాల్లోనూ ప్రత్యేక గ్రాంట్లు ఇస్తుంది. ఆదివాసీ ప్రాంతాల వృద్ధి, రాష్ట్రాల ప్రత్యేక అవసరాలు, ఆర్థికంగా బలహీన రాష్ట్రాల కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 275 ప్రకారం గ్రాంట్స్ ఇస్తారు. ముఖ్యంగా ఇలా ఇచ్చే గ్రాంట్లు ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు విడుదల చేయాలి. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆర్థిక సంఘం చేసిన సిఫారసులు, కేంద్రం ప్రకటించే ప్రాయోజిత పథకాలు, వాటికోసం రాష్ట్రానికి చేసిన కేటాయింపుల మేరకు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద కేంద్రం నుంచి వచ్చే ఆదాయాన్ని అంచనావేసి బడ్జెట్‌లో పొందుపరుస్తారు. అయితే ఆర్థిక సంఘం సిఫారసులు కూడా పట్టించుకోని కేంద్రం చిన్నచిన్న కారణాలు చూపి రాష్ట్రానికి గ్రాంట్స్ విడుదల చేయడం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాష్ట్రానికి ఆర్థిక సంఘం సిఫారసులతో పాటు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, విపత్తుల నిర్వహణ నిధి, పట్టణాభివృద్ధికి గ్రాంట్స్ రావాలి. కానీ యుటిలైజేషన్ సర్టిఫికెట్ సమయానికి ఇవ్వడం లేదన్న కారణం చూపి నిధులు విడుదల చేయడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది జనవరిలోనే ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.3 వేల కోట్లు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ కూడా రాసింది. అయినా దానిపై స్పందన మాత్రం కరువయింది. కేంద్రం ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు లోటును పూడ్చుకోవడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ఎపి మంత్రి కందుల దుర్గేష్

## ఎపిలో పర్యాటకం పరుగులు

### 1.22 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు

### ఎపి పర్యాటకానికి నీతి అయోగ్ కితాబు: మంత్రి దుర్గేష్

**విజయవాడ మే 17 ప్రభాతవార్త ప్రతినిధి:** పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయడం తోపాటు,టూరిజం రంగంతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధి జరిగేలా రోడ్ మ్యాప్ ఏర్పాటు చేసుకుని కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్ల కాలంలో పని చేసింది.ఈ మేరకు ఏపీ టూరిజం శాఖ మంత్రి ఒక ప్రకటన విడుదల చేసారు. రెండేళ్ళ పర్యాటక శాఖ సాధించిన ప్రగతిని కందుల దుర్గేష్ తన ప్రకటనలో వివరించారు. దేశంలో తొలిసారిగా టూరిజం ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ 2025 ను ప్రవేశపెట్టి పారదర్శక పద్ధతిలో భూ కేటాయింపులు చేస్తూ భారీ పెట్టుబడులకు మార్గం సుగమం చేశారు. అదేవిధంగా క్యారవాన్ టూరిజం, హోమ్‌స్టే, బిఅండ్‌బి విధానాల ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి కి చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రంలో 50000 క్లాసిఫైడ్ గదుల ఏర్పాటు, పెద్ద ఎత్తున పెట్టుబడులు, 10,000 హోమ్ స్టేలు, 20 శాతం జీవీ ఏ సాధన, 12 శాతం నుంచి 15 శాతం ఉద్యోగాల కల్పన తద్వారా 5 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పర్యాటక శాఖ ముందుకు సాగుతోంది. రెండేళ్ల కాలంలో రూ.20 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేందుకు వివిధ కంపెనీలు ముందుకు వచ్చాయి. అలాగే 117 ఎంఒయూలు కుదుర్చుకోగా, వీటి ద్వారా 1,22,637 మందికి ఉపాధి లభించనుంది. తాజ్,మారియట్, ఐటీసీ, హయత్, ఒబెరాయ్, మేఫెర్, హిల్టన్ వంటి 14 అంతర్జాతీయ బ్రాండ్లు రాష్ట్రంలో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటి ద్వారా కొత్తగా 7,770 హోటల్ గదులు అందుబాటులోకి రానున్నాయి. ఇక నదులపై తేలియాడే హౌస్ బోట్లను రాష్ట్ర పర్యాటకంలో ప్రవేశపెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 14 ప్రాంతాలలో దాదాపు 30 రకాల నితూత్న కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. త్వరలో మరో 21 ప్రాంతాలలో 100కు పైగా కొత్త పర్యాటక అంశాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. సాస్కి కింద అఖండ గోదావరి పునరుద్ధరణకు రూ.94.44 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రసాద్ స్కీమ్ కింద అన్నవరం దేవస్థానానికి రూ.25.32 కోట్లు, సింహాచలంకు రూ.54.04 కోట్లు, అదే విధంగా సీబీడీడీ క్రింద అహోబిలం స్పిరిచువల్ ఒడిస్సీ కి రూ.24.96 కోట్లు, నాగార్జున సాగర్ బౌద్ధ సర్క్యూట్‌కు రూ.25 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులన్నీ జులై 2026 నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి దుర్గేష్ తెలిపారు.

## హైదరాబాద్‌లో కొనసాగుతున్న డ్రంకన్‌డ్రైవ్ దాడులు

# 474 మంది మందు బాబుల పట్టివేత

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** జంట నగరాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రుల్లో ట్రాఫిక్ పోలీసులు పలు చోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌దాడుల్లో మొత్తం 474 మంది మందు బాబులు ప ట్టుబడ్డారు. వీరిలో 417 మంది ద్విచక్ర వాహనదారులు, 24 మంది ఆటో డ్రైవర్లు, 33 మంది కార్లతో పాటు భారీ వాహనాల డ్రైవర్లు వున్నా రు. పట్టుబడ్డ వారిలో 103 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 188 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 100 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 44 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 19 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, ఎనిమి ది మంది 251 నుంచి 300 పాయింట్ల వరకు, 12 మంది 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించినట్లు తేలింది. వీరిని అరెస్టు చేసి న తరువాత వారి వా హనాలు జప్తు చేసి, కేసులు నమోదు చేశాక సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరు వాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ మీడి యాకు తెలిపారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని, వీటిని పూర్తిస్థాయిలో అరికడతామని ఆయన వెల్లడి ంచారు.

**మల్కాజిగిరి పరిధిలో 318 మంది, సైబరాబాద్‌లో 283 మంది మందు బాబుల పట్టివేత**

ఇదిలావుండగా మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో 323 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 267 మంది ద్విచక్ర వాహనదారులు, 22 మంది ఆటో డ్రైవర్లు, 33 మంది కార్ల డ్రైవర్లు వున్నారు. కాగా సైబరాబాద్ పరిధిలో 300 మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 253 మంది ద్విచక్ర వాహనదారులు. తొమ్మిది మంది ఆటో డ్రైవర్లు, 38 మంది కార్ల డ్రైవర్లు, నలుగురు భారీ వాహనాల డ్రైవర్లు ఉన్నారు.

## నాయకత్వ మార్పిడిపై మళ్లీ కర్ణాటకలో పెరిగిన వేడి..



**బెంగళూరు, మే17 :** ఉధృతస్థాయిలో లాబీయింగ్, అంతర్గత ఒత్తిళ్ల మధ్య కేరళలో కొత్త ముఖ్యమంత్రి ఎంపిక కోసం కాంగ్రెస్ మల్లగుల్లాలు పడిన నేపథ్యంలో పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో గత కొంతకాలంగా మరుగున పడిన అధికార మార్పిడి సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది. గత నెలచివర్లో ఎన్నికలు జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంపై కాంగ్రెస్ నాయకత్వం తన దృష్టిని కేంద్రీకరించడంతో తాత్కాలికంగా పక్కనపెట్టిన కర్ణాటక కాంగ్రెస్‌లోని నాయకత్వ పోరు మరోసారి అంతర్గత చర్చల్లోకి తిరిగి వచ్చే అవకాశం ఉంది. నాయకత్వ మార్పు జరగవచ్చనే ఊహాగానాలు జోరుగా సాగడంతో పార్టీ రాష్ట్ర విభాగంలో రాజకీయ అనిశ్చితి తలెత్తింది. ఆ సమయంలో దీనిపై కచ్చితమైన పరిష్కారం తీసుకోకుండా కాంగ్రెస్ అధిష్ఠానం సంక్షోభాన్ని నిలువరించగలిగింది. ఇప్పుడు కేరళ సమస్య దాదాపు పరిష్కారం కావడంతో పార్టీలో దృష్టి తిరిగి కర్ణాటక వైపు మళ్లింది. రాష్ట్రంలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య రాజకీయ పోరు మరోసారి తీవ్రమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణతో సిద్ధరామయ్య పరిపాలన, శాసనసభా పక్షంపై తన పట్టును మరింత బలపరుచుకుంటే నాయకత్వ మార్పుపై శివకుమార్ ఆశలు బలహీనపడే చాన్స్ ఉంది. మంత్రి పదవులు ఆశిస్తున్న పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తున్న లాబీయింగ్ తీవ్రం కావడం పార్టీ అధిష్ఠానంపై మరింత ఒత్తిడిని పెంచుతున్నది. కర్ణాటక పీసీసీ కార్యాలయం బయట, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శివకుమార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేస్తూ వెలసిన పోస్టర్లు కొత్త ఊహాగానాలకు ఆజ్యం పోస్తున్నాయి. కొన్ని పోస్టర్లలో ఆయనను కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రిగా పేర్కొన్నారు. మైసూరులో శివకుమార్ మద్దతుదారులు ఆయనను తదుపరి ముఖ్యమంత్రిగా చిత్రీకరిస్తూ పుట్టినరోజు కేక్‌ను కూడా కట్ చేశారు.

# బిసిలకు రాజ్యాధికారం దిశగా అడుగులు

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్ రావు

**విజయవాడ, మే 17, ప్రభాతవార్త :** బిసిలకు రాజ్యాధికారం చేపట్టేదిశగా తాము కృషి చేస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు



విజయవాడలో జరిగిన బిసి సదస్సులో పాల్గొన్న నేతలు

జాజుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్ రావులు అన్నారు. బీసీ మేథో మదన సమావేశంలో వారు విజయవాడ బీసీ డిక్లరేషన్" పేరుతో 10 తీర్మానాలు ప్రకటించగా సభలోని వారు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల సర్వతోముఖాభివృద్ధికి తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధప్రతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. బిసిలకు రిజర్వేషన్ల కల్పనకు అడ్డంకిగా వున్న 50శాతం పరిమితిని వెంటనే తొలగించాలన్నారు. బీసీ జనాభాను లెక్కించి, దామాషా రిజర్వేషన్లు కల్పించాలని, జన గణనలో సమగ్ర కుల గణన చేపట్టిన తర్వాతే డీలి మినేషన్ చేపట్టాలని, మహిళా బిల్లులో బీసీ మహిళల ఉపకోట కల్పించాలని, కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ కల్పించి దామాషా పద్ధతిన బడ్జెట్ పెంచాలని, రాష్ట్రంలో కూటమి ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచి ఏబిసిడి వర్గీకరణ అమలు చేయాలని, నామినేటెడ్ పోస్టులు, అధికారిక పోస్టింగ్‌లు బీసీలకు జనాభా దామాషాలో ఇవ్వాలని, అమరావతిలో 100 ఎకరాలలో సావిత్రిబాయి పూలే స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని, సర్దార్ గౌతు లచ్చన్న, ప్రగాఢ కోటయ్యల పేరు మీద చారిత్రాత్మక ప్రదేశాలకు, జిల్లాలకు, నూతన విమానాశ్రయాలకు వారి పేరు పెట్టాలని, బీసీలపై విధించిన క్రిమిలేయర్ రద్దుచేసి, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు రిజర్వేషన్లు కల్పన చేపట్టాలి బీసీ రక్షణ చట్టాన్ని తక్షణమే అమల్లోకి తీసుకురావాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు చొరవ తీసుకొని తమ డిమాండ్లను నెరవేర్చటానికి కేంద్రంతో చర్చించి ఆమోదింపచేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ మేధావులు, ప్రొఫెసర్ లు, ఆంధ్ర రాష్ట్ర నలుమూలల నుండి బీసీ సామాజిక ఉద్యమకారులు, వివిధ కుల సంఘాల నేతలు, ఉద్యోగ సంఘాల నాయకులు బీసీ నేతలు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, వావిలాల సరళ దేవి, టీ బ్రహ్మానందం శర్మ, బీసీ రమేష్ గౌడ్, ఎం వి ఎస్ ఎస్ ఎన్ మూర్తి, కన్నా మాస్టర్, సోమరాజు, సంఘాల నేతలు పాల్గొన్నారు.

## తేజాస్ యుద్ధ విమానాల పంపిణీ మళ్లీ షురూ..



**న్యూఢిల్లీ, మే 17:** భారత రక్షణ రంగానికి సంబంధించి అత్యంత కీలకమైన అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. అమెరికా నుంచి ఇంజిన్ల సరఫరాలో జరిగిన జాప్యం, రకరకాల టెస్టింగ్‌ల వల్ల చాలా కాలంగా నిలిచిపోయిన తేజస్ ఎంకె1ఎ యుద్ధ విమానాల పంపిణీ మళ్లీ ప్రారంభం కానున్నది. ఆగస్టు లేదా సెప్టెంబర్ నాటికి ఈ అధునాతన ఫైటర్ జెట్లను భారత వైమానిక దళానికి అందించేందుకు ప్రభుత్వ రంగ విమాన తయారీ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సన్నద్ధమవుతోంది. ఈ ప్రాజెక్ట్ ఆలస్యం కావడం అనేది హెచ్ఎఎల్ పెట్టుబడిదారులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. గడువులు పదేపదే మారడంతో, ఈ విమానాలు అసలు అనుకున్న సమయానికి వస్తాయా లేదా అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. కొందరు విశ్లేషకులు ఆర్థిక సంవత్సరం 2027 తర్వాత కూడా ఈ ప్రాజెక్ట్ ఆలస్యం కావచ్చని అంచనా వేశారు. వీటన్నింటికీ తెరదించుతూ హెచ్ఎఎల్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ రవి కోట కీలక ప్రక్రియను వివరించారు. హెచ్ఎఎల్ ఇప్పటి వరకు ఆరు ఇంజిన్లను అందుకుందని, ఈ ఆర్థిక సంవత్సరంలో మరిన్ని ఇంజిన్లు రానున్నాయని ఆయన తెలిపారు. కొత్తగా వచ్చిన ఇంజిన్లను అమర్చిన తర్వాత కూడా విమానాలకు మరికొన్ని నూతన మెరుగులు, కఠినమైన పరీక్షలు జరుగుతున్నాయని, ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ చాలా సానుకూల దిశలో సాగుతోందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ కొత్త ఇంజిన్లతో కూడిన తేజస్ విమానాలు గాల్లో విజయవంతంగా ఎగురుతున్నాయని సంస్థ ధృవీకరించింది. ఆర్థిక సంవత్సరం 2026లో హిందూస్థాన్ ఏరోనాటిక్స్ కార్యకలాపాలద్వారా రూ.33,050కోట్ల ఆదాయాన్ని ఆర్జించి, గతేడాదితో పోలిస్తే 7 శాతం వృద్ధినినమోదు చేసింది. అలాగే కంపెనీ పన్నుకు ముందు లాభం 12 శాతం పెరిగి రూ. 12,112 కోట్లకు చేరింది.

## ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ ఆఫీసులో నల్లా ట్యాప్‌ల చోరీ

**రాయ్‌పూర్,మే 17:** ఛత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఓ దొంగతనం అందరినీ విస్తుపోయేలాచేస్తోంది. ఆఫీసులోని నల్లా ట్యాప్‌లు చోరీకి గురి కావడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపూర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో ఈ వింత చోరీ జరిగింది. ఆఫీసులోని బాత్రూంలలో ఏర్పాటు చేసిన 72 స్టీల్ నల్లా ట్యాప్‌లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఇప్పటికే ఈ ఆఫీసులో రెండు సార్లు దొంగతనాలు జరిగాయని ఇప్పుడు జరగడం ముచ్చటగా మూడోసారి అని కాంగ్రెస్ పార్టీ నేతలు చెప్పారు. అయితే అంబికాపూర్ నగరంలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతమైన గాంధీ చౌక్ సమీపంలోని రాజీవ్ భవన్‌లో ఉన్న కార్యాలయంలో ఈ వరుస దొంగతనాలు జరగడంపై ఆ పార్టీ నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇక ఆనీళ్ల ట్యాప్‌లను దొంగిలించిన తర్వాత దొంగలు బయటికి వెళ్లిపోయే ముందు ఐ లవ్ యూ అంబికాపూర్ అంటూ రాసివెళ్లడం గమనార్హం. ఈ ఘటనపై స్పందించిన కాంగ్రెస్ నేతలు అంబికాపూర్‌లో శాంతి భద్రతల పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయో ఈ 3 దొంగతనాలు వెల్లడిస్తున్నాయని అదే సమయంలో పోలీసులు, నగరంలో భద్రతా పరిస్థితులపైనా తీవ్ర విమర్శలు చేశారు. ఇక ఈ ఘటన జరిగిన తర్వాత ఆ పార్టీ ఆఫీసును పరిశీలించిన కాంగ్రెస్ నాయకుడు బాలకృష్ణపాఠక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రగ్స్,గంజాయికి బానిసైన వ్యక్తులు లేదా సంఘవ్యతిరేక శక్తులే ఈ చోరీలకు పాల్పడి ఉంటారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

## ప్రేయసితో విలాసవంతమైన డేట్‌నైట్.. మరో వివాదంలో కాశ్‌పటేల్

**వాషింగ్టన్, మే 17:** అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) డైరెక్టర్, భారత సంతతి నేత కాశ్‌పటేల్ చుట్టూ వివాదాలు ముసురుకొంటున్నాయి. వ్యక్తిగత ప్రయాణాలకు ప్రభుత్వ నిధులు వినియోగిస్తున్నారనే ఆరోపణలపై పటేల్ ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో గతేడాది తన ప్రియురాలితో కలిసి వెళ్లిన లగ్జరీ డేట్‌నైట్‌కు సంబంధించిన వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. ఆ పర్యటనకు కూడా పటేల్ ప్రభుత్వ నిధులు ఉపయోగించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మీడియా కథనాల ప్రకారం కాశ్‌పటేల్ తన ప్రేయసి అలెక్సిస్ విల్‌కిన్స్‌తో కలిసి గతేడాది మే 10న ఎఫ్‌బిఐకి చెందిన జెట్‌లో ఫిలడెల్ఫియాలో జరిగిన ఒక కాన్సర్ట్‌కు వెళ్లారు. అక్కడ 50వేల డాలర్ల (భారత కరెన్సీలో రూ.47 లక్షలకుపైగా) ఒక ప్రైవేట్ సూట్‌ను అద్దెకు తీసుకొని అందులోంచి కాన్సర్ట్‌ను వీక్షించారు. వారు ఆ కాన్సర్ట్ నుంచి వెళ్లే వరకు విమాన, భద్రతా సిబ్బంది రాత్రి 11 గంటల వరకు అక్కడే విధుల్లో ఉండాల్సి వచ్చింది. ఇందుకోసం వారు అదనపు జీతం కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ విషయాలు తీవ్ర చర్చకు దారి తీశాయి. కాగా.. ఆ లగ్జరీ సూట్‌కు డబ్బులు ఎవరు చెల్లించారనే విషయంపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందించేందుకు కాశ్‌పటేల్ నిరాకరించారు. ఇదిలా ఉండగా.. ఇటీవల పెర్ల్ హార్బర్‌లోని యుఎస్ఎస్ అరిజోనా స్మారక చిహ్నం (యుద్ధ సమాధి) సమీపంలో కాశ్ పటేల్ రహస్యంగా విఐపి స్నార్కెల్ జరపడంపై విమర్శలు వచ్చాయి. అయితే, స్నార్కెలింగ్



కార్యక్రమం ఒక అధికారిక పర్యటనలో భాగమని ఎఫ్ఐబి ప్రతినిధి ఒకరు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ముందు ప్రేయసి కాన్సర్ట్‌ను చూసేందుకు 60 మిలియన్ డాలర్ల విలువైన ప్రభుత్వ విమానంలో ప్రయాణించడంతోసహ విల్‌కిన్స్ కోసం కట్టుదిట్టమైన రక్షణ ఏర్పాట్లు చేయడం వంటి ఆరోపణలు ఆయనపై ఉన్నాయి.

# పింక్‌సాల్ట్ ఆరోగ్యకరం



ఉప్పు వీలైనంత తగ్గించమని పదేపదే హెచ్చరిస్తోన్న ఆహార నిపుణులు సైంధవ లవణం చాలా మంచిదని చెబుతున్నారు. పెద్దపెద్ద చెఫ్‌లు కూడా ఇది ఆరోగ్యకరమని, కొన్ని వంటల్లో ప్రత్యేకంగా దీన్నే ఉపయోగించమంటున్నారు. ఇంతకీ సైంధవ లవణం ఎందుకు మంచిదో, దాని వల్ల ఏం లాభాలు ఉన్నాయో తెలుసుకుందాం..

పింక్‌సాల్ట్‌లో సోడియం, క్లోరైడ్, సల్ఫర్, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్, జింక్‌లు ఉన్నాయి. మామూలు ఉప్పు వాడటం వల్ల వచ్చే అనారోగ్యాలు దీని వల్ల రావు. సైంధవలవణాన్ని ఉపయోగించడం వల్ల ఆహారం చక్కగా జీర్ణమవుతుంది. కీళ్లనొప్పులు, మోకాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. సాధారణ ఉప్పుతో పోలిస్తే ఇందులో సోడియం పరిమాణం తక్కువ. కనుక శరీరంలో సోడియం పేరుకోదు. ఇది ఒంట్లో పేరుకున్న కొవ్వును కరిగి స్తుంది. కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచి, జుట్టు రాలకుండా కాపాడుతుంది. శరీరంలో చేరిన అనేక రకాల సూక్ష్మ క్రిములను నశింప చేస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్ గుణాలున్నాయి. ఎనీమియాతో బాధ పడుతున్న వారికి ఎంతో మేలు చేస్తుంది. గృహచిట్కాల్లో ఇది ముందుంటుంది. కడుపు నొప్పి, మలబద్ధకం, గుండెమంట, కడుపుబ్బరం లాంటి ఇబ్బందులను నివారిస్తుంది. సోడియం స్థాయి మరీ తగ్గినా ప్రమాదమే నిద్రలేమి, మానసిక రుగ్మతల బారిన పడే అవకాశం ఉంది. తగినంత సైంధవలవణం తీసుకోవడం వల్ల ఆ సమస్యలు రావు. దీన్ని వేడినీళ్లలో వేసి పుక్కిలిస్తే గొంతు సమస్యలు తగ్గుతాయి. పింక్‌సాల్ట్ ఆరోగ్యకరమే కాదు. దీని వల్ల వంటలు ప్రత్యేకమైన రుచీ, వాసనలతో వహ్వా అనిపిస్తాయి. □

# కుంభకర్ణుడి నిద్ర

**ఎంత లేపినా నిద్ర లేవకపోతే** కుంభ కర్ణుడిలా నిద్ర ఏంటి అని అంటాం. అసలు కుంభ కర్ణుడు అంతలా నిద్రపోవటానికి కారణం ఏంటి? అసలేం జరిగింది? కైకసి పుత్రులైన రావణ, కుంభకర్ణ, విభీషణులు బ్రహ్మదేవుణ్ని సంతోషపెట్టి వరాలు పొందాలని ఘోరమైన తపస్సు ప్రారంభిస్తారు. రావణుడు వెయ్యి సంవత్సరాల తపస్సు పూర్తికాగానే ఒక తలను పూర్ణాహుతి కావిస్తూ పదివేల సంవత్సరాలు తపస్సు చేసి తన పదో తలను కూడా అహుతి చేయబోతుండగా బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకొమ్మంటాడు. తనకు మరణం లేని వరం ప్రసాదించ మంటాడు. అలాంటి వరం ప్రసాదించడం అసాధ్యమంటూ మరేమైనా కోరుకొమ్మంటాడు బ్రహ్మ మానవులు తనకు గడ్డిపరకల వంటివారని, కనుక దేవతలు, గరుడ, గంధర్వ, పన్నగ, యక్షుల చేతిలో చావు లేకుండా వరం కోరుతాడు రావణుడు. అలాగేనని అనుగ్రహించిన బ్రహ్మ రావణుడు బలి ఇచ్చిన తొమ్మిది తలలు తిరిగి పుట్టేలా కూడా వరం ఇస్తాడు. కుంభకర్ణుడు గ్రీష్మ రుతువులో అగ్ని మధ్య నిలబడి, వర్షరుతువులో వానలో తడుస్తూ, శిశిరరుతువులో నీటి నడుమ నిలబడి పదివేల సంవత్సరాలు తపస్సు చేస్తాడు, అతడి తపస్సుకు మెచ్చి పరమేష్టి, వరమీయ సంకల్పించగానే అతడికి వరాలు ప్రసాదించవద్దని దేవతలు అడ్డుపడతారు. సరస్వతీదేవి కుంభకర్ణుడి నాలుకపై ప్రవేశపెట్టి బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై వరం కోరుకొమ్మంటే నిర్దయ బదులు సరస్వతీదేవి ప్రేరణత నిద్దుర కావాలంటాడు కుంభకర్ణుడు. తథాస్తు అంటాడు కమలాసనుడు. ముగ్గురు సోదరులు ఒకేసారి పదివేల సంవత్సరాలు ఘోర తపస్సు చేసినా వారి బుద్ధులను బట్టి వరాలు పొందగలిగారు. లోకాలను జయించి చిరంజీవి కావాలనుకున్న రావణుడి కోరిక నెరవేరలేదు. కోరకకుండానే చిరంజీవి కాగలిగాడు విభీషణుడు. కుంభకర్ణుడు శయన మందిరంలో నిద్రావస్థలో ఉండిపోయాడు. □

# మొక్కజొన్న పిండితో క్లీనింగ్

వంటకాల్లో రుచిని పెంచడానికి మొక్కజొన్న పిండి వినియోగిస్తాం. అయితే ఇది రుచికే కాదు, ఇంటినీ, వస్తువులనూ మెరిసేలా చేయడానికి కూడా ఉపయోగపడుతుంది. అదెలాంగంటే.. ఇది సహజసిద్ధమైన గ్లాస్ క్లీనర్‌గా పని చేస్తుంది. రెండు కప్పుల నీటికి టేబుల్‌స్పూన్ చొప్పున మొక్కజొన్నపిండి, వెనిగర్ కలపాలి. ఈ మిశ్రమాన్ని స్ప్రే సీసాలో నింపి గాజు కిటికీ, షెల్ఫ్ డోర్స్, టీపాయి, డైనింగ్ టేబుల్ వంటివాటిపై చల్లి మృదువైన వస్త్రంతో తుడిస్తే చాలు. మరకలు, దుమ్ము, గీతలు వంటివన్నీ మాయమై,



తళతళలాడతాయి. వాహనం నడిపేటప్పుడు దుస్తులకయ్యే గ్రీజ్, మరకలను ఈ పొడితో తేలికగా పోగొట్టొచ్చు. మరక ఉన్నచోట కొంచెం మొక్కజొన్న పిండిని చల్లి 12 గంటలు పక్కన ఉంచాలి. ఆ తర్వాత పిండిని దులిపి వాషింగ్ మెషిన్‌లో వేస్తే ఆ వస్త్రం నుంచి గ్రీజ్ తేలికగా దూరమై పోతుంది. వెండి నగలు, పాత్రల మెరుపు తగ్గినప్పుడు అరకప్పు పొడిని తీసుకుని సరిపడినంత నీటితో పేస్టులా చేయాలి. దీన్ని వస్తువులకు పట్టించి మృధువుగా రుద్దితే పూర్వపు మెరుపు తిరిగి వస్తుంది. . బూట్లు ఎక్కువ సేపు ధరించినప్పుడు చెమట పట్టి దుర్వాసన వస్తాయి. బూట్లలో కొంచెం మొక్కజొన్న పిండిని చల్లి రాత్రంతా వదిలేయాలి. తెల్లారిన తర్వాత షూ దులిపి, పొడి వస్త్రంతో తుడవాలి. దుర్వాసనను ఈ పిండి పీల్చుకోవడంతో సమస్య దూరమవుతుంది. కార్పెట్‌పై పిల్లలు రకరకాల పదార్థాలను ఒంపుతుంటారు. దీంతో ఎంత శుభ్రపరిచినా ముక్కవాసన వదలదు. ముఖ్యంగా నూనె, పడితే ఆ జిడ్డు మరకలు త్వరగా పోవు. ఆ ప్రాంతంలో కాస్తంత మొక్కజొన్న పిండిని చల్లి అరగంటసేపు ఉంచి ఆ తర్వాత, దులిపి శుభ్రపరిస్తే చాలు మరకలూ, వాసనా దూరమవుతాయి. □

# పిల్లలు డీహైడ్రేషన్‌కు గురి కాకుండా..



చిన్నారుల మానసిక వికాసానికి తోడ్పడే ఆటల నుంచి వారిని దూరం చేయలేం. ఎండాకాలంలో చిన్నారులు ఆటల్లో పడి ఎండ తీవ్రత తమపై పడుతుందన్న విషయాన్ని పట్టించుకోరు. ఫలితంగా డీహైడ్రేషన్‌కి గురవుతారు. అందుకే ఎండ ప్రభావం వారిపై పడ కుండా.. వారు డీహైడ్రేషన్‌కి గురికాకుండా.. కొన్ని జాగ్రత్తలుపాటించాలి.

**ఇవీ డీహైడ్రేషన్ లక్షణాలు..**
అధిక ఉష్ణోగ్రతల్లోనూ శరీరం చల్లగా ఉండేందుకు చర్మం అధిక మొత్తంలో చెమట ఉత్పత్తి చేస్తుంది. అయితే ఇలా చెమట ద్వారా శరీరంలోని నీరు, లవణాలు అధికమొత్తంలో బయటకు వెళ్లిపోతే డీ హైడ్రేషన్‌కి గురవుతాం. వేసవిలో చిన్నారులు డీహైడ్రేషన్‌కి గురవుతున్నారనే విషయాన్ని మనం ముందుగానే గుర్తించవచ్చు. నీరసంగా కనిపిం చడం, నోరు పొడిగా తయార వడం, మూత్రవిసర్జన తక్కువగా ఉండడం, వాంతులు చేసుకోవడంతో పాటు చిరాగ్గా ఉన్నట్టు కనిపిస్తే.. వారు డీహైడ్రేషన్‌కి గురవుతు న్నట్లుగా గుర్తించాలి. ఈ సమయంలో వారిని ఆటలకు కాస్త బ్రేక్ ఇవ్వమని చెప్పి నీరు, మజ్జిగ, పండ్లు వంటివి వారికి అందిం చాలి. అవసర మైతే వైద్యున్ని సంప్రదిం చాల్సి ఉంటుంది.



**నిమిషాలకోసారి...**
శరీరం నుంచి చెమట ద్వారా బయటకు వెళ్లిపోయిన నీటి లోటును ఎప్పటికప్పుడు భర్తీ చేయాల్సి ఉంటుంది. లేదంటే డీ హైడ్రేషన్ సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే చిన్నారులను దాహం వేస్తున్నా వేయకపోయినా.. ప్రతి పావుగంట నుంచి ఇరవై నిమిషాలకోసారి గ్లాసు నీటిని తాగమని వారికి అందించాలి. ఎప్పుడూ నీటిని తాగడానికి చిన్నారులు అంత ఆసక్తి చూపించకపోవచ్చు. అందుకోసం మజ్జిగ, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, కీరా-పండ్ల ముక్కల్ని నీటిలో వేసి అందించడం వంటివి కూడా అవసరం. అలాగే నీటిశాతం ఎక్కువగా ఉన్న పుచ్చ, తర్బూజా లాంటి పండ్లను కూడా వారికి అందించాలి. వేసవిలో కూల్‌డ్రింక్ లను చిన్నారులకు అందించక పోవడమే మంచిది. ఎందు కంటే వీటిలో ఉండే కెఫీన్ సహా ఇతర పదార్థాలు చిన్నారుల్లో డీహైడ్రేషన్‌కు కారణమవు తాయి.

**ఇవి కూడా ....** వేసవిలో ఎక్కువ సమయం ఆటల్లోనే గడిపే చిన్నారుల వస్త్రధారణ విషయంలో కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. వీలైనంత వరకు వారికి లేత రంగుల్లో ఉన్న నూలు వస్త్రాలనే తొడగాలి. అవికూడా వదులుగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వారిపై పడకుండా ఉంటుంది. నాలుగు నుంచి ఐదు గంటలపాటు ఏమీ తినకుండా, తాగకుండా ఇన్నారులు ఉన్నట్లైతే వారు డీ హైడ్రేషన్‌కి గురయ్యే అవకాశం ఉంది. కాబట్టి వారికి సరైన సమయానికి ఆహారం, నీరు అందించాలి. □

# కురుల సంరక్షణ



**రసాయనాలు ఎక్కువ ఉండే షాంపూలను వాడితే జుట్టు మరింత పాడవుతుంది. మరేం చేద్దామంటారా? తలస్నానానికి ముందు ఈ చికిత్సలు ప్రయత్నిస్తే సరి.**

కప్పు నీటిలో కొన్ని వేపాకులు, 10-15 తులసి ఆకులు వేసి మరిగించాలి. గోరువెచ్చగా అయ్యాక నీటిని వడకట్టి పక్కన ఉంచాలి. ఆకులను మిక్సీ పట్టి, ఆ మిశ్రమంతోపాటు 3 స్పూన్ల కలబంద గుజ్జును ఆ నీటికి కలపాలి. ఆపై మాడు నుంచి కురుల వరకు దీన్ని పట్టించి, పావుగంటయ్యాక తలస్నానం చేస్తే సరి. ఇది తలపై ఇన్‌ఫెక్షన్లను తగ్గించడంతోపాటు కురులు చిట్లడాన్నీ నివారిస్తాయి. శీకాయ, ఉసిరి ప్యాక్ కూడా కురులకు దివ్యౌషధం. అయితే దీని తయారీకి రెండు రోజులు కేటాయించాలి మరి. ఒక ఇసుప కడాయి తీసుకొని సమపాళ్లలో రెండు పొడులనూ తీసుకొని నీటిలో నానబెట్టాలి. రెండోరోజు మాడు, కురులకు పట్టించి, మృదువుగా రుద్దాలి. పావుగంట అయ్యాక గోరువెచ్చని నీటితో తలస్నానం చేసి చూడండి. మెరిసే కురులు సొంతమవుతాయి. ఇవి చుండ్రునీ నివారిస్తాయి. ముల్తానీ మట్టి మోముకి చేసే మేలెంతో మనకు తెలుసు. మాడునీ ఆరోగ్యంగా ఉంచుతుందని తెలుసా? రెండు స్పూన్ల ముల్తానీ మట్టికి మజ్జిగను కలిపి మెత్తని మిశ్రమంలా చేసుకోవాలి. అయిదు నిమిషాలు పక్కన పెట్టి, తర్వాత తలకు రాసుకోవాలి. ఆరాక చల్లని నీటితో తలస్నానం చేయాలి. జుట్టు బరకగా, పొడిబారుతున్నట్లు కనిపిస్తోంటే దీన్ని ప్రయత్నించండి. వాటికి తేమను అందించి మృదువుగా చేయడమే కాదు.. చెమట కారణంగా ఏర్పడే దురద, దద్దుర్లనూ తగ్గిస్తుంది. □

# మామిడి బజ్జీలు

15 నుంచి 20



**కావల్సినవి :** బియ్యపిండి- కప్పు, శెనగపిండి- ముప్పావు కప్పు, మామిడికాయ తురుము- అరకప్పు, ఉల్లిపాయలు- అరకప్పు, ఉల్లికాడలు- అరకప్పు, కొత్తిమీర- పావు కప్పు, చాట్ మసాలా-అర టీస్పూను, కరివేపాకు- టేముల్‌స్పూను, పుదీనా-టేముల్ స్పూను, అల్లం-అంగుళం ముక్క, వెల్లుల్లి-రెండు రెబ్బలు, జీలకర్ర పొడి- అర టీస్పూను, పచ్చిమిర్చి-ఒకటి బేకింగ్‌సోడా-చిటికెడు, వాము-పావు టీస్పూను, నూనె-డీప్‌ఫ్రైకి సరిపడా, ఉప్పు తగినంత,

**తయారీ :** ముందుగా అల్లం, వెల్లుల్లిని మెత్తని పేస్ట్‌లా చేసుకొని పెట్టుకోవాలి. ఆపై మిగిలిన పదార్థాలన్నింటినీ ఒక బౌల్‌లో వేసి నీళ్లు పోస్తూ బజ్జీల పిండిలా జారుడుగా కలుపు కోవాలి. ఆ తర్వాత నూనె వేడి చేసి ఈ మిశ్రమాన్ని మనకు నచ్చిన సైజులో బజ్జీల్లా వేతసుకొని వేయించుకోవాలి. బంగారం రంగు వచ్చిన తర్వాత దింపి సర్వ్‌చేస్తే సరి. □

# 'పెద్ది' టైటిల్ కార్డ్స్ నుంచి ఎండింగ్ వరకు ప్రేక్షకులు సీట్ నుంచి కదలలేరు

## -నిర్మాత వెంకట సతీష్ కిలారు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇప్పటికే చార్ట్ బస్టర్ పాటలు, అద్భుతమైన గ్లింప్స్ తో సినిమాపై అంచనాలు భారీ స్థాయికి చేరుకున్నాయి. ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత వెంకట సతీష్ కిలారు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**మీ తొలి ప్రొడక్షన్ రామ్ చరణ్ గారు లాంటి పెద్ద హీరోతో చేయడం ఎలా అనిపించింది?** రామ్ చరణ్ గారు సినిమా ఇవ్వడం నా అదృష్టం. ఆయన ఒప్పుకుంటేనే ఇది సాధ్యపడింది. ఈ సందర్భంగా రామ్ చరణ్ గారికి ధన్యవాదాలు. ఈ సినిమాను మేము అనుకున్న బడ్జెట్‌లో, గ్రాండ్ స్కేల్‌లో అద్భుతంగా తెరకెక్కించాం. తొలి రోజు నుంచి చివరి రోజు వరకు అదే పాజిటివ్ ఎనర్జీతో పని చేశాం. షూటింగ్ చివరి రోజు హీరో గారు, డైరెక్టర్ గారు అందరూ చాలా ఎమోషనల్ అయ్యారు. **మీ నేపథ్యం గురించి చెప్పండి?** మాది వ్యవసాయ కుటుంబం. మా నాన్నగారు రైతు. విజయవాడలో చదువుకున్నాను. ఇంజనీరింగ్ తర్వాత కన్‌స్ట్రక్షన్ ఫీల్డ్‌లోకి వెళ్లాను. నవీన్ గారు నా క్లోజ్ ఫ్రెండ్. ఆయనకు సినిమాలంటే చాలా ఇష్టం. అలా మేము సినిమాల్లోకి వచ్చాం. **నిర్మాతగా మీరు ఎదుర్కొన్న చాలెంజెస్ ఏమిటి?** చాలెంజెస్ అనేవి మనం డీల్ చేసే విధానాన్ని బట్టి స్మూత్‌గా మారుతాయి. ఈ సినిమా వరకు మా జర్నీ చాలా హ్యాపీగా సాగింది. తొలి రోజు నుంచి చివరి రోజు వరకు షూటింగ్ చాలా కూల్‌గా జరిగింది. ఎలాంటి పెద్ద చాలెంజెస్ ఎదురుకాలేదు. **బుచ్చిబాబు గారు కథ చెప్పినప్పుడు మీకు ఇందులో నచ్చిన అంశాలు ఏంటి?** కథ మొత్తం అద్భుతం. సినిమా మొదలైనప్పటి నుంచి చివరి వరకు ప్రేక్షకులు థియేటర్‌లో కూర్చునే ఉంటారు. కమర్షియల్ ఎలిమెంట్స్, ఎమోషన్స్.. ప్రతిదీ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది. ప్రేక్షకుడు సినిమాలో ఏం కోరుకుంటాడో, అవన్నీ ఒక పూర్తి ప్యాకేజ్‌లా బుచ్చిబాబు గారు అందించారు. **చరణ్ గారి గురించి?** చరణ్ గారు ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డారో మాటల్లో చెప్పలేం. అది స్క్రీన్‌పై చూసినప్పుడే ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ ఎంత అద్భుతంగా ఉందో ప్రేక్షకులకు అర్థమవుతుంది. **ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ గురించి?** ఏఆర్ రెహమాన్ గారు లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్. బుచ్చిబాబు గారు కథ అనుకున్నప్పుడే రెహమాన్ గారి పేరును ఫిక్స్ చేసుకున్నారు. ఆయన కథ విన్న తర్వాత మాకంటే ఎక్కువ ఎక్సైట్ అయ్యారు. **సినిమా బిజినెస్ ఎలా జరుగుతోంది?** బిజినెస్ మొత్తం క్లోజ్ అయిపోయింది. చాలా ప్రశాంతంగా ఉన్నాం. **ఇప్పటికే సినిమా చుట్టూ భారీ అంచనాలు ఉన్నాయి కదా.. ట్రైలర్ ఎలా ఉంటుంది?** ట్రైలర్ వచ్చిన తర్వాత అంచనాలు మరింత పెరుగుతాయి. ఎన్ని అంచనాలు పెట్టుకున్నా వాటిని మించేలా సినిమా ఉంటుంది. **శివరాజ్ కుమార్ గారి గురించి?** శివరాజ్ కుమార్ గారు, జగపతిబాబు గారు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ, టీను ఆనంద్.. ఇలా ప్రతి క్యారెక్టర్ కథతో బలంగా ముడిపడి ఉంటుంది. ఆ పాత్రల్లో వాళ్లు జీవించేశారు. **డీవోపీరత్నవేలు గారి గురించి?** రత్నవేలు గారు ది బెస్ట్ విజువల్స్ ఇచ్చారు. ఇది 80ల బ్యాక్‌డ్రాప్‌లో జరిగే కథ. మా ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ అద్భుతమైన సెట్లు వేశారు. **నెక్స్ట్ చేయబోయే సినిమా గురించి?** బాలకృష్ణ గారితో సినిమా నడుస్తోంది.

# 'పురుష:' కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం

## దర్శకుడు వీరు వులవల



**బత్తుల సరస్వతి** సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు 'పురుష' సినిమాను నిర్మించారు. ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతోన్నారు. ఈ మూవీకి వీరు వులవల దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజ్ కుమార్, రాయంచ కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాను మే 22న రిలీజ్ చేయబోతున్నారు. **మీ నేపథ్యం గురించి చెప్పండి?..** నాకు పెయింటింగ్స్ వేయడం అలవాటు. చిన్నప్పుడు హీరోల బొమ్మల్ని క్లాత్ మీద పెయింటింగ్ వేసేవాడ్ని. వాటిని థియేటర్ల ముందు అందరూ కట్టుకునేవారు. ఆ తరువాత బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చేశాను. ఏ పని చేసినా సరే నేను ఇండస్ట్రీలోనే ఉండాలని అనుకున్నాను. ఆ టైంలోనే 'కొత్త బంగారు లోకం' టైటిల్‌ను రాసి, డిజైన్ చేశాను. **నిర్మాత గారిని ఎలా ఒప్పించారు? ఆయన కథ విన్న తరువాత ఏం చెప్పారు?..** ఈ కథను పట్టుకుని తిరుగుతున్న టైంలో 'మసూద' సినిమాకి దర్శకత్వ శాఖలో పని చేసే అవకాశం వచ్చింది. అది కూడా మంచి విజయం సాధించింది. ఒక మూడు నెలలు చాలా సీరియస్‌గా వర్క్ చేశాను. **నిర్మాత గారి సపోర్ట్ గురించి చెప్పండి?..** నిర్మాత కోటేశ్వరరావు గారు ఏ ఒక్క రోజు కూడా ఏ ఒక్క విషయంలో మమ్మల్ని ప్రశ్నించలేదు. ప్రతీ ఒక్క స్టేజ్‌లో మా అందరినీ ప్రోత్సహించారు. ఆయన కూతురు సరస్వతి గారు అయితే ప్రతీ రోజూ సెట్‌లో మా అందరినీ ఎంతో చక్కగా చూసుకున్నారు. వీరిద్దరి సపోర్ట్‌తోనే సినిమాని ఇంత బాగా తీయగలిగాను. **'పురుష'లోని పాత్రలు ఎలా ఉంటాయి?** ప్రేమ కోసం ఏమైనా చేసే ఓ మంచి పాత్రలో పవన్ కళ్యాణ్ కనిపిస్తారు. సప్తగిరి, కసిరెడ్డి పాత్రలు అందరినీ ఎంటర్టైన్ చేస్తాయి. మరీ ముఖ్యంగా కసిరెడ్డి పాత్ర కోసం రాసిన డైలాగ్స్ ఎక్కువగా అలరిస్తాయి. **'పురుష' కథ ఎలా పుట్టుకొచ్చింది?** నేను అవకాశాల కోసం చాలా చోట్ల తిరిగాను. అయితే గౌతమ్ తిన్ననూరి గారి 'మళ్లీరావా' సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. ఆ సినిమాలో ప్రతీ ఫ్రేమ్‌కి డ్రాయింగ్ వేశాను. ఆ చిత్రం మంచి విజయం సాధించింది. ఆ తరువాత గౌతమ్ గారితో జర్నీ స్టార్ట్ అయింది. 'జెర్సీ'కి కూడా నేను పని చేశాను. **'పురుష' ఎలా ఉండబోతోంది?** భార్యాభర్తల మీదే స్టోరీని రాయాలని అనుకున్నాను. అయితే ఫీమేల్ ఓరియెంటెడ్ కథలెన్నో మనం చూశాం. కానీ ఇది మేల్ ఓరియెంటెడ్‌గా తీయాలని అనుకున్నాను. ఇలాంటి జానర్ ఒకటి ఉందా? అని అనుకున్నాను. అలా కథ పూర్తి చేశాను. **వెంటనే షూటింగ్‌ని స్టార్ట్ చేశారా? లేదా ఏమైనా వర్క్ షాప్స్ నిర్వహించారా?** పవన్ కళ్యాణ్ కొత్త ఆర్టిస్ట్. సత్యానంద్ గారి వద్ద శిక్షణ తీసుకున్నారు. అయితే వెంటనే షూటింగ్‌కి వెళ్లలేదు. ఓ రెండు నెలల పాటుగా వర్క్ షాప్స్ నిర్వహించాం. **'పురుష' టెక్నికల్ టీం గురించి చెప్పండి?** కెమెరామెన్ సతీష్ గారి వల్లే నిర్మాత పరిచయం అయ్యారు. ఆయనతో నాకు 'మళ్లీరావా' నుంచే పరిచయం. నేచురల్ లొకేషన్స్‌లోనే దాదాపుగా షూటింగ్ చేశాం. **'పురుష' గురించి ఫైనల్‌గా చెప్పండి?** ప్రస్తుతం నా వద్ద యాక్షన్, ఫ్యాంటసీ, థ్రిల్లర్ జానర్లలో కథలు రెడీగా ఉన్నాయి. ఈ సినిమాలోనూ కొన్ని చోట్ల హారర్, థ్రిల్లర్, యాక్షన్ ఎలిమెంట్స్ ఉంటాయి.

# 'బ్లాక్ మెయిల్' చిత్రం ప్రారంభం




వరుణ్ సందేశ్ హీరోగా హనుమాన్ ఫిలిం ఫ్యాక్టరీ బ్యానర్ పై అవినాష్ కూనపరెడ్డి నిర్మాతగా శ్రీనివాస్ గుండ్రెడ్డి రచన దర్శకత్వంలో ప్రారంభమైన చిత్రం బ్లాక్ మెయిల్. పూజా కార్యక్రమాలతో నేడు హైదరాబాద్ ప్రసాద్‌లో ఈ చిత్ర ప్రారంభం ఘనంగా జరిగింది. జెమిని సురేష్, పృథ్వీరాజ్, సమ్మెట గాంధీ, నాగ మహేష్ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించనున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనివాస్ గుండ్రెడ్డి మాట్లాడుతూ... "మా సినిమాకు సపోర్ట్ చేస్తూ ఈ కార్యక్రమానికి వచ్చిన మీడియా వారికి, మమ్మల్ని సపోర్ట్ చేస్తూ వచ్చిన పెద్దలకు కృతజ్ఞతలు" అన్నారు. హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ "నాకు దర్శకులు చాలా కాలంగా పరిచయం" అన్నారు. నటుడు జెమిని సురేష్ మాట్లాడుతూ "బ్లాక్ మెయిల్ చిత్రంతో వరుణ్ సందేశ్ గారితో కలిసి నటించబోతున్నాను. ముఖ్యంగా చిత్ర నిర్మాతకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అన్నారు. నిర్మాత అవినాష్ మాట్లాడుతూ "మా బ్లాక్ మెయిల్ చిత్ర ప్రారంభానికి వచ్చిన అతిథులకు, మీడియా వారికి చాలా థాంక్స్. నేను ఈ సినిమా రంగంలోకి రావడానికి ఒక ముఖ్య కారణం 200 కుటుంబాలకు పని కలిగించవచ్చు అని. ఇంకొకటి తెలుగు సినిమా అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని. ఈ సినిమా మంచి విజయం సాధిస్తుంది అని నమ్ముతున్నాను" అన్నారు.

# 'సింగ్ గీతం' నుంచి హాలో బాసు సాంగ్ లాంచ్




లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ 'సింగ్ గీతం'తో ముందుకు వస్తున్నారు. ఐకానిక్ మూకీ చిత్రం 'పుష్పక్' నుంచి విజనరీ సైన్స్ ఫిక్షన్ క్లాసిక్ 'ఆదిత్య 369' వరకు ఆయన క్రియేటివిటీకి పర్యాయపదంగా నిలిచారు. ఈ రోజు మేకర్స్ ఈ సినిమా నుంచి హాలో బాసు సాంగ్ లాంచ్ చేశారు. 'హాలో బాసు' సాంగ్ పూర్తి స్థాయి ఫన్‌ఫుల్ ఎనర్జీతో ఆకట్టుకుంటోంది. దేవిశ్రీ ప్రసాద్ అందించిన ట్యూన్ క్యాచీగా ఉండటమే కాకుండా, వినగానే హమ్ చేయించేలా ఉంది. సింగర్స్ వంశీ, ఆర్.పీ. కృష్ణాంగ్ తమ ఎనర్జిటిక్ వాయిస్‌తో పాటకు అదిరిపోయే వైబ్ తీసుకొచ్చారు. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో విజనరీ డైరెక్టర్ నాగ్ అశ్విన్ మాట్లాడుతూ.. అందరికీ థ్యాంక్యూ. ఇది మాకు చాలా స్పెషల్ అకేషన్. ఈ రోజు ఒక డిలీటెడ్ సాంగ్‌ను రిలీజ్ చేస్తున్నాం. ఈ సాంగ్ చాలా బాగుంటుంది. కాకపోతే సినిమాకు తీసేయమని చెప్పారు (నవ్వుతూ) ఈ పాట కోసం మా దాసు చాలా కష్టపడ్డాడు అన్నారు. వంశీ మాట్లాడుతూ.. ఈ సినిమాలో 'దాసు' అనే క్యారెక్టర్ చేశాను. ఆ పాత్ర చాలా కొత్తగా, చాలా ఫన్‌గా ఉంటుంది. ఇది మంచి ఫన్ సినిమా అన్నారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండేపూడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి అంకూర్ సి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఆర్ట్ డైరెక్టర్ అరవింద్ మూలే.

# 'నేను రెడీ' స్పెషల్ సాంగ్‌తో నర్గీస్ ఫక్రీ



నువ్విలా, జీనియస్, రామ్ లీలా, సెవెన్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో హావీష్ ప్రస్తుతం త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో నటిస్తున్నాడు. సినిమా చూపిస్తా మామా, నేను లోకల్, ధమాకా, మజాకా వంటి మాస్ హిట్ చిత్రాలతో ఫేమస్ అయిన త్రినాథరావు నక్కిన 'నేను రెడీ'ని ఫుల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. హార్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పి బ్యానర్‌పై కోనేరు సత్యనారాయణ, నిఖిలా కోనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో కావ్య థాపర్ కథానాయికగా నటిస్తోంది. బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ నేను రెడీ చిత్రంతో తెలుగులోకి అడుగుపెడుతున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ పాట పోస్టర్‌లో నర్గీస్ ఫక్రీ మెరిసే వెండి రంగు దుస్తులలో, కొవ్వొత్తులతో వెలిగే ఒక అద్భుతమైన బ్యాక్ డ్రాప్‌లో రొమాంటిక్ ఫోజ్‌లో కనిపించారు. సెట్‌లోని ఎరుపు, నీలం రంగు లైటింగ్, నీడలా కనిపించే డ్యాన్సర్స్ ఒక ఉత్సాహభరితమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రంలో బ్రహ్మానందం, శ్రీలక్ష్మి, వెన్నెల కిషోర్, మురళీ శర్మ, విటివి గణేష్ ఇతర ప్రముఖ తారాగణంగా ఉన్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తుండగా, సినిమాటోగ్రాఫర్ నిజర్ షఫీ స్టైలిష్ విజువల్స్‌తో చిత్రాన్ని చిత్రీకరిస్తున్నారు. ప్రవీణ్ పూడి ఎడిటర్, కథ, స్క్రీన్‌ప్లేను విక్రాంత్ శ్రీనివాస్ రాశారు. ఈ చిత్రం జూన్ రెండో వారంలో విడుదలకు సిద్ధమవుతోంది.

ఆట



# రికార్డుల రారాజు

(వార్త క్రీడా విభాగం)

మాస్టర్ క్లాస్, ఛేజింగ్ కింగ్ విరాట్ కోహ్లీ ఐపీఎల్‌లో రికార్డుల మీద రికార్డులు నమోదుచేస్తున్నాడు. ఈ సీజన్‌లోనూ సూపర్ ఫామ్ కొనసాగిస్తున్న కోహ్లీ ఖాతాలో మరో ఘనత చేరింది.ఐపీఎల్ చరిత్రలో అందరికంటే ఎక్కువగా 9సార్లు 500 ప్లస్ స్కోరు చేసిన బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. పంజాబ్ కింగ్స్‌పై ధర్మశాలలో అద్భుత సెంచరీతో మెరిసి ఈ సీజన్‌లో 500 ప్లస్ రన్స్‌కు చేరాడు. ఈ సీజన్‌లో కోహ్లీ(542)తో కలుపుకుని నలుగురు సాయి సుదర్శన్(554), శుభ్‌మన్ గిల్(552), హెన్రీ క్లాసెస్(502) మాత్రమే 500 క్లబ్‌లో ఉన్నారు.

కింగ్ కోహ్లీ 37 బంతుల్లోనే 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 58 రన్స్ సాధించాడు. ఈ క్రమంలో 500 క్లబ్‌లో చేరాడు. ఈ సీజన్‌లో ఓ సెంచరీ సహా నాలుగు హాఫ్ సెంచరీలతో 164.74 స్ట్రయిక్ రేట్‌తో 542 రన్స్ సాధించాడు. వరుసగా నాలుగు సీజన్లలో 500 ప్లస్ సాధించి కన్‌సిస్టెంట్ బ్యాటింగ్‌కు కేరాఫ్‌గా నిలిచాడు. 2023లో 639 రన్స్, 2024లో 741 రన్స్, 2025లో 505 రన్స్ సాధించాడు.ఐపీఎల్ ఒకే సీజన్‌లో ఆల్‌టైమ్ అత్యధిక పరుగుల రికార్డు కూడా కోహ్లీ పేరిటే ఉంది. 2016లో ఏకంగా 973 పరుగులు సాధించాడు. ఇది ఇప్పటికీ అన్‌బీటబుల్‌గా ఉంది. ఆ సీజన్‌లో దుమ్మురేపిన కోహ్లీ 81.08 బ్యాటింగ్ సగటుతో 973 రన్స్ చేశాడు. అందులో నాలుగు సెంచరీలు, ఏడు హాఫ్ సెంచరీలు ఉన్నాడు. ఒకే సీజన్‌లో అత్యధిక సెంచరీల రికార్డు కూడా కోహ్లీ పేరిటే అన్‌బీటబుల్‌గా ఉంది.

అలాగే ఒకే ఫ్రాంచైజీ తరపున ఓపెనర్‌గా 5500 పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా విరాట్ రికార్డు సృష్టించాడు. ధర్మశాలలో 9 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద విరాట్ ఈ ఫీట్‌ను అందుకున్నాడు. అంతకుముందు శిఖర్ ధావన్, డేవిడ్ వార్నర్ వంటి ఆటగాళ్లు ఐపీఎల్‌లో ఓపెనర్లుగా 5500 పరుగుల మార్కును దాటినప్పటికీ.. వారు వేర్వేరు ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించారు. కోహ్లీ మాత్రం కేవలం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్ తరుపున ఆడుతూ ఈ ఘనత సాధించాడు.

అదేవిధంగా ఐపీఎల్‌లో ఒకే జట్టుపై అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కోహ్లీ తన రికార్డును తానే బ్రేక్ చేశాడు. పంజాబ్ కింగ్స్‌పై కోహ్లీ ఇప్పటివరకు 1175కు పైగా పరుగులు సాధించాడు. ఇంతకముందు చెన్నై సూపర్ కింగ్స్‌పై 1174 పరుగులు చేశాడు.

# ధర్మశాలలో దంచేసిన ఆర్సీబీ

## టాప్ ప్లేస్‌తో దక్కిన ప్లే ఆఫ్ బెర్త్ * వరుసగా ఆరో మ్యాచ్‌లో పంజాబ్‌కు ఓటమి

**ధర్మశాల :** ఐపీఎల్ 2026లో ప్లేఆఫ్స్‌కు ఆర్సీబీ దూసుకెళ్లింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ 23 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 223 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 199 పరుగులు చేసింది.ఆరంభంలోనే పేసర్ భువనేశ్వర్...పంజాబ్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. ఇన్నింగ్స్ మూడో బంతికే ప్రియాన్ష్ ఆర్యను డకౌట్ చేసిన భువీ... తరువాతి ఓవర్లో ప్రభుసిమ్రాన్(2)ను అవుట్ చేశాడు. మరో ఎండ్‌లో వస్తూనే రసిఖ్ తన తొలి ఓవర్లో కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(1)ను పెవిలియన్ పంపాడు. శశాంక్ సింగ్ 56, స్టొయినిస్ 37, కనోలి 37, సూర్యాంశ్ 35 రన్స్ చేశారు. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ 2, సలామ్ దార్ 3 వికెట్లు పడగొట్టారు. హేజిల్‌వుడ్, సుయాశ్ శర్మ, రొమారియో షెఫర్డ్ తలో వికెట్ తీశారు.

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222పరుగులు చేసింది. ఓపెనర్ బెతెల్(11) నిరాశపర్చినా.. వెంకటేశ్ అయ్యర్ (40 బంతుల్లో 73; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు), విరాట్ కోహ్లీ (37 బంతుల్లో 58; 4 ఫోర్లు, 3సిక్స్‌లు) అర్ధసెంచరీలతో రాణించారు. దేవ్‌దత్ పడిక్కల్ (25 బంతుల్లో 45; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (12 బంతుల్లో 28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులు మెరిపించి ఆర్సీబీ స్కోరును 200 మార్కు దాటించారు. పంజాబ్ బౌలర్లలో హార్‌ప్రీత్ 2, అర్షదీప్, చాహల్ ఒక్కో వికెట్ పడగొట్టారు.





## లేచి పడిన పంజాబ్ కెరటం

**ధర్మశాల :** ఐపీఎల్2026 సీజన్ ఆరంభంలో పేరుకు తగ్గట్లే పంజాబ్ కింగ్స్‌లా ఆడింది. గుజరాత్‌పై గెలుపుతో మొదలుపెట్టిన 2025 రన్నరప్ పంజాబ్... ఆ తర్వాత సీఎస్కే, సన్‌రైజర్స్, ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్... ఇలా వరుస విజయాల దుందుభి మోగించింది. కేకేఆర్ మ్యాచ్ వర్షార్పణంతో సహా మొదటి ఏడు మ్యాచ్‌ల్లో ఓటమనేది లేకుండా కొనసాగింది. ఇక ఈసారి కూడా పంజాబ్ కింగ్స్ టేబుల్ టాపర్ ఖాయమని అంతా భావించారు.

తీరా లీగ్ సెకండ్ స్టేజ్‌కు వచ్చేసరికి లేచి పడిన కెరటంలా పంజాబ్ పరిస్థితి మారింది. ఫస్ట్ స్టేజ్‌లో తాను ఓడించిన జట్లే... రివేంజ్‌లా పంజాబ్‌ను ఓడిస్తూ పోయాయి. ఆరు వరస విజయాలు.. ఇపుడు ఆరు వరుస పరాజయాలు. రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్‌తో మొదలైన ఓటముల పరంపర తాజాగా ఆర్సీబీ వరకు కొనసాగింది. తీరా చూస్తే 13 మ్యాచ్‌ల్లో ఆరు విజయాలు, ఆరు పరాజయాలతో 13 పాయింట్లతో ప్లే ఆఫ్ అవకాశాలు దాదాపు మూసుకుపోయాయి.

పంజాబ్ కింగ్స్ ఇక ఒకే ఒక మ్యాచ్ లక్నో సూజర్ జెయింట్స్‌తో దాని సొంత గ్రౌండ్‌లో ఆడనుంది. ఈ మ్యాచ్‌లో ఓడితే ఇక అంతే. గెలిస్తే 15 పాయింట్లకు చేరుకుంటుంది. అపుడు మిగతా జట్ల గెలుపోటములపై ఆధారపడాల్సి ఉంటుంది. సన్‌రైజర్స్ రెండూ మ్యాచ్‌లు ఓడితే.. రాజస్థాన్ రాయల్స్ మూడు మ్యాచ్‌లు ఓడితే.. చెన్నై ఒక మ్యాచ్‌లో గెలిచి ఒక మ్యాచ్‌లో ఓడితే.. కేకేఆర్ రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే... ఇలాంటి సమీకరణాలన్నీ కుదిరితేనే పంజాబ్‌కు కాస్తా కూస్తో ఆశలు.

# రాజస్థాన్ రాయల్స్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ షాక్

**ఢిల్లీ:** సొంతగడ్డపై బ్యాటింగ్, బౌలింగ్‌లో చెలరేగిన ఢిల్లీ క్యాపిటల్స్.. రాజస్థాన్ రాయల్స్‌కు షాకిచ్చింది. 194 పరుగుల లక్ష్యాన్ని మరో నాలుగు బంతులుండగానే 5వికెట్లు కోల్పోయి అందుకుంది.ఓపెనర్లు కెఎల్‌రాహుల్ (42 బంతుల్లో 56; 1 ఫోర్, 3 సిక్స్‌లు),అభిషేక్ పోరల్(31 బంతుల్లో 51; 7 ఫోర్లు, 1సిక్స్), కెప్టెన్ అక్షర్ పటేల్(18బంతుల్లో 34 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించి ఢిల్లీకి విజయం అందించారు. ఢిల్లీ 12 పాయింట్లతో ప్లే ఆఫ్ రేసులో నిలవగా, రాజస్థాన్ రాయల్స్ వరుసగా మూడో పరాజయం ఖాతాలో వేసుకుంది.



నాలుగు వికెట్లు పడగొట్టిన స్టార్క్

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు చేసిన రాజస్థాన్ రాయల్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్(12) తక్కువ రన్స్‌కే అవుటయినా వైభవ్ సూర్యవంశీ(21 బంతుల్లో 41; 5 ఫోర్లు, 3సిక్స్‌లు) క్రీజ్‌లో ఉన్నంతసేపు బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రియాన్ కేవలం 26 బంతుల్లోనే 3 ఫోర్లు, 5 భారీ సిక్సర్లతో 51 పరుగులు, ధృవ్ జురెల్ 40 బంతుల్లో 53 రన్స్ ధాటిగా ఆడడంతో 200 ప్లస్ స్కోరు చేసే ఊపులో కనిపించింది. 15వ ఓవర్లో మిచెల్ స్టార్క్ మూడు వికెట్లు తీయడంతో రాజస్థాన్ 200 లోపుకే పరిమితమైంది. ఢిల్లీ బౌలర్లలో స్టార్క్ 4 వికెట్లతో చెలరేగగా.. మాధవ్ తివారీ, లుంగి ఎంగిడి చెరో 2 వికెట్లతో రాణించారు.

## థాయ్ రన్నరప్‌గా సాత్విక్, చిరాగ్ జోడీ

**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ డబుల్స్ ఫైనల్ చేరిన భారత్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి రన్నరప్‌తోనే సరిపెట్టారు.ఫైనల్లో ఇండోనేషియాకు చెందిన లియో రోలీ కర్నాండో, డానియల్ మార్తిన్ జోడీ చేతిలో 12-21, 23-25తో వరుస సెట్లలో ఓడిది. మూడో టైటిల్‌ను నెగ్గుదామని భావించిన భారత్ జోడీకి నిరాశే ఎదురైంది. మొదటి సెట్‌లో ఇండోనేషియా దూకుడు ముందు భారత్ జోడీ నిలవలేకపోయింది. ఇక రెండో సెట్ మాత్రం హోరాహోరీగా సాగింది. భారత ద్వయం చివరి వరకూ పోరాడారు.

## టెక్కలి టు ఢిల్లీ క్యాపిటల్స్: విజయ్ అరంగేట్రం

**హైదరాబాద్, మే 17:** శ్రీకాకుళం కుర్రాడు త్రిపురాన విజయ్ ఎట్టకేలు ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తుది జట్టులో చోటు సంపాదించాడు. ఐపీఎల్2025 మెగా వేలంలో 30లక్షల బేస్ ప్రైస్‌కు కొనుగోలు చేసిన ఢిల్లీ క్యాపిటల్స్.. అకిబ్ నబీ స్థానంలోతుది జట్టులోకి తీసుకుంది. ఆఫ్ బ్రేక్ బౌలరైన విజయ్... 2 ఓవర్లలో 29 పరుగులిచ్చాడు. ఇన్నింగ్స్ 5వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన విజయ్ ఓవర్లో వైభవ్ మూడు ఫోర్లు, ఓ సిక్స్‌తో 18 రన్స్ చేశాడు. రెండో ఓవర్‌లో మాత్రం కుదురుకుని విజయ్ అద్భుత బంతులు వేశాడు. అయిదు సింగిల్స్, ఓ సిక్స్ మాత్రమే ఇచ్చాడు.

24 ఏళ్ల త్రిపురాన విజయ్... శ్రీకాకుళం జిల్లా నుంచి ఐపీఎల్‌కు ఎంపికైన మొదటి క్రికెటర్‌గా



ఇప్పటికే గుర్తింపు అందుకున్నాడు. టెక్కలిలోని అయ్యప్పనగర్‌లో నివాసం ఉంటున్న త్రిపురాణ వెంకట కృష్ణరాజు, లావణ్యలు విజయ్ తల్లిదండ్రులు. అండర్-19లో ఏసీప నార్త్‌జోన్ టోర్నీలో మెరుగైన ప్రదర్శన చేయడంతో 2021లో ఆంధ్ర రంజీ జట్టుకు ఎంపికయ్యాడు. విజయ్ ఇప్పటివరకు 16 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి 52 వికెట్లు పడగొట్టాడు. అదేవిధంగా లిస్ట్-ఎలో 5, టీ20ల్లో 14 వికెట్లు పడగొట్టాడు.

# ఈ వారం మార్కెట్‌లోకి 5 కొత్త ఫండ్ ఆఫర్స్

**ముంబయి,మే 17:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో మార్కెట్ పరిస్థితులను బట్టి ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఫండ్స్ లాంచ్ అవుతున్నాయి. ఈ వారం ఏకంగా ఒకేసారి 5 కొత్త ఫండ్ ఆఫర్స్ తీసుకొచ్చాయి.వీటిలో నాలుగు స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌ఎస్ఐఎఫ్ ఉంటే ఒక పాసివ్ ఫండ్ సైతం లాంచ్ అవుతోంది. 360 వన్ ఎంఎస్‌సీఐ ఇండియా ఈటీఎఫ్ అనే ఫండ్ సబ్‌స్క్రిప్షన్ సోమవారం ప్రారంభమయి 20వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.5000గా నిర్ణయించారు. ఆ తర్వాత రూ.5 వేల చొప్పున ఎంతైనా ఇన్వెస్ట్ చేయవచ్చు. ఈ ఫండ్ గురించి పూర్తి వివరాలు తెలుసుకుని, తమ రిస్క్ ప్రొఫైల్, పెట్టుబడి హారిజన్ వంటి వివరాలు సరిచూసుకోవాలని ఇన్వెస్ట్ సలహాదారులుచెపుతున్నారు.

ప్రముఖ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ నుంచి రెండు ఎస్ఐఎఫ్ పథకాలు లాంచవుతున్నాయి. ఐఎస్ఐఎఫ్ ఈక్విటీ లాంగ్ షార్ట్ ఫండ్, ఐఎస్ఐఎఫ్




యాక్టివ్ అసెట్ అలకేటర్ లాంగ్ షార్ట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ మే 19వ తేదీన మొదలై జూన్ 2వ తేదీ వరకు కొనసాగనుంది. ఈకొత్త ఫండ్ ఆఫర్ సమయంలో కనీస పెట్టు బడి రూ.10 లక్షలుగా ఉంది. మిరాయ్ అసెట్ మ్యూచువల్ ఫండ్ నుంచి ప్లాటినం హైబ్రిడ్ లాంగ్ షార్ట్ ఫండ్ పేరుతో న్యూ ఫండ్ ఆఫర్ తీసుకొ చ్చారు. ఈ స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ 20వ తేదీన మొదలై జూన్ 3వ తేదీ వరకు కొనసాగుతుంది. కనీస పెట్టుబడి రూ.10 లక్షలుగా ఉంది. ఎడెల్వీస్ మ్యూచువల్ ఫండ్ ఏఎంసీ నుంచి అల్టివా ఈక్విటీ ఎక్స్ టాప్ 10 లాంగ్ షార్ట్ ఫండ్ 100 పేరుతో సరికొత్త ఎస్ఐఎఫ్ ఫండ్ తీసుకొచ్చింది. ఈ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ 18వ తేదీన మొదలై జూన్ 1వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.10 లక్షలుగా ఉంది.

# 5 నెలల్లో ఎఫ్‌పిఐలు 2.2 లక్షల కోట్లు విత్‌డ్రా




**న్యూఢిల్లీ, మే 17:** విదేశీ ఇన్వెస్టర్లు భారత్ ఈక్విటీ మార్కెట్ల నుంచిఈనెలలో రూ.27,048 కోట్ల రూపాయలు విత్‌డ్రా చేసారు. డాలరుతో రూపాయి మారకం విలువలు పెరగడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. వీటికితోడు భౌగోళిక ఉద్రిక్తతలు కూడా చిక్కులు తెచ్చాయి.ఇప్పటి వరకూ ఈఏడాది మార్కెట్లనుంచి విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు విత్‌డ్రాచేసుకున్న నిధులు రూ.2.2లక్షలకోట్లుగా ఉన్నాయి.అదే గత ఏడాది ఐదునెలల్లోను 1.66లక్షలకోట్లు విత్‌డ్రాచేసుకోగా ఈసారి మరింతగా విత్‌డ్రాచేసారు. ఇప్పటివరకూ అన్ని నెలల్లోను ఎఫ్‌పిఐలు అమ్మకందారులుగానే కొనసాగారు. ఫిబ్రవరి మినహా అన్ని నెలల్లోను విత్‌డ్రాలే ఉన్నాయి. జనవరిలో రూ.35,962 కోట్లు విత్‌డ్రా చేసిన ఎఫ్‌పిఐలు ఫిబ్రవరిలో మాత్రం రూ.22,615కోట్లు పెట్టుబడులు పెట్టారు. 17నెలల గరిష్టంగా ఈ పెట్టుబడులున్నాయి. అయితే ఈట్రెండ్ మార్చినెలలో రివర్స్ అయింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1.17లక్షలకోట్లు విత్‌డ్రా చేసారు. అలాగే ఏప్రిల్‌లో కూడా రూ.60,847 కోట్లు విత్‌నరడాచేసారు.మేనెలలో కూడా ఇప్పటి వరకూ రూ.27 వేలకోట్లు విత్‌డ్రా చేసినట్లు తెలుస్తోంది. ముడిచమురు ధరల పెరుగుదల, భౌగోళిక ఉద్రిక్తతలు పెరుగుతుండటం,గ్లోబల్ వృద్ధిపై అనిశ్చితి వల్లనే ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉన్నట్లు మార్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చి హిమాంశు శ్రీవాస్తవ అన్నారు. ఇక డాలర్ డినామినేషన్ బాండ్లు మంచి రాబడులు ఇస్తుండటంకూడా ఒక కారణంగా ఉంది. రూపాయిపై ఒత్తిడి పెరగడం, కరెంటు ఖాతాలోటు పెరుగు తుండటంతోనే ఎక్కువ విత్‌డ్రాలున్నాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ ముఖ్య వ్యూహకర్త వికె విజయ్‌కుమార్ తెలిపారు. ఈ ఏడాదిప్రారంభంలోనే రూపాయి డాలరుకు 90గా చెలామణి అయింది. ఈనెల 15న 96 రూపాయలకు చేరింది. చివరకు 96.14వద్ద ముగిసిందని గుర్తుచేసారు.

## భారతి లైఫ్‌లో 75శాతం వాటా ప్రుడెన్షియల్ కొనుగోలు



**ముంబయి, మే 17:** భారతి లైఫ్ ఇన్సూరెన్స్‌కంపెనీలో ప్రుడెన్షియల్ పిఎల్‌సి 75శాతం వాటా కొనుగోలుచేస్తున్నట్లు భారతి ఎంటర్‌ప్రైజెస్ ప్రకటించింది. భారతి లైఫ్ వెంచర్స్, ఇతర వాటాదారులనుంచి రూ.3500 కోట్లకు ఈ వాటాలు కొనుగోలుచేస్తోంది. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో ప్రుడెన్షియల్ అతి పెద్ద బీమా, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీగా కొనసాగుతోంది. ఈ లావాదేవీ ప్రాథమికంగా 3500 కోట్లు నగదురూపంలో ఉంటుంది. ప్రక్రియ పూర్తయిన తర్వాతమాత్రమే చెల్లింపులు ఉంటాయని ప్రుడెన్షియల్ ప్రకటించింది. ఈ లావాదేవీతో ప్రుడెన్షియల్‌నుంచి భారతి లైఫ్ వెంచర్స్‌కు అనూహ్య ప్రయోజనాలుంటాయని చెపుతున్నారు.అలాగే ప్రుడెన్షియల్ కూడా మార్కెట్‌లో మరికొంత నిలదొక్కుకునేందుకు వీలవుతుంది. అంతేకాకుండా ఐసిఐసిఐ ప్రుడెన్షియల్‌లైఫ్ కూడా భవిష్యత్తు వృద్ధిలో తోడ్పాటు నందిస్తుందని కొనుగోలు కంపెనీ వివరించింది. మిగిలిన మూలధనం ప్రుడెన్షియల్ స్వేఛ్ఛా మిగులు కింద ఉంటుందని కంపెనీ వివరించింది.షరతులకు లోబడి ప్రుడెన్షియల్ అవసరమైతే రూ.700 కోట్లవరకూ పెట్టుబడులు పెడుతుందనిచెపుతున్నారు. ఈ భాగస్వామ్యంతో భారతి లైఫ్ మరింత వృద్ధిలోకి రాగలదని భారతి ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపక ఛైర్మన్ సునీల్‌భారతి మిట్టల్ అన్నారు. ఈభాగస్వామ్యం కొత్త ఉపాధి అవకాశాలు కూడాపెంచుతుందన్నారు. భారత్, యుకెలమధ్య మరింతగా సంబంధాలు మెరుగుపడుతుందన్నారు. తమ కంపెనీకి భారత్ అత్యంత కీలకమార్కెట్‌గా నిలుస్తోందని ప్రుడెన్షియల్ పిఎల్‌సి సిఇఒ అనిల్ వాద్వాని అన్నారు. బీమారంగంలో తమకు 180ఏళ్ల చరిత్ర ఉందని స్థానికంగా భారతి లైఫ్‌కు ఉన్న విస్తరణ అవకాశాలు పెరుగుతాయన్నారు.

# టిసిఎస్ సిఇఒకు రూ.28.1 కోట్ల వేతనం

**ముంబయి,మే 17:** టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సీఈఓ కె.కృతివాసన్ ఈ ఏడాది రూ. 28.1 కోట్ల వేతనం అందుకున్నట్లు కంపెనీ ప్రకటించింది. గతంతో పోలిస్తే ఆయన మొత్తం ప్యాకేజీలో ఆరు శాతం పెరిగింది. టీసీఎస్‌లో ఒక సాధారణ ఉద్యోగి సగటు జీతం కంటే సీఈఓ జీతం 441 రెట్లు ఎక్కువగా ఉంది.ఈ భారీ వ్యత్యాసం జూనియర్, మిడ్‌లెవల్ ఉద్యోగుల వేతనాల పెరుగుదలపై చర్చకు దారితీస్తోంది. ప్రస్తుతం మెజారిటీ ఉద్యోగులు తమ వార్షిక ఇంక్రిమెంట్ల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఉద్యోగుల జీతాల పెంపు టీసీఎస్ సీఈఓ రెమ్యునరేషన్ సాధారణంగా టీసీఎస్ తనఉద్యోగులకు 4నుంచి 7 శాతం వరకు ఇంక్రిమెంట్లు ఇస్తుంటుంది. అద్భుతమైన ప్రతిభ కనబరిచే వారికి వారి



రోల్స్‌ను బట్టి డబుల్ డిజిట్ పది శాతానికి పైగా పెంపు లభించే అవకాశం ఉంది. చాలా మంది ఉద్యోగుల వార్షిక ఆదాయంలో వేరియబుల్ పే కీలక పాత్ర పోషిస్తుంది. కంపెనీ లాభాలు, వ్యక్తిగత లక్ష్యాల ఆధారంగా ఈ బోనస్‌లను సంస్థ నిర్ణయిస్తుంది. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్ వంటి సంస్థలు కూడా తమ టాప్‌ఎగ్జిక్యూటివ్‌లకు భారీ స్థాయిలోనే చెల్లిస్తున్నాయి. గ్లోబల్ టెక్ టాలెంట్ కోసం జరుగుతున్న పోటీలో ఈ అంకెలు కీలకంగా మారాయి. కొత్త ఉద్యోగాల్లో చేరేటప్పుడు మెరుగైన ప్యాకేజీల కోసం బేరమాడటానికి ఉద్యోగులు తరచుగా ఈ గణాంకాలను గమనిస్తుంటారు. జాబ్ మార్కెట్ నిలకడగా ఉండటంతో అట్రిషన్ రేట్లు (ఉద్యోగుల వలసలు) ఎట్టకేలకు తగ్గుముఖం పట్టాయి. అయితే,రిటర్న్ టు ఆఫీస్ ఆర్టీవో నిబంధన మాత్రం ఇప్పటికీ చాలా మంది ఉద్యోగులను కలవరపెడుతోంది. ప్రస్తుతం వర్క్ ఫోర్స్ యుటిలైజేషన్‌ను మెరుగుపరచడంపై మేనేజ్‌మెంట్‌టీమ్ ప్రధానంగా దృష్టి సారిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా ఈ వేతన ట్రెండ్స్ ఇలాగే కొనసాగుతాయా లేదా అని పరిశ్రమ నిపుణులు గమనిస్తున్నారు. ఎగ్జిక్యూటివ్‌ల సంపాదన పెరగడం అనేది కంపెనీ భవిష్యత్తు ఆదాయ వృద్ధిపై ఉన్న నమ్మకాన్ని సూచిస్తుంది.

# రూ.4వేల కోట్ల సమీకరణకు ముత్తూట్ ఫిన్‌కార్ప్ ఐపిఒ

**ముంబయి, మే 17:** ప్రైవేటురంగంలోని ముత్తూట్ ఫిన్‌కాప్ ఐపిఒకు సిద్ధం అవుతోంది. రూ.4వేలకోట్ల ఐపిఒ నిధులు సమీకరించే లక్ష్యంతో ఉంది. ఇందుకోసం స్టాక్ విభజనకు కూడా బోర్డు ఆమోదం తెలిపింది.రూ.10 ముఖవిలువ ఉన్న షేర్లను ఐదు షేర్లుగా అంటే రూ.2 విలువ గల షేర్లుగా విభజించేందుకు కంపెనీ బోర్డు ఏకీభవించింది. ఈ ఐపిఒద్వారా వచ్చే నిధులను కేవలం వ్యాపారాభివృద్ధి, కంపెనీ రుణ కార్యకలాపాలు మరింతగా విస్తరించేందుకు మాత్రమే వినియోగిస్తామన్నారు. అయితే స్టాక్ విభజన వాటాదారుల ఆమోదంతోపాటు ప్రభుత్వ క్లియరెన్సులు కూడా అవసరం అవుతాయి. ఐపిఒతో పాటే మూలధన నిధులమరింతగా సమీకరించాలని చూస్తోంది. పబ్లిక్ ఎన్‌సిడిలద్వారా రూ.4 వేల కోట్లు సమీకరించాలని, ఎన్‌సిడిల జారీ ద్వారానే ఈనిధులు తెచ్చుకోవచ్చని భావిస్తోంది. అలాగే ఎన్‌సిడిలు,డెట్ ఉత్పత్తులద్వారా ప్రైవేటు ప్లేస్‌మెంట్ పద్ధతిలో మరో రూ.4 వేల కోట్లు సమీకరించే ప్రయత్నాల్లో ఉంది. వీటన్నింటికంటే వాటాదారుల ఆమోదం పొందినతర్వాత భారీ ఎత్తున వాణిజ్య బాండ్లుకూడా జారీకి యోచిస్తోంది. రూ.30వేల కోట్లపరిమితికి మించకుండా నిధులు సమీకరించేందుకు చూస్తోంది.

బంగారం తనఖా రుణాలపైనే ఎక్కువ ఫోకస్ పెట్టిన ఈ నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ ఈ ఏడాది రూ.1847.62క ఓట్ల నికరలాభం ఆర్జించింది. ఐపిఒకోసం సెబీకి డిఆర్‌హెచ్‌పి దాఖలు చేసేందుకు సిద్ధం అవుతోంది.

## మైక్రో యూనిట్లకు పీఎంఎఫ్ఎంఇ స్కీం లబ్ధిదారులకు 10 లక్షల సబ్సిడీ




**న్యూఢిల్లీ, మే 17:** స్వయం ఉపాధిని మరింతగా ప్రోత్సహించే దిశగా ఆహారశుద్ధిరంగంలో మైక్రో యూనిట్లకు మరింతగాకేంద్రం ఆర్థిక చేయూతనిస్తోంది. ఇందుకోసం ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రోఫుడ్‌ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ అంటే పిఎంఎఫ్ఎంఇ పథకం కింద రూ.10లక్షల సబ్సిడీని కూడా అందిస్తోంది. మొత్తంప్రాజెక్టు వ్యయంలో 35శాతం లేదా అత్యధికంగా పదిలక్షల క్రెడిట్ లింక్డ్ క్యాపిటల్ సబ్సిడీని అందిస్తుంది. మిగిలిన మొత్తం బ్యాంకులనుంచి సులభమైన వ్యాపారరుణాల రూపంలో పొందేవీలుంటుంది. వ్యాపారం ప్రారంభించేందుకు చేతిలో నగదు సులభంగా అందుబాటులోకి వస్తుంది. 18 ఏళ్ల వయసుతోపాటు కనీసం 8వ తరగతి ఉత్తీర్ణుఉలైన ఎవ్వరైనా దరఖాస్తుచేసుకోవచ్చని పిఎంఎఫ్ఎంఇ చెపుతోంది. స్వయంసహాయక సంఘాలు, రైతు ఉత్పాదక సంస్థలు, సహకార సంఘాలుకూడా ఉమ్మడి మౌలిక వసతుల కల్పన, ఆహారశుద్ధియూనిట్లకోసం రుణం, సబ్సిడీకూడా పొందే వీలుంటుంది. వన్‌డిస్ట్రిక్ట్ వన్‌ప్రొడక్ట్ ఒడివోపీ కింద ఎంపికచేసిన ఉత్పత్తులయూనిట్లకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. ఆన్‌లైన్‌లోకూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్;పాన్‌కార్డులు, విద్యార్హతలు, బ్యాంక్ పాస్‌బుక్, ఖాళీ రద్దయిన చెక్కు, వ్యాపార ప్రాజెక్టు రిపోర్టు, ఉద్యమ్ రిజిస్ట్రేషన్ లావాదేవీల వివరాలు వంటివి ఆన్‌లైన్‌లోనే భర్తీచేస్తే పరిశీలనచేసి రుణానికి, సబ్సిడీకి అర్హత పొందుతారు. జిల్లాకమిటీ పరిశీలన తర్వాత బ్యాంకులకు వెళతాయి. బ్యాంక్ అధికారులు ప్రాజెక్టును అంచనావేసి రుణంతోపాటు సబ్సిడీని మంజూరుచేస్తారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.